

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 29-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 43 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం తిథి: తదియ రా.11.19 తదుపరి చవితి, నక్షత్రం: ఆర్ద్ర రా.10.39 తదుపరి పునర్వసు, వర్జ్యం: ఉ.8.14-9.43, దుర్ముహూర్తం: ఉ.10.03-10.54, మ.3.14-4.05, అమృతఘడియలు: మ.1.24-2.53, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.41 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





యువగళం - టీడీపీ మూడవ తరం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు గౌ॥ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో
కడపలో చారిత్రాత్మకంగా నిలిచిన మహానాడు,
తెలుగుదేశం మూల సిద్ధాంతాలను మరువకుండా
నేటితరం మార్పులకు అనుగుణంగా వచ్చే 40 సంవత్సరాల
తెలుగుదేశం పార్టీ యువ అధినేతగా తెలుగు జాతి సమగ్రాభివృద్ధికి
6 శాసనాలు ఇచ్చిన నారా లోకేష్ గారికి కృతజ్ఞతలతో...



నేడు (మే 29 మధ్యాహ్నం 2.00 గంటలకు) కడపలో జరగనున్న మహానాడు
భారీ బహిరంగ సభకు విచ్చేస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు,
నాయకులకు, అతిరథ మహారథులకు స్వాగతం - సుస్వాగతం.

మీ **చమర్తి జగన్‌మోహన్‌రాజు**
తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు,









బుధవారం ఎన్టీఆర్ 102వ జయంతి. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌ను సందర్శించి, నివాళులు అర్పించారు.

అందుకే పవన్ కల్యాణ్ సీరియస్‌గా తీసుకున్నాడు



- రాజేంద్రప్రసాద్

'పవన్ కల్యాణ్ ఇప్పుడు సాదాసీదా వ్యక్తి కాదు. ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం. గొప్ప పదవిలో ఉన్నాడు. ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత ఆయనపైన ఉంది. కాబట్టే థియేటర్ల మూసివేత అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నాడు' అని నటుడు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఆయన కీలకపాత్రలో నటించిన 'షష్టిపూర్తి' చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడారు. 'మా పవన్ ఫీలయ్యాడు అంటే అందులో బాధ్యత ఉంటుంది. 'నాసినిమా విడుదలకు ముందు ఇలా చేయడం ఏంటి' అని ఆయన ఆవేదనకు గురవడం సహజం. అందుకే 'ఏం జరిగిందో కనుక్కోండి, ఆపండి' అన్నాడు. ఆయనది మంచి నిర్ణయమే. దీనికంతటికీ కారకులు ఎవరో వాళ్లను పట్టుకొని ఎందుకు ఇలా జరిగిందో తెలుసుకుంటే గనుక ఈ సమస్య ఇంతటితో సమసిపోతుంది. అందుకే పవన్ కల్యాణ్ బాధ్యత తీసుకొని ఎందుకలా జరిగింది కనుక్కోమని అధికారులను ఆదేశించారు. ఎవరో ఒక పిచ్చి నిర్ణయం తీసుకుంటే అది మీడియాలో ప్రముఖంగా ప్రచారం అయింది. థియేటర్ల మూసివేత అనేది చిన్న విషయం కాదు ?ఎవరో ఒకరు నిర్ణయం తీసుకున్నంత మాత్రాన సరిపోతుందా? అందర్నీ తప్పుదారి పట్టించారు. కానీ అందరి ఆమోదం లేకపోబట్టే చివరకు అది వీగిపోయింది' అని చెప్పారు.

హృతిక్‌తో హోంబలే ఫిల్మ్స్ చిత్రం



'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి పలు భారీ, విభిన్న చిత్రాలు నిర్మిస్తూ భారతీయ చిత్ర పరిశ్రమలో పెద్ద నిర్మాణ సంస్థల్లో ఒకటిగా ఎదిగిన హోంబలే ఫిల్మ్స్ సంస్థ ఇప్పుడు బాలీవుడ్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్‌తో చేతులు కలిపింది. ఇది హృతిక్ అభిమానులకు, సినిమా ప్రేమికులకూ ఆనందకరమైన వార్తే. ఈ సందర్భంగా హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ మాట్లాడుతూ 'స్ఫూర్తిదాయకమైన కథలను చెప్పాలన్న ఉద్దేశంతో ముందుకు వెళుతున్నాం. హృతిక్ రోషన్‌తో ఓ గొప్ప సినిమా ఎక్స్‌పీరియన్స్ అందించాలన్న లక్ష్యాన్ని సాకారం చేస్తాం. ఆ సినిమా ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది' అన్నారు. హృతిక్ రోషన్ మాట్లాడుతూ 'వైవిధ్యమైన చిత్రాలు అందిస్తున్న హోంబలే ఫిల్మ్స్ వంటి సంస్థతో కలసి పని చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. మేం పెద్ద కలలు కంటున్నాం. వాటిని నిజం చేసేందుకు అంకిత భావంతో పని చేస్తాం' అన్నారు.





www.andhrajyothy.com

విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


గురువారం | 29-5-2025

ఎన్టీఆర్.. మనందరికీ స్ఫూర్తి



సమాజ సేవలో, పేదలు, నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఎన్టీఆర్.. ఎంతగానో ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఆయన నటించిన సినిమాలు నేటికీ అలరిస్తున్నాయి. ఆయన మనందరికీ ఎనలేని స్ఫూర్తిని అందించారు. నా మిత్రుడు చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీయే ప్రభుత్వం ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తోంది.

-ఎక్స్‌లో ప్రధాని మోదీ



బుధవారం మహానాడులో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

ఎన్టీఆర్ వారసత్వాన్ని కాపాడుకుంటున్నాం.. భావి నాయకత్వాన్ని సిద్ధం చేస్తున్నాం: బాబు

ఎవర్నీ వదలం

తప్పు చేస్తే ఎవరైనా శిక్షార్హులే: సీఎం

- చండశాసనుడిగా వ్యవహరిస్తా.. టీడీపీ హయాంలోనే శాంతిభద్రతలు
- నక్సలిజం, ఫ్యాక్షనిజం, రౌడీయిజాన్ని రూపుమాపాం
- జగన్ జమానాలో ప్రజల ఆస్తులకు రక్షణ లేదు.. నేరాలను వ్యవస్థీకృతం చేశారు
- గ్రామస్థాయి పరిశ్రమగా గంజాయి సాగు.. గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తే ఆస్తులు జప్తు
- సీమను సుభిక్షం చేస్తా.. ఈ ఏడాది రూ.3,800 కోట్లతో సీమ ప్రాజెక్టుల అభివృద్ధి
- 10 రోజుల్లో కడప ఉక్కుకు శంకుస్థాపన.. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ
- బనకచర్ల అనుసంధానంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ నీరు
- సముద్రంలోకి పోయే నీరే వాడుకుంటున్నాం.. బీఆర్ఎస్‌వి లేనిపోని విమర్శలు
- తెలంగాణ ప్రాజెక్టులు కడితే మేం అభ్యంతరం చెప్పలేదు
- 2027కి పోలవరం ప్రాజెక్టు పూర్తి.. ఫైనాన్షియల్ హబ్‌గా ఉత్తరాంధ్ర
- అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్.. క్లీన్, గ్రీన్, ఎనర్జీ హబ్‌గా రాష్ట్రం
- రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు.. 7.5 లక్షల మందికి ఉద్యోగాలు
- కరెంటు చార్జీలు పెంచం.. మహానాడు 2వ రోజు ముగింపు ప్రసంగం

(మహానాడు ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

తప్పు చేస్తే ఎవరైనా శిక్షార్హులేనని, ఎవరినీ వదిలిపెట్టేది లేదని సీఎం చంద్రబాబు తేల్చిచెప్పారు. టీడీపీ హయాంలోనే శాంతిభద్రతలు నియంత్రణలో ఉంటాయన్నారు. నక్సలిజం.. ఫ్యాక్షనిజం, రౌడీయిజాన్ని రూపుమాపిన పార్టీ తెలుగుదేశం అని స్పష్టంచేశారు. ప్రపంచంలో తెలుగు జాతిని అగ్రస్థానంలో నిలబెట్టే శక్తిసామర్థ్యాలు ఒక్క టీడీపీకే ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కడప మహానాడులో రెండో రోజు బుధవారం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన ముగింపు ప్రసంగం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేదన్నారు. గంజాయి, డ్రగ్స్ రాజ్యమేలాయని.. ఏజెన్సీలో గంజాయి సాగు గ్రామస్థాయి పరిశ్రమగా మారిందని చెప్పారు. నేరాలను వ్యవస్థీకృతంగా మార్చేశారని

మిగతా 10వ పేజీలో...

మన కార్యకర్తలను ఇబ్బంది పెట్టడానికి ప్రత్యర్థి పార్టీ అనేక పన్నాగాలు పన్నుతోంది. తెలుగుదేశం ముసుగేసుకుని తప్పులు చేస్తే ముసుగు తొలగిస్తాం. ఏం చేయాలో అది చేస్తాం.

- చంద్రబాబు

5 లక్షల మందితో నేడు సభ

50 నియోజకవర్గాల నుంచి భారీగా సమీకరణ

ఉమ్మడి కడప జిల్లా తరఫున 2.10 లక్షల మంది!

రెండో రోజు మహానాడులో పలు తీర్మానాలు

నన్నూరి ప్రాసలు.. నోరూరించే వంటకాలు

సమగ్ర కథనాలు 10, 11లో



జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న చంద్రబాబు

జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఏకగ్రీవ ఎన్నిక

12వ సారి టీడీపీ అధినేతగా ప్రమాణం

నేతలూ జాగ్రత్త!

- కొందరు మన దగ్గర ఉంటూ ప్రత్యర్థులకు కోవర్టులుగా పనిచేస్తున్నారు
- మన వేలితో మన కన్నే పొడుస్తున్నారు
- వలస పక్షులు వస్తాయి.. పోతాయి
- నిజమైన కార్యకర్త నిలిచే ఉంటాడు

ఎన్నికల తర్వాత వచ్చేవారిని ప్రోత్సహించొద్దు: బాబు



లోకేశ్ యువగళం పుస్తకాన్ని అందుకుంటున్న చంద్రబాబు

మద్యం ముడుపుల

గుట్టు రట్టు!

స్కామ్‌పై ఎట్టకేలకు నోరు విప్పిన కసిరెడ్డి

- ఆధారాలు ముందుపెట్టి రాబట్టిన ఈడీ
- బెజవాడ జైలులో ప్రశ్నించిన అధికారులు
- ఆ ముడుపులు చేర్చింది ఎక్కడికి?
- స్కామ్‌లో అంతిమ లబ్ధిదారు ఎవరు?
- 7 గంటలపాటు 100 ప్రశ్నలు
- నాకేం సంబంధమంటూ తొలుత కసిరెడ్డి బుకాయింపు
- లావాదేవీలు చూపడంతో నోరు విప్పిన ఏ1
- త్వరలో అసలు దొంగ బయటికి?



అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన 3,500 కోట్ల రూపాయల మద్యం కుంభకోణంలో దర్యాప్తు దాదాపుగా ఓ కొలిక్కి వచ్చింది. దేశంలోనే అతిపెద్ద లిక్కర్ స్కామ్‌లో ముడుపులు ఎక్కడికి చేరాయి? 'అంతిమ లబ్ధిదారు' ఎవరన్నది పక్కా ఆధారాలతో సహా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాదాపుగా తేల్చేసింది. ప్రభుత్వ మద్యం షాపుల పాలసీ పేరిట నాసిరకం మద్యం

మిగతా 12వ పేజీలో...

నకిలీ ఖాతాలతో పోస్టులు

- సజ్జల భార్గవ్‌రెడ్డి కేసులో పోలీసుల గుర్తింపు
- విచారణలో పలు ప్రశ్నలకు జవాబులు దాటవేత
- కొన్నింటికి తెలియదని సమాధానాలు

7

- మళ్లీ విచారణకు పిలుస్తాం: దర్యాప్తు అధికారి



మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌కు వస్తున్న సజ్జల భార్గవ్‌రెడ్డి



కడపలో ఓ విద్యార్థినికి సోషల్‌లో 21 మార్కులు వేశారు. పునఃమూల్యాంకనంలో 84 మార్కులు రావడంతో మూల్యాంకనంలో తప్పు బయటపడింది.

బాపట్ల జిల్లాలో ఓ విద్యార్థినికి సోషల్‌లో 23 మార్కులే వచ్చాయి. పునఃమూల్యాంకనం చేయిస్తే ఏకంగా 96 వచ్చాయి. దీంతో గురువుల నిర్లక్ష్యం వెలుగు చూసింది.

పదో తరగతిలో

'దిద్దుపాట్లు'

- జవాబు పత్రాల మూల్యాంకనంలో ఉపాధ్యాయుల తీవ్ర నిర్లక్ష్య వైఖరి
- హడావుడిగా దిద్దేసిన గురువులు
- ఫలితంగా మార్కుల్లో భారీ తేడాలు
- పునఃమూల్యాంకనంతో వెలుగులోకి
- రీకౌంటింగ్, రీవాల్యుయేషన్‌కు 66,363 దరఖాస్తులు
- 11 వేల పేపర్లలో మారిన 'ఫలితం'
- సీఎం అసంతృప్తి.. తీవ్ర స్పందన
- ఐదుగురు బాధ్యులపై సస్పెన్షన్ వేటు

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షల మూల్యాంకనంలో గురువుల తొందర.. విద్యార్థులకు శాపంగా మారింది!. మూల్యాంకనాన్ని తొందరగా పూర్తి చేసేయాలన్న ఉద్దేశంతో జవాబు పత్రాలను సంపూర్ణంగా పరిశీలించకుండానే ఎడా పెడా దిద్దేయడంతో విద్యార్థులు మార్కులు కోల్పోయారు. దీనిపై అనుమానం వచ్చిన వేలాది మంది విద్యార్థులు పునః మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోగా.. ఉపాధ్యాయులు చేసిన తప్పులు

మిగతా 12వ పేజీలో...

అన్నదాతకు

మద్దతు

వరి సహా 14 పంటలకు కనీస మద్దతు ధర పెంపు



- ధాన్యానికి రూ.69, పెసలుకు 86, పత్తికి 589, ఆవాలకు 820 పెంపు
- ఖరీఫ్ సీజన్ నుంచే అమలు
- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం

ఖర్చుకు, మద్దతుకు పొంతనే లేదు: రైతు సంఘాలు

అమరావతి/న్యూఢిల్లీ, మే 28(ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలను(ఎంఎస్‌పీ) పెంచుతూ కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. వరి, పప్పుధాన్యాలు, నూనె గింజలు సహా మొత్తం 14 రకాల ఉత్పత్తులకు మద్దతు ధరలను పెంచింది. వరికి 3 శాతం, పప్పుధాన్యాలు 5.96 శాతం, నూనె గింజలకు 9 శాతం చొప్పున ఎంఎస్‌పీ పెరగనుంది. పెంచిన ధరలు 2025-26 ఖరీఫ్

మిగతా 9వ పేజీలో...

నెల్లూరు టు బద్వేల్ రయ్..రయ్

4 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు కేంద్రం ఓకే



- 108 కి.మీ దూరం.. 3,653 కోట్ల అంచనా
- సీమ పారిశ్రామికాభివృద్ధిలో కీలక ప్రాజెక్టు
- ఇప్పటికే పూర్తయిన భూసేకరణ పనులు
- వచ్చే నెలలో టెండర్లు పిలిచే అవకాశం
- ముంబై హైవేపై తగ్గనున్న ట్రాఫిక్, ప్రమాదాలు

నెల్లూరు/న్యూఢిల్లీ, మే 28(ఆంధ్రజ్యోతి): కడప-నెల్లూరు జిల్లాల మధ్య కీలక ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. రాయలసీమ కనెక్టివిటీకి అత్యంత కీలకమైన గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి


మిగతా 12వ పేజీలో...

ఫ్రెషర్స్ ఆశలపై ఏఐ నీళ్లు!

- తగ్గుతున్న కొత్త పట్టభద్రుల నియామకాలు
- 2019తో పోలిస్తే 2024కి 50 శాతానికి పైగా తగ్గుదల
- దిగ్గజ కంపెనీల్లో 15 % నుంచి 7 శాతానికి తగ్గుముఖం
- స్టార్టప్ సంస్థల్లో ఏకంగా 30 శాతం నుంచి 6 శాతానికి
- ఏఐ నైపుణ్యాలు పెంచుకుంటే మాత్రం బోలెడు కొలువులు
- వెంచర్ క్యాపిటల్ సంస్థ 'సిగ్నల్‌ఫైర్' తాజా నివేదిక

9

ఆరుగురు ఎమ్మెల్యేలను తెస్తా మంత్రి పదవి ఇస్తారా?




- కాంగ్రెస్‌కు కవిత ప్రతిపాదన
- టీపీసీసీ స్థాయిలో సుముఖత
- అధిష్ఠానానికి నివేదన

9

బంద్ చేయాలన్నది దిల్‌రాజు సోదరుడే

- హరిహర వీరమల్లుపై కుట్రతోనే 'థియేటర్ల' వివాదాన్ని తెరపైకి తెచ్చారు
- డైవర్ట్ చేయడానికి దిల్‌రాజు నన్ను టార్గెట్ చేశారు
- పార్టీకి ముడిపెట్టి పవన్‌కు తప్పుడు సమాచారం
- ఆయన నాకు దేవుడితో సమానం.. కుట్ర చేస్తానా
- బంద్ అన్న మాటే నేను అనలేదు.. 'ఆ నలుగురు'.. దిల్‌రాజు, శిరీష్ రెడ్డి, ఏషియన్ ఫిల్మ్స్ సునీల్, సురేశ్‌బాబు: 'జనసేన' అనుశ్రీ సత్యనారాయణ



అనుశ్రీ

థియేటర్లలో కొనసాగిన తనిఖీలు

నిబంధనల ఉల్లంఘనలపై నోటీసులు

12

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాటల యుద్ధం

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఉద్దేశించి డోనాల్డ్ ట్రంప్ అన్నేసి మాటలన్న తరువాత రష్యా ఊరుకుంటుందా? బుధవారం సీనియర్ నాయకుడు దిమిత్రీ మెద్వదేవ్ ఏకంగా మూడో ప్రపంచయుద్ధానికి సిద్ధమన్న రీతిలో వ్యాఖ్యలు చేశారు. తమ అధ్యక్షుడిని ట్రంప్ పిచ్చోడన్నందుకు ఈయనకు మా చెడ్డ కోపం వచ్చింది. అధికారంలోకి వచ్చిన అరగంటలోనే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఆపేస్తానన్నంత స్థాయిలో గొప్పలకు పోయిన ట్రంప్‌కు ఆ పనిచేయలేకపోతున్నందుకు చాలా చిరాకుగా ఉంది. పుతిన్ దారికొస్తాడన్న నమ్మకం తరిగిపోతూండటంతో ఇటీవల ట్రంప్ మాటల్లో పుతిన్‌మీద కోపం హెచ్చింది. వందలాది మిసైళ్ళు, డ్రోన్లతో ఆదివారం ఉక్రెయిన్ మీద రష్యా జరిపిన దాడి ఇప్పటి వరకూ యుద్ధంలో చూడనిది. కాల్పుల విరమణకు సిద్ధపడకుండా ఇలా సామాన్యులను పుతిన్ చంపుతున్నందుకు ట్రంప్‌కు కోపం వచ్చింది. హద్దులు దాటిమాట్లాడటం అలవాటే కనుక, ఇప్పటివరకూ తానే రష్యాను రక్షిస్తున్నట్టూ, తానే గనుక లేకపోతే ఈపాటికి రష్యాకు అత్యంత చెడు దాపురించి, ఏకంగా చెరిగిపోయేదన్నట్టుగా ట్రంప్ మాట్లాడారు. పుతిన్ నిప్పుతో చెలగాటమాడుతున్నారనడమే కాదు, తన ప్రభావ ప్రాభవాలవల్లనే రష్యా ఇంకా ఉనికిలో ఉన్నదన్నట్టుగా ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లో మూడో ప్రపంచయుద్ధం హెచ్చరిక రష్యాకు కనిపించినట్టుంది.

కొంతకాదు, పుతిన్‌కు మొత్తం ఉక్రెయిన్ కావాలని తాను ఎప్పటి నుంచో చెబుతున్నానని, ఆ అత్యాశ రష్యా పతనానికి దారితీస్తుందని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. అంత కచ్చితంగా చెప్పగలిగిన ట్రంప్ ఇంతకాలమూ అదే వ్యక్తిని ఎందుకు నమ్మారో, వెనకేసుకొచ్చారో తెలియదు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని ఓవల్ ఆఫీసులో అమెరికా అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎంతగా అవమానించారో చూశాం. అసలు, యుద్ధం మొదలుకావడానికి జెలెన్‌స్కీ కారకుడని, కొండలాంటి రష్యాని ఢీకొని తనదేశాన్ని నాశనం చేస్తున్నాడని ట్రంప్ అప్పట్లో మండిపడ్డారు. అచ్చంగా పుతిన్ భాషనే ట్రంప్ కూడా వాడుతూండటంతో జెలెన్‌స్కీకి విషయం అర్థమైపోయింది. ఓవల్ ఆఫీసులో ట్రంప్‌తో ఘర్షణపడినప్పటికీ ఆ తరువాత ట్రంప్ కోరిక మేరకు, యుద్ధానికి అమెరికా అందించిన ఆయుధసాయానికి రుణం తీర్చుకోవడంలో భాగంగా అమెరికాకు అతివిలువైన, అరుదైన లోహాలను అప్పగించడానికి జెలెన్‌స్కీ సిద్ధపడ్డారు. రష్యా కూడా ట్రంప్‌కు ఇదేరకమైన ఆఫర్ ఇచ్చిన విషయాన్ని అటుంచితే, యుద్ధాన్ని ఆపేందుకు ఒక బలమైన ప్రయత్నం జరుగుతోందని, కాల్పుల విరమణ జరిగి, అంతిమంగా ఏదో ఒప్పందం మేరకు యుద్ధం ఆగుతుందన్న ఆశలు క్రమంగా అడుగంటిపోతున్నాయి.

ఒప్పందం కుదిరితేనే కాల్పుల విరమణ అని రష్యా పట్టుబడుతోంది. కాల్పులు ఆపడమంటే ఉక్రెయిన్‌కూ దానికి వెన్నుదన్నుగా ఉన్న పాశ్చాత్యదేశాలకూ కూడదీసుకోవడానికి సమయం ఇవ్వడమేనని, మళ్ళీ అవే పాతవిధానాల కొనసాగింపును అనుమతించడమేనని రష్యా వాదన. అందువల్ల, నాటో విస్తరణ, ఆయుధ సరఫరాలు, ఉక్రెయిన్ భూభాగాల అప్పగింత ఇత్యాది అన్ని విషయాలూ నిర్దిష్టంగా తేలి, ఒప్పందం కుదిరేవరకూ రష్యా యుద్ధం ఆపదల్చుకోలేదు. యుద్ధానికి కారణం నాటో విస్తరణే కనుక అది ఆగుతుందనీ, ఉక్రెయిన్‌తో పాటు మరికొన్ని మాజీ సోవియట్ యూనియన్‌దేశాలు కూడా అందులో చేరబోవని రష్యాకు హామీ దక్కాలి. ఇకపై ఉక్రెయిన్ ఎవరివైపూ వొంగకుండా తటస్థంగా ఉండాలని, ఆంక్షలు ఎత్తివేసి, స్తంభింపచేసిన రష్యన్ ఆస్తులను విడుదల చేయాలని రష్యా చాలా డిమాండ్లు చేస్తోంది. ఇవన్నీ అటుంచితే, అసలు ట్రంప్ శాంతియత్నాలమీద జెలెన్‌స్కీకి నమ్మకం లేన్నట్టు కనిపిస్తోంది. రష్యా–అమెరికా మధ్య సాగుతున్న ఈ వాగ్యుద్ధం కూడా ఆయనకు నాటకంగానే తోస్తోంది. యుద్ధం ఇప్పట్లో ఆపకుండా, పుతిన్‌ను సాధ్యమైనన్ని ఉక్రెయిన్ భూభాగాలను స్వాధీనం చేసుకోనిచ్చి, శాంతిఒప్పందంలో భాగంగా వాటిని ఆయనకే కట్టబెట్టే ఆలోచనలో ట్రంప్ ఉన్నారని ఈయన అనుమానం. అమెరికా–రష్యా అధ్యక్షులతోపాటు తాను కూడా కూచుంటేనే చర్చలు విజయవంతమవుతాయని అదేపనిగా జెలెన్‌స్కీ పోరుతున్నారు. కాల్పుల విరమణో, నేరుగా ఒప్పందమో అతిత్వరలో జరగనిపక్షంలో రష్యామీద మరిన్ని ఆంక్షలు విధించాల్సిన అగత్యం ట్రంప్‌కు తప్పదు. రష్యాను వేధిస్తున్నకొద్దీ ఇరాన్, ఉత్తర కొరియా, చైనాలతో పాటు మరిన్ని దేశాల మోహరింపుతో యుద్ధం విస్తరించే ప్రమాదం హెచ్చుతుంది.

మనం మరచిపోయిన జాతీయవాదం

భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని వ్యవస్థాపించిన భారత జాతీయవాదం భ్రష్టమైపోలేదూ? ఇటీవలి భారత్–పాకిస్థాన్ సైనిక సంఘర్షణలు, తదనంతర పరిణామాలే ఆ పతనానికి నిదర్శనం. మనం 'అతి జాతీయవాదులు'గా రూపొందామని నేను అనడం లేదు. మన జాతీయవాదం అతిగా అనుకరణప్రాయమైపోవడమే అసలు సమస్య. భారత జాతీయవాద సమున్నత వారసత్వాన్ని ఒక కాపీ క్యాట్ (అంధానుకర్త) జాతీయవాదం స్వాయత్తం చేసుకున్నది. ఒక హిందూ–పాకిస్థాన్‌ను సృష్టించడానికి ప్రయత్నిస్తోంది. ఈ పథ భ్రష్టత్వానికి నరేంద్ర మోదీని, బీజేపీని, ఆరెస్సెస్‌ను తప్పుపట్టలేము.



అలీఖాన్ మహమూదాబాద్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశాలు (అతడి సోషల్ మీడియా పోస్టులపై దర్యాప్తునకు ముగ్గురు ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది) మాత్రమే కాకుండా ఆ కేసు విచారణ జరిగిన తీరుతెన్నులూ దిగ్భ్రాంతికరంగా ఉన్నాయని చెప్పక తప్పదు. పౌరుల హక్కుల కంటే జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నట్టు ఆ కేసు విచారణ తేటతెల్లం చేసింది. యుద్ధకాలంలో అయినా ఒక మోస్తరు భిన్నాభిప్రాయాలను, ప్రశ్ననూ సహించలేకపోవడం భారత జాతీయవాద సంప్రదాయానికి విరుద్ధం. జాతీయవాదం, పౌర స్వేచ్ఛల మధ్య పోటీ పెట్టడం, వాటిలో ఒకదాన్ని ఎంచుకోమనడం భారత జాతీయవాద సంప్రదాయం కానేకాదు. క్విట్ ఇండియా ఉద్యమ నాయకుడు జయప్రకాశ్ నారాయణ్‌ను అడగండి. తన జాతీయవాదం, కశ్మీర్, నాగాలాండ్ వ్యవహారాలపై సత్యం చెప్పడంలో తన విధ్యుక్త ధర్మం మధ్య ఘర్షణ ఉన్నదని ఆయన భావించలేదు. 1962 యుద్ధం అనంతరం కూడా ఆయన చైనా ప్రజల పట్ల తన స్నేహ భావాన్ని నిర్భయంగా వ్యక్తం చేశారు.

పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వ్యతిరేకంగా జాతీయవాదానికి ప్రాధాన్యమివ్వడమంటే ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జాతీయవాదానికి ప్రాముఖ్యమివ్వడమే. ఆపరేషన్ సిందూర్‌ను హృదయపూర్వకంగా సమర్థించినవారు సైతం ప్రజాస్వామిక జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తే పాలకుల దృష్టిలో జాతి వ్యతిరేకులు అయిపోతున్నారు! కాల్పుల విరమణ విషయమై మన ప్రభుత్వ అధికారిక వైఖరికి భిన్నమైన అభిప్రాయాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పలుమార్లు వ్యక్తం చేశారు. ఇబ్బందికరమైన వాదనలూ ఆయన బహిరంగంగా చేశారు. అయితే ఈ విషయమై ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించడం లేదు. ప్రభుత్వ మౌనాన్ని నిశితంగా విమర్శించిన వారిపై ప్రశ్నలు గుప్పిస్తున్నారు.

అటల్ బిహారీ వాజపేయిని గుర్తుచేసుకోండి. 1962 యుద్ధంలో భారత్ పరాజయంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నెహ్రూ అనుసరించిన చైనా విధానాన్ని రామ్‌మనోహర్ లోహియా తీవ్రంగా విమర్శించారు. వాజపేయిని కానీ, లోహియాను కానీ ఎవరూ జాతి వ్యతిరేకులు అని నిందించలేదు.

దేశ ప్రజల కంటే జాతే ముఖ్యమని ప్రతిపాదిస్తున్నారు. సైద్ధాంతిక, సాంస్కృతిక భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణను జాతి వ్యతిరేకమైనవిగా పరిగణిస్తున్నారు.

> హిందీ–హిందూ–హిందుస్థాన్ జాతీయవాదంగా భారత జాతీయవాదం భ్రష్టమవడం మన కాలం చవిచూస్తున్న ఒక మహా విషాదం. ప్రస్తుత పాలనా వ్యవస్థ, దాని సైద్ధాంతిక సమర్థకులే ఈ పతనానికి పూర్తి బాధ్యులుగా భావించడం పొరపాటు. ప్రస్తుత శోచనీయ పరిస్థితులకు ఉదారవాద, లౌకిక, ప్రగతిశీల మేధోశ్రేణులు తమవంతు బాధ్యతను అంగీకరించి తీరాలి.

తర్కాన్ని తలకిందులు చేస్తున్నారు. పహల్గాం అనంతరం కశ్మీరీలు, ముస్లింలపై దాడి చేసినవారు కాకుండా మతపరమైన చీలికలు సృష్టిస్తున్నారనే ఆరోపణను అలీఖాన్ మహమూదాబాద్ ఎదుర్కొంటున్నారు. కల్నల్ సోఫియా ఖురేషిని పాకిస్థాన్ సోదరి అని బీజేపీ మంత్రి విజయ్ షా ఆక్షేపించగా, ఆమెను అవమానపరిచారనే అభియోగాన్ని మహమూదాబాద్‌పై మోపారు. సమైక్యత స్థానంలో ఏకరూపతకు ప్రాధాన్యమిస్తున్నారు. పహల్గామ్ అమానుష విషాదం సమస్త భారతీయులను ఏకం చేసిన తరుణంలో కూడా ఒక అంతర్గత శత్రువు అవసరమయ్యాడు. ఈ ధోరణి భారత జాతీయవాదానికి పూర్తిగా విరుద్ధం. భిన్నసామాజిక వర్గాలవారిని, భిన్న ప్రాంతాలను సమైక్యపరిచిన సర్దార్ పటేల్ స్ఫూర్తి ఏమైపోయింది?



■ యోగేంద్ర యాదవ్

మహోన్నత భారత స్వాతంత్ర్య పోరాటం నుంచి మనకు వారసత్వంగా సంక్రమించిన జాతీయవాదం చాలా భిన్నమైనది. అమెరికన్ న్యాయశాస్త్ర కోవిదుడు జాన్ ఎ పావెల్ ప్రతిపాదించిన ఒక భావన ప్రకారం భారత జాతీయవాదం మౌలిక లక్ష్యం, లక్షణం 'స్వ–పర తేడా లేకుండా ఒక విశాల సమ్మిళిత సమూహంలో భాగస్వాములం కావడమే'. బాహ్య, అంతర్గత శత్రువులను కల్పించుకోకుండా ఒక ప్రగాఢ జాతీయ అనుబంధ భావనను సృష్టించి పెంపొందించడం ద్వారా జాతిని నిర్మించేందుకు ఆనాటి మన జాతీయవాదం ప్రయత్నించింది. దాని శత్రువు వలసవాదమే కాని ఒక దేశం లేదా ఒక జాతి కానే కాదు. భారత జాతీయవాదం మనలను ఇరుగు పొరుగు దేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించేందుకు పురిగొల్పలేదు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల వలసపాలన వ్యతిరేక ఉద్యమాలతోను, దక్షిణాఫ్రికాలో వర్ణ వివక్ష వ్యతిరేక పోరాటంతో మమేకం చేసింది. సమస్త భారతీయుల మధ్య ఒక సమైక్యతా భావం సంపూర్ణంగా వర్ధిల్లేలా చేసేందుకు భారత జాతీయవాదం అంకితమయింది. భారతీయ అస్తిత్వానికి ఒక సమగ్ర గుర్తింపును సమకూర్చేందుకు భాషల బహుళత్వాన్ని, ప్రాంతాల వైవిధ్యాన్ని, మతాల విలక్షణతలను అది సంపూర్ణంగా గౌరవించింది. జాతీయ ఐక్యత ఒక స్వతస్సిద్ధ స్థితిగా ఉందని భావించలేదు. అందరూ ఒకేలా ఉండాలని ఒత్తిడి చేయకుండా తేడాలు విలువైనవని అంగీకరిస్తూ కలిసి మెలిసి ఉండేలా జాతీయ ఐక్యతను దృఢతరం చేసేందుకు అంకితభావంతో కృషి చేసింది. మైనారిటీ వర్గాల వారి హక్కుల రక్షణకు మెజారిటీ వర్గం కృషి చేసింది. హిందీయేతర ప్రాంతాల వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు హిందీ భాషీయులను పురిగొల్పింది. దక్షిణాది రాష్ట్రాల ప్రజలు హిందీ భాషా సాహిత్యాల అధ్యయనానికి పూనుకునేలా ప్రోత్సహించింది. ఏకరూపత (యూనిఫార్మిటీ) ఆధారిత యూరోపియన్ జాతి–రాజ్యం (నేషన్ స్టేట్) నమూనాను అనుసరించడానికి బదులు ప్రజాస్వామ్యాన్ని సకల వ్యత్యాసాలతో సమన్వయీకరించే రాజ్యం–జాతి (స్టేట్ నేషన్) నమూనాను భారత జాతీయవాదం సృష్టించింది. యూరోపియన్ జాతీయవాదం వలే కాకుండా ఒక జాతిగా ఉండడమంటే ఏమిటి అనే విషయమై చర్చలను ప్రోత్సహించింది.

ఈ సమున్నత భారత జాతీయవాదంపై నేడు దాడి జరుగుతోంది. ఆమోదయోగ్యం కాని కొత్త జాతీయవాదం ప్రబలమవుతోంది. ఇది 'వారు–మనము' అనే భావనకు తావివ్వకుండా సకల సామాజికవర్గాల మధ్య సమైక్యత పరిఢవిల్లేందుకు సంకల్పించడం లేదు. మణిపూర్‌లో జాతుల మర్షణ, పంజాబ్, హర్యానా; కర్ణాటక, తమిళనాడుల మధ్య నదీజలాల పంపకాలు మొదలైన అంతర్ రాష్ట్ర వివాదాలను పరిష్కరించేందుకు ఈ తప్పుడు జాతీయవాదం పూనుకోవడం లేదు. కశ్మీర్‌కే అగ్రప్రాధాన్యమిస్తోంది, అదీ ఒక స్థిరాస్తిగా మాత్రమే సుమా! ముస్లింలను శత్రువులుగా చిత్రీకరిస్తూ భారతదేశ సమైక్యతను బలహీనపరుస్తోంది. బాహ్య శక్తుల విషయంలో సాధ్యమైతే కలహశీల వైఖరితో వ్యవహరిస్తోంది; తప్పనిసరి అయినచోట నమ్రతతో లొంగుబాటు వైఖరి ప్రదర్శిస్తోంది. ఎంతకూ పాకిస్థాన్‌ను ఎలా దెబ్బతీయాలా అన్నదే దాని నిరంతర ఆలోచనగా ఉన్నది. ఫలితమేమిటి? అంతర్జాతీయ వేదికలపై ఇప్పుడు అందరూ భారత్‌ను పాకిస్థాన్‌తో కలిపి ప్రస్తావిస్తున్నారు! ఇరుగు పొరుగు దేశాలపై పెత్తనం వహించేందుకు ప్రయత్నించడం వల్లే ఇప్పుడు మన దేశం అన్ని వైపులా శత్రుపూరిత ప్రభుత్వాలతో పరివేష్టితమై ఉన్నది. నిక్కచ్చిగా చెప్పాలంటే ఇదొక మిథ్యా జాతీయవాదం. చైనా విస్తరణవాదాన్ని సమర్థంగా ప్రతిఘటించగలుగుతుందా? లేదు. డోనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దీటుగా ప్రతిస్పందిస్తుందా? లేదు. జాతీయ ప్రయోజనాల విషయమై దీని అవగాహన సూత్రబద్ధమైనది కాదు. కనుకనే భారత్‌కు ఆపత్సమయంలో ఆదుకునే మిత్ర దేశాలు లేకుండా పోయాయి. పాకిస్థాన్‌తో ఇటీవలి ఘర్షణలే ఇందుకు తార్కాణం.

వివిధ భారతి జాతీయవాదం నుంచి హిందీ–హిందూ–హిందుస్థాన్ జాతీయవాదంగా భారత జాతీయవాదం భ్రష్టమవడం మన కాలం చవిచూస్తున్న ఒక మహా విషాదం. ఇందుకు బాధ్యులు ఎవరు? ప్రస్తుత పాలనా వ్యవస్థ, దాని సైద్ధాంతిక సమర్థకులే పూర్తి బాధ్యులుగా భావించడం ఒక శుద్ధ పొరపాటు. అలా ఆలోచించడం మేధో సోమరితనమే. ప్రస్తుత శోచనీయ పరిస్థితులకు ఉదారవాద, లౌకిక, ప్రగతిశీల మేధోశ్రేణులు తమ వంతు బాధ్యతను అంగీకరించి తీరాలి. భారతదేశ సమగ్ర, అభ్యుదయాత్మకమైన జాతీయవాదంపై సంకుచిత యుద్ధోన్మాద ధోరణులు, మతమౌఢ్యవాదాలు ఆధిక్యత ఎలా సాధించాయి? స్వాతంత్ర్యానంతర పాలకుల భావజాలమే అందుకు ప్రధాన కారణమని చెప్పక తప్పదు. అదొక సారహీన ఆధునికతా భావజాలమది. భావోద్విగ్నత, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సారం లేని ఆ భావజాలం సమస్త భారతీయులతో మన జాతీయోద్యమానికి ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని నిలుపుకోవడంలో పూర్తిగా విఫలమయింది. యూరోపియన్ జాతీయవాద దుష్కృత్యాల వల్ల కలిగిన అపరాధ భావనతో భారతీయ మేధావులు జాతీయవాద భావనకు నిబద్ధతను పూర్తిగా ఉపసంహరించుకున్నారు. మరి భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి ఏ మాత్రం దోహదం చేయని శక్తులు జాతీయవాదాన్ని స్వాయత్తం చేసుకోవడంలో ఆశ్చర్యమేముంది? ప్రగతిశీల భారతీయులు ఇప్పటికైనా మహోన్నత భారత జాతీయవాదం ఇలా భ్రష్టమైపోవడంలో తమ పాత్రను అంగీకరించి, దాని వారసత్వాన్ని రక్షించుకోవడానికి పూనుకుంటారా? ఇది చాలా అత్యవసరంగా నిర్వర్తించాల్సిన రాజకీయ, మేధో కర్తవ్యం అనడంలో సందేహం లేదు.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

వాళ్ళు తమతో ఏం తీసుకుపోయారు?

సమాధి ఫలకాలు రాయడం తేలిక. విషాదగీతాలనూ, మరణానంతర ప్రశంసలనో రాయడం కూడా తేలిక. చనిపోయిన వాళ్ళని శపించి, చరిత్రని ఖననం చేసేయడం ఇంకా తేలిక. నిజంగా అంత తేలికైన విషయమేనా అది?

ఐదు వందల ఏళ్ళ క్రితం జర్మనీలోని ఫ్రాంకెన్ హౌసెన్ వద్ద ఒక యుద్ధం జరిగింది. అక్కడ కొండమీద ఒక ఇంద్రధనుస్సు కనిపించిందని చెబుతారు. బైబిల్ ద్వారా దైవికమైన ఒడంబడికకి చిహ్నమైన ఇంద్రధనుస్సు తిరగబడిన రైతుల పతాకం కూడా. యుద్ధానికి సన్నద్ధమైన రైతులు ఇంద్రధనుస్సు దర్శనాన్ని తమ విజయానికి దైవిక సంకేతంగా భావించారు. కానీ వాళ్ళు ఓడిపోయారు. ప్రత్యర్థులైన ప్రభు వర్గం వాళ్ళని మోసం చేసింది. నిర్యర్థ సంధి చేసుకుని, సంధి కాలం ముగియకముందే రైతులపైన ప్రభువుల సైన్యం దాడి చేసింది. ఒకే ఒక్క రోజు మే 15, 1525న ఏడువేలమందికి పైగా రైతులని ఊచకోత కోశారు. ఫ్రాంకెన్ హౌసెన్ యుద్ధం జర్మనీలో రైతాంగ తిరుగుబాటులో ఒక కీలకమైన ఘట్టం. 1525 నాటి ఈ జర్మనీ రైతుయుద్ధాన్ని 1789 ఫ్రెంచి విప్లవానికి ముందు పశ్చిమ యూరప్‌లో అతిపెద్ద ప్రజా తిరుగుబాటుగా పరిగణిస్తారు. థామస్ మూంత్సర్ జర్మనీ రైతుల తిరుగుబాటుకు నాయకుడు. ఫ్రాంకెన్ హౌసెన్ యుద్ధంలో పట్టుబడిన థామస్ మూంత్సర్‌ని చిత్రహింసలకు గురిచేశారు. థామస్ మూంత్సర్‌తో పాటు మరొక నాయకుడు ఫైఫర్, ఇంకా ఇరవై నాలుగు మంది తిరుగుబాటుదారులని మే 27, 1525న ప్రభువులు చంపివేశారు. వాళ్ళ శరీరాల్ని ఖననం చేయకుండా, శిరచ్ఛేదం చేసిన తలలని బల్లేలకి గుచ్చి ప్రదర్శనకు ఉంచారు. థామస్ మూంత్సర్ తలని మూల్ హౌసెన్ దగ్గర కొండపైనా, ఫైఫర్ తలని బోల్ స్టెడ్ గ్రామానికి వెళ్ళే రహదారి కూడలి దగ్గరా ప్రదర్శనకు పెట్టారు. తమతో పాటు వాళ్ళు మోసుకుపోయిందేమిటి? అతి కొద్ది సంఖ్యలో ఆయుధాలని, వాటితో పాటు ఒక ఇంద్రధనుస్సు జెండాని. ఇది జరిగింది సరిగ్గా ఐదు వందల సంవత్సరాల క్రితం, ఇదే నెల, 1525 మే మాసంలో.



> క్రూరమైన యుద్ధంలో హననమై, ఖననమైన శాంతిని తమతోపాటు మోసుకుపోయారు. వాద, వివాదాలనీ, భిన్నాభిప్రాయాలనీ, తాము పూర్తిచేయాలనుకుని పూర్తి చేసిన వాటినీ, అసంపూర్ణంగా మిగిలిన వాటినీ, చేయలేని వాటినీ తమతోపాటే తీసుకుపోయారు.

జర్మన్ విప్లవ నాయకురాలు రోజా లగ్జెంబర్గ్, తాను హత్యకు గురవ్వడానికి ఒక్కరోజు ముందు, జనవరి 14, 1919న ఈ మాటలు రాసింది: "...ఈ ఓటమి నుంచి భవిష్యత్తు విజయాలు పుట్టుకొస్తాయి. 'బెర్లిన్ నగరంలో శాంతి, భద్రతలు నెలకొన్నాయి'. తెలివిమాలిన తొత్తులారా! మీ శాంతి, భద్రతలు ఇసుక పునాదుల మీద కట్టిన మేడల లాంటివి. రేపు విప్లవం తిరిగి లేస్తుంది, ఆయుధాలతో తలపడుతుంది. మిమ్మల్ని భయకంపితం చేస్తూ, భేరీ ఘోషతో నినాదాన్ని వినిపిస్తుంది. నేను విప్లవాన్ని, నిన్న వున్నాను, ఈ రోజు నిలబడ్డాను, రేపు కూడా నిలిచే ఉంటాను." రోజా లగ్జెంబర్గ్ తలపై రైఫిళ్ళతో తలపై మోది హింసించారు. కాల్చి చంపి, తన దేహాన్ని బెర్లిన్ నగరంలోని ఒక కాలువలో పడవేశారు. మరొక విప్లవ నాయకుడు కార్ల్ లీబ్‌నెఖ్ట్‌ని కూడా కాల్చి చంపి బెర్లిన్ జంతు ప్రదర్శనశాల కంచెల దగ్గర గుర్తు తెలియని శవంగా పడవేశారు. ఇంతకూ వాళ్ళు తమతో పాటు తీసుకుపోయినవేమిటి? రోజా లగ్జెంబర్గ్ ఖైదులో ఉన్న ఒకానొక సాయంత్రపు వేళ గురించి ఈ మాటలు రాసింది: "నీలి రంగులో మెరిసిపోతున్న ఆకాశంలో తెల్లటి మబ్బులు రెండు ఎంతో ఎత్తున తారాడుతున్నాయి. ...పక్షుల గుంపులు రోజూలాగే సాయంత్రం తమ గూళ్ళకు చేరే ప్రయాణాన్ని మొదలుపెట్టాయి. పట్టులా మెరిసే ఆ నీలి ఆకాశాన్ని మొనదేలిన తమ రెక్కలతో కొంచెం, కొంచెంగా కత్తిరిస్తూ, ముందుకూ, వెనక్కూ ఎగురుతూ, ఒకదానినొకటి దాటిపోతూ గోలగోలగా అరుస్తున్నాయి. అంతలోనే ఆకాశంలో కనిపించకుండా పైపైకి ఎగిరిపోతున్నాయి. నీటిబిందువులు జారిపడుతున్న ఆ పాత్రని చేతులలో పట్టుకుని, తల వెనక్కి తిప్పి చూస్తాను నేను. తడి, తడిగా మెరిసే ఆ నీలిమలోకి ఎగిరి దూకి ఈదులాడాలనీ, ఆ తుషార బిందువులలో కలిసి, కరిగిపోవాలనీ గాఢమైన కోరిక నన్ను కమ్ముకుంటుంది." వాళ్ళు మేఘాలనీ, ఆకాశాన్నీ, బహుశా పక్షులనీ తమతో మోసుకుపోయారు.

స్పానిష్ నియంతృత్వ సైన్యం, ప్రఖ్యాత కవి ఫెడరికో గార్షియా లోర్కాని ఆగస్టు 19, 1936న నిర్బంధంలోకి తీసుకున్నది. గవర్నర్ వాల్డెస్, లోర్కాని ఏం చేయాలనే విషయంలో ఆదేశాలకోసం సైనిక అధికారులని అడిగాడు. ఫోన్ అందుకున్న సైనిక జనరల్ చుట్టూ ఆర్డర్లీ సిబ్బంది. మౌఖిక ఆదేశాలు ఇచ్చే ఆ గొంతులో అధికార గర్వంతో నిండిన నిశ్చితత్వం వినపడింది. "ఏం చేయాలని అడుగుతున్నావేమిటి? తనకి కాఫీ ఇవ్వు, సరిపోయేంత వరకూ చాలా చాలా కాఫీ ఇవ్వు." సందేశాన్ని అందుకున్న అధికారులు, గొప్ప కవి లోర్కాని కాల్చి చంపేశారు. లోర్కా తనతో పాటు ఏం తీసుకువెళ్లాడు? వెళుతూ వెళుతూ తనతో పాటు ఒక కవితని తీసుకుపోయాడు: "వాళ్ళు నన్ను హత్య చేశారని అప్పుడు నాకు అర్థం అయింది/ నా కోసం వాళ్ళు కాఫీ దుకాణాలలో, స్మశానాలలో, చర్చిలలో వెదికారు/ కానీ వాళ్ళకి నేను దొరకలేదు/ నేనెన్నడూ వాళ్ళ చేతికి చిక్కలేదు/ లేదు, వాళ్ళకి నేనెన్నడూ దొరకలేదు."

వాళ్ళు తమతో పాటు దేన్ని మోసుకుపోయారు? యుద్ధాన్ని, బహుశా బలహీనమైన గొంతుతో శాంతిని, క్రూరమైన యుద్ధంలో హననమై, ఖననమైన శాంతిని తమతోపాటు మోసుకుపోయారు. తీవ్రమైన వాద, వివాదాలనీ, భిన్నాభిప్రాయాలనీ, తాము పూర్తి చేయాలనుకుని పూర్తి చేసిన వాటినీ, చేయలేక అసంపూర్ణంగా మిగిలిన వాటినీ, చేయలేని వాటినీ తమతో పాటే తీసుకుపోయారు. తమ తప్పులనీ, పొరపాట్లనీ, సరిదిద్దుకునే ప్రయత్నాలనీ తీసుకుపోయారు. వాళ్ళు ప్రయాస పడుతూ విప్లవ భారాన్ని తమతోపాటు మోసుకు వెళ్ళారు. వాళ్ళు ఇప్పుడు ఇక లేరు. ఓటమి కళ్ళు విప్పార్చుకుని వాళ్ళ కళ్ళలోకి సూటిగా చూస్తూ వుంది. భూమీ, భూమిలోని సంపదా మిగిలే ఉన్నాయి. యుద్ధం ఇంకా మనముందు నిలబడే ఉంది.

వాళ్ళు భూమినీ, ఆకాశాన్నీ తమతో తీసుకుపోయారు. భూమిలోపల, అడవులలోపల అపారమైన సంపదలు నిక్షిప్తమై ఉన్నాయి. ఆ సంపదలని బయటికి తీయాలి. దురదృష్టవశాత్తూ, భూమి మీదా, అడవుల లోపలా, కొండలపైనా మనుషులు ఉన్నారు. వాళ్ళు తమతో పాటు ఏం మోసుకుపోయారు? లేదూ, భూమి వాళ్ళని మోసిందా? ఇప్పుడు భూమి వాళ్ళని కప్పివేసింది. కవి టి.ఎస్ ఇలియట్ రాశాడు, "ఏప్రిల్ నెల అత్యంత క్రూరమైనది/ మృత భూమిలో లైలాక్ పూలు వికసిస్తున్నాయి/ జ్ఞాపకాలనీ, కోరికలనీ కలగలుపుతూ/ వసంత కాలపు వర్షం కృశించిపోయిన వేర్లకి ప్రాణం పోస్తూ". బహుశా, మే మాసం కూడా క్రూరమైనదేనేమో.

• సుధాకిరణ్

మతమౌఢ్యంతో మారణహోమం!

ఇటీవల చోటుచేసుకున్న పహల్గాం ఘటన హిందూ సమాజానికి ఓ హెచ్చరిక. హిందువులనే లక్ష్యంగా చేసుకొని కశ్మీర్‌లో జిహాదీ మూకలు ఉగ్ర దాడికి తెగబడ్డాయి. కల్మా చదవకపోతే చంపేస్తారా?!

ఇప్పటికే బంగ్లాదేశ్‌లో హిందువుల ఊచకోత, అత్యాచారాలు, ఆస్తుల లూటీ, ఇళ్ల ధ్వంసం, వారిని చిత్రహింసలకు గురిచేయడం అనే రాక్షసక్రీడ కొనసాగుతూనే ఉంది. అంతలోనే హిందూదేశంగా భావించే భారత్‌లో పహల్గాం వంటి దౌర్జన్య ఉగ్ర రాక్షసి కోరలు చాచి హిందువులపై మారణకాండ జరపడం అత్యంత అమానుషం. మానవ హక్కుల సంఘాలు, రాజ్యాంగ పరిరక్షకులు, సెక్యులరిస్టులు, మేధావులు, జర్నలిస్టులు ఈ చర్యపై ఏ విధంగా స్పందించారో హిందూ సమాజం తెలుసుకోవాలి. మైనారిటీల హక్కుల కోసం గొంతెత్తే అవార్డు వాపసి బృందాలు పహల్గాం విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నాయో అర్థం చేసుకోవాలి.

"ఐక్యంగా ఉంటేనే బలంగా ఉంటాం" అనే నినాదం ద్వారా హిందూ సమాజం సంఘటితం కావాలి. ఢిల్లీలో ఓ వ్యక్తి శ్రీరాముడి ఫొటోను డీపీగా పెట్టుకున్నందుకు ఇంట్లో జొరబడి అతణ్ణి హత్య చేశారు! రాజస్థాన్‌లో కన్నయ్యలాల్ అనే టైలర్ తలనరికారు. హిందూ పేరు ఉందని కశ్మీర్‌లో ఉపాధ్యాయులను హత్య చేశారు. మరోవైపు లవ్ జిహాద్ కేసులు దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇలాంటి సమయంలో మోదీ, యోగి అవసరం లేకుండా మనమే ధర్మరక్షణ, ప్రాణరక్షణ కోసం సంసిద్ధంగా ఉండాలి.

– పగుడాకుల బాలస్వామి
విశ్వహిందూ పరిషత్

తెలంగాణపై కాదు, కేసీఆర్ విధానాలపైనే ఆక్రోశం!

'కృష్ణా జలాల పునఃపంపిణీ తెలంగాణ జన్మహక్కు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో (మే 14) తెలంగాణకు చెందిన విశ్రాంత సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీధర్‌రావు దేశ్‌పాండే రాసిన ఆర్టికల్ నిరాధారమైన ఆరోపణతో మొదలైంది: నేను "ఎప్పటి అలవాటు ప్రకారమే తెలంగాణపై అక్కసు వెళ్లగక్కాన"ని ఆరోపించారు. నేను గాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు గాని మీరు ఆరోపించినట్లు తెలంగాణ ప్రజలకు వ్యతిరేకం కాదు. కాకుంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావోద్వేగ విద్వేష విధానాలకు వ్యతిరేకంగా అనేక మార్లు రాసిన మాట వాస్తవం. ఆ విమర్శలను మొత్తంగా తెలంగాణకు అన్వయించడం సరికాదు.

బచావత్ ట్రిబ్యునల్ విచారణ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు నీటి వాటా తగ్గిన అంశం పలుమార్లు ఉల్లేఖించాను. తెలంగాణతో పాటు అవశేష ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ కూడా దక్షిణ తెలంగాణ లాగా అన్యాయానికి గురైన విషయం శ్రీధర్‌రావు దేశ్‌పాండేకు తెలియనిది కాదు. అయినా వెనుకబడిన రాయలసీమకే బేసిన్ ఆవల అనే నెపంతో స్పాట్ పెట్టడం గమనార్హం. తెలంగాణకు గాని తుదకు రాయలసీమకు గాని జరిగిన అన్యాయం ఏదైనా వుంటే బేసిన్ మొత్తం మీద నీటి పంపిణీ జరిగినప్పుడు తప్ప 2014లో రాష్ట్ర విభజన జరిగినపుడు మాత్రం కాదు. రాష్ట్ర విభజనకు ముందే కేసీఆర్ నీళ్ల కోసం ఉద్యమాలు సాగించి ఉన్నారు కదా! బచావత్ ట్రిబ్యునల్ కూడా వాస్తవంలో చేసిందేమీ లేదు. 1969 నాటికి నిర్మింపబడి, లేదా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేసింది. హైదరాబాద్ సంస్థానంలో గాని, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత గాని రాష్ట్రాన్ని పాలించిన నేతలు తెలంగాణ ప్రాంతంలో ప్రాజెక్టులు నిర్మించని నేరమది.

రాష్ట్ర విభజన తర్వాత అధికారం చేపట్టిన కేసీఆర్ ఏనాడైనా బేసిన్ మొత్తం మీద తిరిగి కృష్ణా నదీ జలాలు అన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ జరగాలని తుదకు మాట వరసకు కూడా కోరిన సందర్భం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేసిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ (2013) తీర్పు పునః పరిశీలన జరగాలని ఎన్నడైనా కోరారా? బేసిన్ మొత్తం మీద నీటి కేటాయింపులు జరిగినపుడు సంభవించిన అన్యాయాన్ని గాలికి వదిలేసి అవశేష ఆంధ్రప్రదేశ్‌తోనే వివాదానికి దిగారంటే అది కేవలం భావోద్వేగాలతో అధికారం సుస్థిరం చేసుకొనేందుకు కేసీఆర్ పన్నిన వ్యూహం కాదా?

నిజానికి కృష్ణా లోటు బేసిన్ కాదని శ్రీధర్‌రావు దేశ్‌పాండే అంటున్నారు. ఇదే నిజమైతే 2019లో ఎన్నికలు జరిగి ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే శ్రీశైలం జలాశయంలో కేవలం 400 టీయంసీలు మాత్రమే లభ్యత ఉంటుందని గోదావరి కృష్ణా నదుల అనుసంధానం చేసి గోదావరి నుండి 900 టీయంసీలు తరలించాలనే పథకం కేసీఆర్ ఎందుకు ప్రతిపాదించారు? ఒక ఇంజనీరింగ్ టీమ్ నెలలకొద్ది కసరత్తు చేయలేదా? బహుశా ఆ టీములో మీరు కూడా ఉన్నారేమో గుర్తు చేసుకోండి.

> తెలంగాణకు గాని, రాయలసీమకు గాని జరిగిన అన్యాయం ఏదైనా వుంటే బేసిన్ మొత్తం మీద నీటి పంపిణీ జరిగినప్పుడే తప్ప 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు మాత్రం కాదు. ఆనాటి అన్యాయాన్ని గాలికి వదిలేసి అవశేష ఆంధ్రప్రదేశ్‌తోనే వివాదానికి దిగారంటే అది కేవలం భావోద్వేగాలతో అధికారం సుస్థిరం చేసుకొనేందుకు కేసీఆర్ పన్నిన వ్యూహం కాదా?




అవశేష ఆంధ్రప్రదేశ్‌లో నిత్య క్షామ పీడిత ప్రాంతమైన రాయలసీమ ప్రస్తావన వచ్చినపుడల్లా బేసిన్ అంశం తీసుకు వస్తున్నారు. గొంతెండిపోతున్న రాయలసీమలో రెండు జిల్లాలకు చెందినది కెసి కెనాల్. ఇటీవలనే ఈ కాలువకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. చారిత్రక ప్రాధాన్యం వున్న దృష్ట్యా ఇంటర్నేషనల్ కమీషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ సంస్థ అవార్డుకు ఎంపిక చేసింది. శతాబ్దానికి పైగా కృష్ణా జలాలు వినియోగిస్తున్న కెసి కెనాల్ అదీ బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులు రద్దు చేసి తమకు కేటాయించమని కేసీఆర్ ప్రభుత్వం గతంలోనే ట్రిబ్యునల్ ముందు కోరడం సబబేనా?

బేసిన్ వెలుపల అని చెప్పబడే మరో ప్రాంతం సాగర్ కుడి కాలువ ఆయకట్టు. దీనికి బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులు చేసింది. శ్రీధర్‌రావు దేశ్‌పాండే చెబుతున్నట్లు ఎగువ రాష్ట్రాలు అభ్యంతరం పెట్టినా బచావత్ ట్రిబ్యునల్ కెసి కెనాల్‌కు సాగర్ కుడి కాలువకు నిర్దిష్టంగా నీటి కేటాయింపులు చేసింది. ఒకవైపు కృష్ణా బేసిన్ వచ్చేసరికి బేసిన్ ఆవల అనే అభ్యంతరాలు పెట్టిన శ్రీధర్‌రావు దేశ్‌పాండే తెలంగాణలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాకతీయ కాలువ గోదావరి బేసిన్ నుండి కృష్ణా బేసిన్‌కు వచ్చే అంశం గమనంలోనికి ఎందుకు తీసుకోరు? అంతెందుకు, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు సంగతేమిటి? అంతిమంగా కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఏం చెబుతారు? తాము మాత్రం గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు నీళ్లు తరలించవచ్చు కాని దక్షిణ తెలంగాణ కన్నా కనాకష్టంగా మెట్ట ప్రాంతానికి కొన్ని దశాబ్దాలుగా నీళ్లు ఇచ్చే కెసి కెనాల్‌కు కృష్ణా నీటిని బంద్ చేయమనడం ఎంత వరకు న్యాయం? శ్రీధర్‌రావు దేశ్‌పాండే క్యారీ ఓవర్ నిల్వ గురించి చెబుతూ ఆంధ్రప్రదేశ్‌పై నిందారోపణ చేశారు.

సెక్షన్ 89 తెలంగాణకు న్యాయం చేయదని కేసీఆర్ భావించి కొత్త ట్రిబ్యునల్ కోసం కృషి చేసి సాధించారని శ్రీధర్‌రావు దేశ్‌పాండే చెబుతున్నారు. ట్రిబ్యునల్ నియామకంపై ఇప్పుడు సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. అదలా వుంచితే కేసీఆర్ న్యాయబద్ధంగా వ్యవహరించి ఉంటే రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89కి సవరణ చేయించుకొని ఉండాలి. ఎందుకంటే రాష్ట్ర విభజన చట్టం ఉభయ పార్లమెంటు సభల ఆమోదం పొందినది. పైగా రాష్ట్ర విభజన చట్టం 11 షెడ్యూల్ (4)లో కూడా ఇందు గురించి స్పష్టత ఉంది.

ట్రిబ్యునల్ తీర్పుతోనే అవశేష ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల వివాదం పరిష్కారం కాదు. ఇందుకు అనేక ఉదంతాలున్నాయి. కావేరి వివాదం ఏమైంది? అంతిమంగా శాంతి భద్రతల సమస్య తలెత్తితే న్యాయ పరమైన అంశాలు పక్కన బెట్టి (ట్రిబ్యునల్ తీర్పు నోటిపై జరిగితే సుప్రీంకోర్టుకు అధికారం లేదు) సుప్రీంకోర్టు జోక్యంతో సద్దుమణిగినా అప్పుడప్పుడు వివాదం రాజుకుంటూనే వుంది. 2004లో నియమింపబడిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో తీర్పు ఇస్తే సుప్రీంకోర్టు స్టేతో దస్త్రాలకే పరిమితమై వుంది. కొత్తగా నియమించబడిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముున్ముందు ఏలాంటి తీర్పు ఇస్తుందో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో పక్కనబెడితే సుప్రీంకోర్టు కేసు నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలు వాదులాటలు అటకెక్కించి సామరస్యానికి లాకు లెత్తడమే అత్యుత్తమం.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికాలోని న్యూయార్క్‌కు డైరెక్టు ఫ్లైట్ నడిపే అంశంపై విజయవాడ, మచిలీపట్నం ఎంపీలు ఇచ్చిన హామీ జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళ్తున్న వారిలో విదేశాలకు వెళ్లే డేటాపై అధ్యయనం చేస్తున్నారు. కేంద్ర స్థాయిలో వివిధ శాఖలను సమన్వయం చేయడంతో పాటు విమానయాన సంస్థలను మెప్పించగలిగితే తప్ప ఇప్పటికిప్పుడు ఈ విమాన సర్వీసును నడపటం సాధ్యం కాదని తెలుస్తోంది. ముందు ఆసియా దేశాలకు విమానాలను నడిపి సమగ్ర అధ్యయనం చేసిన తర్వాతే దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విజయవాడ TO అమెరికా!

విమాన సర్వీసుపై విజయవాడ, మచిలీపట్నం ఎంపీల హామీ

చర్చనీయాంశంగా న్యూయార్క్‌కు డైరెక్ట్ ఫ్లైట్ అంశం

- ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళుతున్న వారిలో విదేశాలకు వెళ్లే డేటాపై అధ్యయనం
- కేంద్ర స్థాయిలో మూడు శాఖలను మెప్పించాలి.. విమానయాన సంస్థలను ఒప్పించాలి
- ఆసియా దేశాలకు ముందు విమానాలను నడిపి సమగ్ర అధ్యయనం అవసరం
- సాధ్యాసాధ్యాలపై నడుస్తున్న చర్చ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఇటీవల జరిగిన ఎయిర్ పోర్టు అడ్వైజరీ కమిటీ సమావేశం అనంతరం మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి విదేశీ విమానాల ఆపరేషన్స్‌కు సంబంధించి ఇచ్చిన హామీలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. వీటిలో విజయవాడ నుంచి అమెరికాలోని న్యూయార్క్‌కు డైరెక్ట్ ఫ్లైట్ అంశం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఇప్పటికిప్పుడు ఈ విమాన సర్వీసు నడపటానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై పెద్ద చర్చే నడుస్తోంది. విజయవాడ నుంచి ప్రస్తుతం ఢిల్లీకి మూడు దేశీయ విమానాలు నడుస్తున్నాయి. ఢిల్లీకి వెళుతున్న విమానాల్లో సగటున 120 మంది ప్రయాణికులు విజయవాడ నుంచి బయలుదేరి వెళుతుంటే, వీరిలో 60 శాతం మేర ఢిల్లీ విమానాశ్రయం నుంచి అమెరికా తదితర ప్రపంచ దేశాలకు వెళ్లేవారే ఉన్నారు. ఇవి ఎయిర్ పోర్టు అధికారులు చెబుతున్న గణాంకాలు. ఢిల్లీకి వెళుతున్న విమాన ప్రయాణికులను సర్వే చేయగా తెలుసుకున్న విషయం ఇది. ఈ సర్వే ఆధారంగా అమెరికాకు నేరుగా విమాన సర్వీసు నడిపే విషయంలో అనేక ఇబ్బందులు ఉన్నాయి. వీటిని అధిగమించకపోతే విమాన సర్వీసు నడపటం సాధ్యం కాదు.

సమగ్ర అధ్యయనం తప్పనిసరి

అమెరికా వంటి దేశాలకు విమానాలు నడపాలనుకున్నపుడు ప్రయాణికుల అంచనాకు సంబంధించి సమగ్ర సర్వేతో కూడిన అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ముందుగా మన దగ్గర నుంచి విదేశాలకు వెళుతున్న ఆప్షన్స్‌ను పరిశీలించాలి. వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) విధానంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపటం ద్వారా పర్యాటకుల కోసం విజయవాడ నుంచి థాయ్‌ల్యాండ్, మలేషియా, శ్రీలంక తదితర దేశాలకు 120 సీటర్ విమానాలను నడిపి పరిశీలించవచ్చు. వాణిజ్య కార్యకలాపాలకు సంబంధించి సింగపూర్, దుబాయ్ వంటి దేశాలకు కూడా వీజీఎఫ్ విధానంలో విమాన సర్వీసులను నడిపితే.. అంతర్జాతీయానికి ఉన్న డిమాండ్‌పై అవగాహన వస్తుంది. వీటి ఆధారంగా అమెరికాకు విమాన సర్వీసు అంశంపై ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది.

మెప్పించి.. ఒప్పించాలి!

అమెరికాకు డైరెక్ట్ ఫ్లైట్ నడిపే విషయంలో కేంద్ర పౌర విమానయాన శాఖ కృషి ఒక్కటే సరిపోదు. కేంద్ర విదేశీ మంత్రిత్వశాఖ, కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖల సమన్వయంతో గట్టిగా కృషి చేస్తే తప్ప సాకారం కాదు. ఈ మూడు సంస్థలను ఏకతాటి మీదకు తీసుకు రావాల్సి ఉంటుంది. ఈ మూడు శాఖలను ఏక తాటిమీదకు తీసుకు వచ్చిన తర్వాత విమానయాన సంస్థలను కూడా మెప్పించి.. ఒప్పించాల్సి ఉంటుంది. విమానయాన సంస్థలు ముందుకు రానంత వరకు కూడా అమెరికాకు నేరుగా విమాన సర్వీసును నడపటం చాలా కష్టం.



పరిశీలించాల్సిన అంశాలు

విజయవాడ నుంచి ఢిల్లీ వెళుతున్న వారు కానీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లకు వెళ్లే విమాన ప్రయాణికులలో సగం మంది విదేశాలకు వెళ్లే వారుంటున్నారన్నది గతంలో జరిపిన సర్వేల్లో స్పష్టమైంది. ప్రస్తుతం ఢిల్లీకి వెళుతున్న మన ప్రయాణికుల్లో 60 శాతం మంది విదేశాలకు వెళుతున్నారు. వీరిలో ఎంత మంది అమెరికాకు వెళుతున్నారన్నదానిపై సమగ్ర సర్వే జరగాల్సి ఉంది. అమెరికాకు ఎక్కువ సంఖ్యలో ఎక్కడికి వెళుతున్నారన్నది కూడా లెక్క తేలాల్సి ఉంటుంది. అమెరికాకు న్యూయార్క్‌కే వెళుతున్నారా.. చికాగో, శాన్ ఫ్రాన్సిస్కో ఇలా ఇతర ప్రాంతాలకు వెళుతున్నారా అన్నది కూడా తెలియాలి. విజయవాడ నుంచి న్యూయార్క్‌కు విమాన సర్వీసు నడిపితే.. మిగిలిన ప్రాంతాలకు వెళ్లే వారు ఈ సర్వీసును ఆదరిస్తారా అన్నది కూడా పరిగణనలోకి తీసుకోవాలి. విజయవాడ నుంచి అమెరికాకు విమాన సర్వీసు నడవాలంటే 350 - 400 మంది ప్రయాణికుల కెపాసిటీ ఉన్న విమాన సర్వీసును నడిపితేనే విమానయాన సంస్థలకు వయబిలిటీ ఉంటుంది. విజయవాడ నుంచి ఒక్క రోజే 350 మందికి పైగా ప్రయాణికులు న్యూయార్క్‌కు ప్రయాణించగలరా? అన్న విషయాన్ని కూడా పరిశీలించాల్సి ఉంటుంది. డైలీ మిగతా 4లో..



చోరీలకు పాల్పడుతున్న నిందితులు

చైన్ స్నాచింగ్ కూలీలు

వ్యవసాయ కార్మికుల వేషధారణలో చోరీలు

- గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలే లక్ష్యం
- నలుగురిని అరెస్టు చేసిన సీసీఎస్ పోలీసులు
- నిందితుల్లో ఇద్దరు మహిళలు
- రూ.30లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం

అతడు లుంగీ కట్టుకుని, ఒంటిపై బనియన్, మెడలో తువ్వాలుతో ఉంటాడు. సాదాసీదా చీరతో ఓ మహిళ అతడి వెంట ఉంటుంది. ఇద్దరూ చూడడానికి వ్యవసాయ కూలీలుగా కనిపిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్రవాహనంపై తిరుగుతారు. ఇలా తిరుగుతూనే ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటారు. ఏదో చిరునామా అడిగినట్టుగా ఆ మహిళలను ఆపి మెడలో ఉన్న బంగారు గొలుసులు లాక్కుపోతారు. ఇలా గ్రామీణ ప్రాంత మహిళలను టార్గెట్ చేసుకుని స్నాచింగ్‌లు చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను విజయవాడ సీసీఎస్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, క్రైమ్స్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ రామ్‌కుమార్ విజయవాడలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులు చూపుతున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ, మే 28(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఉప్పుటూరు గ్రామానికి చెందిన అచ్చి గిరిబాబు, అచ్చి మహేష్ అన్నదమ్ములు. గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకునేవారు. ఇద్దరూ కలిసి చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. దీనితో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో బంగారం ధర విపరీతంగా పెరగడంతో చైన్ స్నాచింగ్‌లు చేయడానికి ప్రణాళిక రచించారు.

ఒంటరి మహిళలతో సహజీవనం

గ్రామాల్లో భర్తతో విడిపోయిన మహిళలను గుర్తించి, వారికి అండదండగా ఉంటామని నమ్మించి జీవితంలోకి తెచ్చుకుంటారు. వారితో సహజీవనం చేస్తారు. అన్నదమ్ములు ఇద్దరూ చెరో మహిళను జీవిత భాగస్వామిగా చేసుకుంటారు. తర్వాత ద్విచక్ర మిగతా 4లో..

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.17లక్షలు కాజేశారు!

- మోసపోయిన పటమట అశోక్‌నగర్‌కు చెందిన వ్యక్తి
- ఘటనపై ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు



పెనమలూరు, మే28(ఆంధ్రజ్యోతి): "ముంబై క్రైం బ్రాంచ్ నుంచి కాల్ చేస్తున్నాం. మీరు వాడుతున్న మొబైల్ నంబర్లు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొన్నందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తాం" అంటూ బెదిరించి ఒక వ్యక్తి ఖాతాలోని రూ.17 లక్షల సొమ్మును కేటుగాళ్లు కాజేసిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 4వ తేదీన పటమట అశోక్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తికి ముంబై క్రైం బ్రాంచి నుంచి ఫోన్ చేస్తున్నామని ఒక కాల్ వచ్చింది. మీ ఫోన్ నంబర్లను చట్ట విరుద్ధ కార్యకలాపాలకు వాడుతున్నారని, మిమ్ములను అరెస్టు చేస్తామని బెదిరించారు. 5వ తేదీన మరో వీడియో కాల్‌లో న్యాయమూర్తి డ్రెస్ వేసుకున్న వ్యక్తి మీరు ఏడు రోజుల పాటు మిగతా 4లో..



దుర్గగుడి లీజుల విభాగం దొంగాట!

టోల్‌గేట్, పార్కింగ్ స్టాండ్ కాంట్రాక్టు సంస్థ ప్రయోజనం కోసం కుయుక్తులు

- పాత కమిషనర్ ఆదేశాలను అడ్డం పెట్టుకుని మరో 6 నెలల పాటు పొడిగించే ప్లాన్
- ఆ తర్వాత సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పు ప్రకారం రెండేళ్లు కట్టబెట్టేయాలని ఎత్తుగడ
- డివిజన్ బెంచ్ స్టేను మరుగున పడవేసేందుకు ఇప్పటికీ ప్రయత్నాలు!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో టోల్‌గేట్, వాహనాల పార్కింగ్ స్టాండ్ కాంట్రాక్టు సంస్థకు ఈ నెలాఖరుతో గడువు ముగుస్తున్నా.. మరో రెండు సంవత్సరాలు ఉచితంగా కట్టబెట్టే దిశగా దేవస్థాన లీజుల విభాగం అధికారులు పావులు కదుపుతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును ఆధారంగా చేసుకుని కాంట్రాక్టు సంస్థ రెండేళ్ల పాటు ఉచితంగా నిర్వహించుకుందామన్న ఆలోచనలకు లీజుల విభాగం ఉన్నతాధికారులు తెర వెనుక కథ నడుపుతున్నారని సమాచారం. వాస్తవానికి డివిజన్ బెంచ్ స్టే ఇచ్చిన నేపథ్యంలో అంతకు ముందు దేవదాయ శాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు అమల్లోకి వస్తాయి. ఆ సంస్థ గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుంది కాబట్టి ఎట్టి పరిస్థితుల్లో కొత్త టెండర్లు పిలవాల్సి మిగతా 4లో..

జాయింట్ కలెక్టర్‌గా ఎస్.ఇలక్కియా



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ)గా ఎస్.ఇలక్కియాను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 2017 బ్యాచ్‌కు చెందిన ఈ ఐఏఎస్ అధికారిణి సొంత రాష్ట్రం కేరళ. ఇంటర్ క్యాడర్ బదిలీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. ఏపీకి చెందిన 2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన సీవీ ప్రవీణ్ ఆదిత్యను అదే సంవత్సరం ఈమె వివాహం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈమెను ఏపీకి మిగతా 4లో..

ఖరీఫ్ లక్ష్యం 1.24 లక్షల హెక్టార్లు

- జిల్లా వ్యవసాయశాఖ అంచనా

విజయవాడ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో 1.24 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 14,864 మట్టి నమూనాలు సేకరించాలనే లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 11,137 నమూనాలన గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా సేకరించింది. నమూనా మిగతా 4లో..

మాయ బంగారం

గోల్డ్ చిట్టీల పేరుతో మోసం

- ఎగబడి నగదు చెల్లించిన జనం
- తాళం వేసిన నిర్వాహకుడు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

విజయవాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ఎవరైనా డబ్బులతో చిట్టీలను నిర్వహిస్తారు. విజయవాడకు చెందిన ఓ వ్యక్తి మాత్రం బంగారంతో చిట్టీలు నిర్వహించాడు. చివరికి డబ్బులు చెల్లించిన వారిని నిలువునా ముంచేశాడు. విజయవాడ అయోధ్యనగర్ లోటస్‌కు చెందిన ముచ్చెర్ల శ్రీనివాసరావు చిట్టీల వ్యాపారాన్ని ఐదేళ్ల క్రితం ప్రారంభించాడు. డబ్బులతో నిర్వహించే చిట్టీలతోపాటు బంగారం చిట్టీలను మొదలుపెట్టాడు. కొంతమందితో గ్రూపును ఏర్పాటు చేసి 25 నెలల కాలానికి చిట్టీలను నిర్వహించాడు. ప్రతి నెల గ్రూపులో ఉన్న అందరి పేర్లతో లక్కీడ్రా తీసేవాడు. అందులో ఇద్దరు విజేతలను ఎంపిక చేసేవాడు. ఈ ఇద్దరికి చెరో 100 గ్రాముల బంగారాన్ని ఇచ్చేవాడు. ఇలా 25 నెలలు పూర్తయ్యే వరకు ఆ బంగారానికి సంబంధించిన సొమ్మును చెల్లించాలి. ఇవి కాకుండా రూ.లక్ష నుంచి రూ.10-20లక్షల చిట్టీలను నిర్వహించాడు. కొంతమంది నుంచి రూపాయి వడ్డీ చెల్లించేలా లక్షలాది రూపాయలను అప్పు తీసుకున్నాడు. ఐదేళ్లపాటు క్రమంగా చెల్లింపులు చేస్తూ ఖాతాల సంఖ్యను పెంచుకున్నాడు. చివరికి లోటస్‌లో ఉన్న ఇంటికి తాళాలు వేసి పరారయ్యాడు. దీనితో బాధితులు అజిత్‌సింగ్‌నగర్, సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావు తమను రూ.7 కోట్లకు మోసం చేశాడని సత్యనారాయణపురం పీఎస్‌లో, రూ.30 కోట్లకు మోసం చేశాడని అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P.: VIJAYAWADA - 520008

TENDER NOTICE

No.03/We/TS/DM1/25 Date : 27.05.2025

Sealed Tenders are invited for the following work at Dr. NTR University of Health Sciences, Vijayawada.

Sl.No	Name of the work
1.	Supply of cushion seated back rest chairs at Alochana Hall of Dr. NTR UHS, Vijayawada For further details visit university website : https://drntr.uhsap.in

Sd/- Dr. V. Radhika Reddy
REGISTRAR



కడపలో బుధవారం జరిగిన టీడీపీ మహానాడు ఆవరణలో ఉల్లాసంగా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) తదితరులు

తిరువూరు చైర్‌పర్సన్ పదవి ఇక టీడీపీ ఖాతాలోకే..!

- వైసీపీ కౌన్సిలర్ పరస సత్యనారాయణ టీడీపీలో చేరిక
- అనూహ్యంగా 11కు పెరిగిన బలం
- జూన్ 2న చైర్‌పర్సన్ ఎన్నిక లాంఛనమే!

తిరువూరు, మే 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ ఉప ఎన్నిక నేపథ్యంలో టీడీపీ బలం అనూహ్యంగా పెరిగింది. దీంతో చైర్‌పర్సన్ పదవిని ఆ పార్టీ కైవశం చేసుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. బుధవారం వైసీపీకి చెందిన 19వ వార్డు కౌన్సిలర్ పరసా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పరసా బాబురావు టీడీపీలో చేరడంతో ఎన్నికకు సంబంధించిన మ్యాజిక్ ఫిగర్‌ను టీడీపీ చేరుకుంది. మొత్తం 20 మంది సభ్యులకు గాను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుతో పాటుగా 11 ఓట్లు టీడీపీకి ఉండటంతో దాదాపు ఎన్నిక లాంఛనమే అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ 17 స్థానాలు గెలుపొంది, పాలకవర్గంగా ఏర్పడిన నాటి నుంచి వైసీపీ కౌన్సిలర్లలో అనేక విభేదాలు తలెత్తాయి. కొందరు వైసీపీ మిగతా 4లో..



టీడీపీ కండువ కప్పుకున్న కౌన్సిలర్ పరస సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బాబురావు

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో
డైరెక్ట్ వీవర్స్ ప్రదర్శన మరియు అమ్మకం
29 మే నుండి జూన్ 2 వరకు
సమ్మర్ & వెడ్డింగ్ ప్రత్యేకం
అన్ని లేటెస్ట్ వెరైటీలు & కొత్త డిజైన్‌లు
• సిల్క్, కాటన్ శారీ • డిజైనర్ వేర్ • ఎత్నిక్ వేర్ • కుర్తి • ఫ్యాషన్ జ్యూయలరీ • హోమ్ లినెన్ • ఇంకా మరెన్నో
ఎ ప్లస్ కన్వెన్షన్ సెంటర్
లలిత జ్యూయలరీ రోడ్డు ఎదురుగా, మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీ, మొఘల్రాజపురం, విజయవాడ


M: 9441987009 | Entry Free | All UPI Online / Debit & Credit Cards Accepted



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు



వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం



ప్రత్యేక ఆకర్షణగా ఎన్టీఆర్ వేషధారి..







పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.





మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు



నోరూరించే వంటలు రెడీ...



మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ



అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు



మేము విజిలేస్తే...



కార్యకర్తల ఉత్సాహం..



రక్తదానం చేస్తున్న కార్యకర్తలు



పోలీసు తనిఖీలు

సహకార రంగ స్ఫూర్తి ప్రదాత ఎన్టీఆర్

» కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని

చిట్టినగర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : సహకారరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఫ్యాక్టరీ ఆవరణలో బుధవారం స్వర్గీయ నందమూరి తారక రామారావు 102 జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ, ఎన్టీఆర్ అవలంబించిన విధానాలు, సహకార రంగ బలోపేతానికి చేసిన కృషి ఫలితమే జిల్లాలో సహకార వ్యవస్థ దేశంలోనే అత్యుత్తమమైనది, ఆదర్శవంతంగా పనిచేస్తోందన్నారు. మ్యాక్స్ చట్టం ద్వారా రైతులకు స్వయం ప్రతిపత్తి కల్పించి వారి ఉత్పాదనలకు వారే ధర నిర్ణయించుకోవాలనే ఎన్టీఆర్ ఆశయాలు, ఆలోచనలను తు.చ తప్పకుండా పాటిస్తూ, దేశంలోనే అత్యధిక పాల సేకరణ ధరను చెల్లిస్తున్న సహకార సంస్థ కృష్ణామిల్క్ యూనియన్ అని చెప్పారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, సమితి బోర్డు డైరెక్టర్స్ చలసాని చక్రపాణి, నెలకుదిటి నాగేశ్వరరావు, నెక్కలపు వాణిశ్రీ, చెరుకూరి లవయ్య, ట్రస్ట్ డైరెక్టర్ గోళ్ల పూర్ణ మల్లికార్జునరావు, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

ఐదేళ్లు పూర్తిచేసుకున్న వారికి బదిలీలు

» దేవదాయ శాఖకు దుర్గగుడి ఈవో నివేదిక

ఇంద్రకీలాద్రి, మే 28 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ కమిషనర్ ఈనెల 19న జారీచేసిన మెమో ప్రకారం.. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పనిచేసే ఉద్యోగుల బదిలీలకు సంబంధించి, కేడర్ స్ట్రెంత్, ఖాళీల వివరాల నివేదికను ఈవో శీనానాయక్ దేవదాయ కమిషనర్‌కు పంపారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారి వివరాలు, బదిలీలు కోరుతూ లేఖలు ఇచ్చిన వారి వివరాలు నివేదికలో పొందుపరిచారు. ఈవో నివేదిక ప్రకారం.. దేవస్థానంలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల పోస్టులు మంజూరుకాగా, ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఏఈలు ఐదుగురు, సూపరింటెండెంట్‌లు 13 మంది శాంక్షన్ పోస్టులకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పనిచేస్తున్నట్టు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్‌లలో 13 మంది శాంక్షన్ కాగా, 12మంది పనిచేస్తున్నారని, ఒక పోస్టుకు సంబంధించి హైకోర్టు ఉత్తర్వుల మేరకు రిజర్వ్‌లో ఉంచినట్టు తెలిపారు. దేవస్థానంలో 42మంది జూనియర్ అసిస్టెంట్ పోస్టులు శాంక్షన్ కాగా, 30 మందే పనిచేస్తున్నారని, 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

పోలీసు కస్టడీకి ఓలుపల్లి రంగా

విజయవాడ, మే 28 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు, గన్నవరం మండలాల్లో వైసీపీ అధికారంలో ఉండగా జరిగిన అక్రమ తవ్వకాల కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహన రంగారావు అలియాస్ రంగాను విజయవాడ మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇచ్చింది. దీనికి సంబంధించి బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. గురువారం, శుక్రవారం రెండు రోజులపాటు కస్టడీకి అనుమతి ఇచ్చింది.

విజయవాడ టు అమెరికా!

(3వ పేజీ తరువాయి)

ఫ్లైట్‌కు ఇంత సంఖ్య ఉండదనుకుంటే.. వారానికో ఫ్లైట్ నడపాలన్న అంశం కూడా తెర మీదకు వచ్చే అవకాశం ఉంది. అమెరికా వెళ్లే వారికి డైలీ ఫ్లైట్స్ దేశంలోని పలు విమానాశ్రయాల నుంచి అందుబాటులో ఉండగా.. విజయవాడ నుంచి వెళ్లటానికి వారం రోజుల పాటు నిరీక్షిస్తారా? అన్నది కూడా అధ్యయనం చేయాల్సిన విషయం. కాబట్టి సమగ్ర సర్వే, అధ్యయనం లేకుండా అమెరికా వంటి పెద్ద దేశానికి ఒక ప్రాంతాన్ని ఎంచుకుని డైరెక్ట్ ఫ్లైట్ నడిపే సాహసం చేస్తే అది వయబిలిటీ కాకపోతే ఏమిటన్నది కూడా ఆలోచించుకోవాల్సి ఉంటుంది.

బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ కావాలి

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అమెరికాలోని న్యూయార్క్‌కు కానీ మరేదైనా ప్రాంతానికి కానీ విమాన సర్వీసును నడపాలంటే అంత తేలిక కాదు. విజయవాడ విమానాశ్రయానికి బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ కావాలి. బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ లేకుండా విమాన సర్వీసును నడిపే పరిస్థితి లేదు. బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ అనేవి ఇండియా, అమెరికా ద్వైపాక్షిక సంబంధాల మీద ఆధారపడి ఉంటాయి. పైన చెప్పుకున్నట్టు పౌర విమానయాన శాఖ, విదేశీ మంత్రిత్వ శాఖ, వాణిజ్య మంత్రిత్వ శాఖకు సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించటం ద్వారానే బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ వస్తాయి. అమెరికాకు విజయవాడ నుంచి ఒక విమాన సర్వీసు నడిపితే .. అక్కడి విమానయాన సంస్థకు కూడా విజయవాడ రావటానికి అవకాశం కల్పించాల్సి ఉంటుంది. ప్రతి విమానాశ్రయానికి నిర్దేశిత బైలేట్రల్ ట్రాఫిక్ రైట్స్ ఉంటాయి. కొత్తగా కల్పించకుండా.. ఉన్న వాటినే సర్దుకోమంటే చాలా కష్టం. అమెరికా నుంచి మన దేశంలో ఢిల్లీ, ముంబాయి, చెన్నై, బెంగళూరులకు విమాన సర్వీసులలో ఏదైనా ఒకదానిని కుదించుకుని విజయవాడకు నడపాలి. ఆ విమానాశ్రయాలకున్న డిమాండ్‌ను కాదనుకుని ఆ దేశ విమానయాన సంస్థ విజయవాడకు ధైర్యంగా నడపగలదా అన్నది కూడా చూడాల్సిన అవసరం ఉంది.

చైన్ స్నాచింగ్ కూలీలు

(3వ పేజీ తరువాయి)

వాహనాలపై వారిని ఎక్కించుకుని ఎంపిక చేసుకున్న గ్రామాల్లో నివాసం ఉంటారు. గ్రామాలకు శివారున ఉండే ఖాళీ స్థలాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుంటారు. పాడి రైతులమని నమ్మించేందుకు రెండు గేదెలను గుడారం ముందు కట్టేస్తారు. తర్వాత వ్యవసాయ కూలీలుగా పనులకు వెళ్తారు.

చిరునామా అడుగుతున్నట్టు నటిస్తూ..

ఒంటరిగా వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పారిపోతారు. నెల్లూరు జిల్లాలో మొత్తం 12 చైన్ స్నాచింగ్‌లు చేసి జైలుకు వెళ్లి వచ్చారు. తర్వాత మకాంను ఎన్టీఆర్ జిల్లాకు మార్చారు. ఇబ్రహీంపట్నం మండలం దొనబండకు చెందిన గాలేటి వెంకటరమణ అనే మహిళతో గిరిబాబు, మొగిలి సంధ్యతో మహేష్ వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఈ ఇద్దరూ చేసే స్నాచింగ్‌లకు వారిని మోటారు సైకిళ్లపై తీసుకెళ్లేవారు. ఈ గ్యాంగ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీగా చోరీలకు పాల్పడింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో రెండు, జగ్గయ్యపేట సర్కిల్ పరిధిలో మూడు, మైలవరం సర్కిల్ పరిధిలో నాలుగు, తిరువూరు సర్కిల్ పరిధిలో మూడు మొత్తం 12 చైన్ స్నాచింగ్‌లు చేశారు. ఇవి కాకుండా కృష్ణాజిల్లాలో నాలుగు, ఏలూరు జిల్లాలో రెండు, తెలంగాణలో ఏడు చైన్ స్నాచింగ్‌లు చేశారు. గిరిబాబు ఒక్కడే మొత్తం 15 చైన్ స్నాచింగ్‌లు చేశాడు. తమ్ముడు మహేష్‌తో కలిసి నాలుగు చోరీలు చేశాడు. సహజీవనం చేస్తున్న వెంకటరమణతో కలిసి మూడు, సంధ్యతో కలిసి మరో మూడు చైన్ స్నాచింగ్‌లు చేశాడు. ఈ నలుగురు నిందితుల నుంచి సీసీఎస్ పోలీసులు రెండు ద్విచక్ర వాహనాలు, 476 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.30లక్షలు ఉంటుంది. ఈ గ్యాంగ్‌ను అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఏఎస్ఐలు బాలయ్య, స్వామి, సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుళ్లు మిథున్, సురేష్, షబ్బీర్, రమణను సీపీ అభినందించారు. వారికి నగదు బహుమతులను అందజేశారు.

ముందస్తు బెయిల్ ఇవ్వండి

» హైకోర్టులో దేవినేని అవినాశ్ పిటిషన్

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): తిరువూరు పోలీసులు తనపై నమోదు చేసిన కిడ్నాప్ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత దేవినేని అవినాశ్ హైకోర్టును ఆశ్రయించారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 (3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకొనేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై గురువారం హైకోర్టు విచారణ జరపనుంది. ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు నగరపంచాయతీ ఎన్నిక సందర్భంగా దేవినేని అవినాశ్‌తో మాట్లాడాలంటూ తన మరదలను, ఆమె భర్తను తిరువూరు మాజీ ఎమ్మెల్యే స్వామిదాస్ తీసుకెళ్లి నిర్బంధించారంటూ షేక్ మస్తాన్ ఈనెల 20న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దేవినేని అవినాశ్, స్వామిదాస్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి 79 కోట్లు

» పరిపాలన అనుమతి ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం

అమరావతి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి మరో రూ. 79 కోట్లు విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం పరిపాలన అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 సంవత్సరానికి వివిధ పథకాల కోసం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి ప్రభుత్వం రూ. 105.33 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు మొదటి త్రైమాసికం కింద రూ. 26.33 కోట్లను విడుదల చేస్తూ ఈనెల 8న ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే మిగిలిన 3 క్వార్టర్ల నిధులను కూడా ఒకేసారి విడుదల చేయాలని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలించిన ప్రభుత్వం నిబంధనలను సడలిస్తూ 2, 3, 4 క్వార్టర్స్ కింద (జూలై 1 నుంచి 2026 మార్చి 31 వరకు) ఇవ్వాల్సిన మొత్తం రూ. 79,00,01,250 ఒకేసారి విడుదల చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

దుర్గగుడి లీజుల విభాగం దొంగాట!

(3వ పేజీ తరువాయి)

ఉంటుంది. కానీ లీజుల విభాగం అధికారులు ఈ పనిచేయకుండా కాంట్రాక్టు సంస్థకు ప్రయోజనకరంగా వ్యవహరిస్తున్నారు. కాంట్రాక్టు సంస్థకు గతంలో దేవదాయ శాఖ ఇచ్చిన ఆరు నెలల ఉచిత వెసులుబాటును ఇప్పుడు అమలు చేస్తున్నామన్న సరికొత్త వాదనను లీజుల విభాగం తెరపైకి తీసుకువస్తోంది. ఇది పూర్తిగా అర్థరహితం. ఎందుకంటే కాంట్రాక్టు సంస్థ ఇప్పటికే దాదాపుగా రూ.కోటిన్నర మేర దేవస్థానానికి డబ్బులు చెల్లించాల్సి ఉంది. నష్టం రానప్పటికీ.. ఈ లెక్కన ఆరు నెలల కాలానికి ఎంత నష్టం వచ్చిందో లెక్కగట్టి ఆ మొత్తాన్ని కాంట్రాక్టు సంస్థ బకాయి కట్టనవసరం లేకుండా చర్యలు తీసుకోవచ్చు. కానీ, ఈ పని దేవస్థాన లీజుల విభాగం అధికారులు చేయటం లేదు. ఈ వ్యవహారానికి సంబంధించి లీజుల విభాగం ప్రధాన అధికారి ఒకరు అత్యుత్సాహంగా.. ఆరు నెలల కాలానికి అవకాశం ఉందన్న దొడ్డి దారి వాదన తీసుకువస్తున్నారని తెలిసింది. హైకోర్టులో డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పు స్పష్టంగా ఉన్నప్పటికీ కూడా లీజుల విభాగం అధికారి దేవస్థాన అధికారులను తప్పుదారి పట్టించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

'ఆంధ్రజ్యోతి' కథనంపై కమిషనర్ విచారణ

టోల్‌గేట్ - పార్కింగ్ కాంట్రాక్టు సంస్థ టెండరు ఈ నెలాఖరుతో ముగుస్తున్నా.. కొత్తగా టెండరు పిలవకపోవటం వెనుక జరుగుతున్న వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం 'వసూళ్లకు వరస కుదిరింది' అంటూ ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ విచారణకు ఆదేశించారు. దుర్గగుడి ఈవో శీనా నాయక్ బుధవారం సెలవులో ఉండటంతో కమిషనర్ ఈ వ్యవహారంపై దుర్గగుడి అధికారులతో మాట్లాడి పూర్తి స్థాయి నివేదిక తనకు పంపించాలని ఆదేశించినట్టు తెలిసింది.

తిరువూరు చైర్‌పర్సన్ పదవి టీడీపీ ఖాతాలోకే..!

(3వ పేజీ తరువాయి)

కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడంతో ఈ పంచాయితీ తాడేపల్లి ప్యాలెస్‌కు చేరింది. పార్టీ ఆదేశాలలో అప్పటి చైర్‌పర్సన్ తన పదవికి రాజీనామా చెయ్యడంతో ఉప ఎన్నిక అనివార్యం అయ్యింది. ఈ నెల 19, 20 తేదీల్లో చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యాంప్ రాజకీయానికి తెరతీసిన వైసీపీ అధిష్టానం తమ సభ్యుల్ని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌కు పంపకపోవడంతో ఎన్నిక నిలిచిపోయింది. తిరిగి జూన్ 2న ఎన్నిక జరుగుతుందని అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో నాటి ప్రభుత్వంలో అభివృద్ధి లేకపోవడం, కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతో వైసీపీకి చెందిన ఏడుగురు (1, 3, 9, 11, 14, 18, 19 వార్డులు) కౌన్సిలర్లు టీడీపీకి మద్దతుగా నిలిచారు. బోర్డులో మూడు స్థానాలు ఉన్న టీడీపీ ప్రస్తుతం 11 స్థానాలకు చేరింది. జూన్ 2న నిర్వహించే ఎన్నిక లాంచనమే అని మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి టీడీపీ ఖాతాలో చేరుతుందని పట్టణ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

ఖరీఫ్ లక్ష్యం 1.24 లక్షల హెక్టార్లు

(3వ పేజీ తరువాయి)

పరీక్షలను రెండు వారాల్లో పూర్తి చేసి నాట్లు వేసే ముందు రైతులకు విత్తనాలు పంచే దిశగా వ్యవసాయ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను రాయితీపై అందించి అధిక దిగుబడి రాబట్టి రైతులకు ఆదాయ పెరుగుదలకు తోడ్పడే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, పిల్లిపెసర విత్తనాలపై 50 శాతం రాయితీతో అందించడానికి వ్యవసాయ శాఖ సిద్ధమవుతోంది. వరి, మినప, పెసర, కందులు 30 శాతం రాయితీతో సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

జాయింట్ కలెక్టర్‌గా ఎస్.ఇలక్కియా

(3వ పేజీ తరువాయి)

కేటాయించటం జరిగింది. 2021 జూన్ 18వ తేదీన ఇలక్కియా ఏపీకి రిపోర్టు చేశారు. వెంటనే తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రెవెన్యూ సబ్ డివిజన్‌కు సబ్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ పని చేస్తూ ప్రసూతి సెలవుపై వెళ్లిపోయారు. ప్రస్తుతం ప్రసూతి లీవులను పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. ఎన్టీఆర్ జిల్లాకు చాలా కాలంగా జేసీ లేరు. ఇంతకు ముందు పనిచేసిన నిధి మీనా ప్రసూతి సెలవులో ఉన్నారు. ఇప్పటి వరకు జేసీ బాధ్యతలను కూడా కలెక్టర్ లక్ష్మీశ నిర్వహిస్తున్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో..

(3వ పేజీ తరువాయి)

డిజిటల్ కస్టడీలో ఉండాలని ఆదేశించారు. దీంతో భయపడిన సదరు వ్యక్తి కెనరా బ్యాంకులోని తన భార్య పేరిట ఉన్న ఎఫ్‌డీని రద్దు చేసి రూ. 17 లక్షలను వారు చెప్పిన ఖాతాలో ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేశాడు. తర్వాత కొన్ని రోజులకు తాను మోసపోయానని గ్రహించి మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 510

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

లబ్బీపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ 10ఎంజీడీ ఫీడర్, 11కేవీ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి. రవీంద్రబాబు తెలిపారు. పకీరుగూడెం, ప్రగతినగర్, చంద్రమౌళీపురం, టిక్కిల్ రోడ్డు, శ్రీరామ్‌నగర్, మొహిద్దీన్ ఎస్టేట్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, బెంజిసర్కిల్ ఏరియా, పోస్టాఫీసు రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.


ఎన్టీఆర్ సర్కిల్‌లో కేక్ కట్ చేస్తున్న గద్దె అనురాధ


బెజవాడ బార్ అసోసియేషన్‌లో..


ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో...


ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో...


17వ డివిజన్ కార్యాలయంలో


నాలుగో డివిజన్ పార్టీ కార్యాలయంలో...

తెలుగు ప్రజల గుండెచప్పుడు ఎన్టీఆర్

పటమట, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి కీర్తిని ప్రపంచ స్థాయికి చేర్చిన ఘనత ఎన్టీఆర్‌దే అని ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. బుధవారం పటమట ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గద్దె అనురాధ, పార్టీ సీనియర్ నాయకులు, తెలుగు యువత నాయకులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజల గుండె చప్పుడు ఎన్టీఆర్ అన్నారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనుడు ఎన్టీఆర్ అన్నారు. మహిళలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం కల్పించారన్నారు. తెలుగు యువత గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ జయంతిని టీడీపీ శ్రేణులు పండుగలా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ప్రేమ్‌నాథ్, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, పొట్లూరి సాయిబాబు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, చెన్నుపాటి క్రాంతి శ్రీ, వీరంకి డాంగియా కుమారి తదితరులు పాల్గొన్నారు.

అభిమాన సంఘం ఆధ్వర్యంలో ...

ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు గోగినేని ధనశేఖర్ ఆధ్వర్యంలో విజయవాడ ఆర్టీసీ కాలనీ ఫ్యాన్స్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ విజయవాడ మాజీ అధ్యక్షుడు కే.వి.పి బసవేశ్వరరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్, పండ్లు స్థానికులకు పంచారు.

1200 మందికి అన్నదానం

కృష్ణలంక: కృష్ణలంక ఆంధ్రాబ్యాంక్ సెంటర్‌లో ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్వర్యంలో జరిగిన వేడుకలో స్థానిక పెద్దలు తుర్లపాటి మల్లేశ్వరరావు, వేములపల్లి రంగారావులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి ఒకరినొకరు తినిపించుకొన్నారు. ఈ సందర్భంగా దాదాపు 1200 మందికి చికెన్ బిర్యానీని అందించారు.

బార్ అసోసియేషన్‌లో...

విజయవాడ లీగల్: బెజవాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు ఎన్టీఆర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్, బార్ అధ్యక్ష, కార్యదర్శులు భాషా, కేవీ రంగారావు, న్యాయవాదులు సప్పా రమేష్, సంపర శ్రీనివాసరావు, గొట్టిపాటి రామకృష్ణ, సత్యం పాల్గొన్నారు.

> టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు 102 జయంతి వేడుకలు బుధవారం నగర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, టీడీపీ కార్యాలయాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు స్వీట్లు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

నాలుగో డివిజన్‌లో ...

భారతీనగర్: రమేష్ ఆసుపత్రి జంక్షన్ సమీపంలోని నాలుగో డివిజన్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో టీడీపీ నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు అందజేశారు.

గుణదల: స్థానిక 5వ డివిజన్లోని క్రీస్తురాజపురంలో జరిగిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ హాజరయ్యారు. ఆయన ముందుగా కేక్‌కట్ చేసి స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలలో..

ఎస్ఆర్ఆర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి కళాశాల ఆవరణలోని ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో...

ప్రభుత్వాసుపత్రి: ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో జరిగిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో వీసీ డాక్టర్ చంద్రశేఖర్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే మొట్టమొదటి ఆరోగ్య విశ్వ విద్యాలయాన్ని విజయవాడలో స్థాపించి అనేక మందికి వైద్య విద్యను సాకారం చేసిన ఘనుడు ఎన్టీఆర్ అని అన్నారు. వర్సిటీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. ●సర్వజనాసుపత్రిలో జరిగిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీ రావు హాజరై ఆయన చేసిన సేవలకు గుర్తు చేసుకున్నారు. డాక్టర్ బీఎస్‌పీ యాదవ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్బీపేట: రాణిగారితోట 17, 18డివిజన్లలో జరిగిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్న టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. **శాప్ కార్యాలయంలో:** శాప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాప్ పరిపాలనాధికారి రమావత్ వెంకట రమణ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శాప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ హౌస్‌లో ..

బస్టేషన్: ఆర్టీసీ హౌస్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ ద్వారకా తిరుమలరావు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు బుధవారం ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా జరుపుకోవటం ఎంతో ముదావహమన్నారు. జ్యోతి వెలిగించి నివాళులర్పించిన అనంతరం ఆయన ఎన్టీఆర్ జీవిత ప్రస్థానం గురించి ప్రస్తావించారు. కుమారి సాంబ్రాజ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ ఈడీ చెంగల్ రెడ్డి తదితరులు సందేశాలు ఇచ్చారు. వివిధ విభాగాల అధికారులు కిషోర్, ఈ.నాగేశ్వరరావు, శోభామంజరి, హెడ్ ఆఫీసులోని పర్సనల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, బస్టేషన్ సిబ్బంది, వివిధ అసోసియేషన్‌ల ప్రతినిధులు హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు సమర్పించారు.

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో..



కార్పొరేషన్: నందమూరి తారక రామారావు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానుభావుడని నగర కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలను సిబ్బందితో కలిసి కమిషనర్ ధ్యానచంద్ర నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంలో కమిషనర్ మాట్లాడుతూ ఆయన ఆశయాలను సాధించే దిశలో ప్రతి ఒక్కరు అడుగు వేయాలని ఆకాంక్షించారు. నగరపాలకసంస్థ చీఫ్ సిటీప్లానర్ సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజనీర్లు పి. సత్యనారాయణ, పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, అకౌంట్స్‌ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.


ఆర్టీసీ హౌస్‌లో...


ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో ..

వన్‌టౌన్: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో ప్రాంగణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు, తెలుగు మహిళలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు మహిళలు ఎన్టీఆర్‌కి ఇష్టమైన పలు రకాల పిండి వంటలు చేసి ఆయన విగ్రహం ముందు ఉంచి ప్రేమను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, చెన్నుపాటి ఉషారాణి, టీడీపీ సీనియర్ నాయకులు తూమాటి ప్రేమనాథ్, నరసింహచౌదరి పాల్గొన్నారు.

జిల్లా పార్టీ కార్యాలయంలో...

ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ విగ్రహానికి రాష్ట్ర పార్టీ కార్యదర్శి కొత్త నాగేంద్ర కుమార్ (నాగబాబు), తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నూతులపాటి నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆదర్శాలకు అనుగుణంగా పార్టీని నడిపిస్తున్న చంద్రబాబు నాయుడుకు అందరూ అండగా ఉండాలన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్పొరేటర్ ఉషారాణి, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు పులిపాటి రాజు, నాయకులు రాజ్యలక్ష్మి, పామర్తి కిషోర్ బాబు పాల్గొన్నారు.


టీడీపీ జిల్లా కార్యాలయంలో..







భూగర్భ డ్రెయినేజీ సమస్యలపై చర్యలు తీసుకోండి : కమిషనర్

రాణిగారితోట, మే 28 (ఆంధ్రజ్యోతి): పొంగే భూగర్భ డ్రెయినేజీ సమస్యలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా బుధవారం ఆయన రాణిగారితోట సిమెంట్ గోడౌన్, కృష్ణలంక ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బాలాజీ నగర్‌లో అండర్‌గ్రౌండ్ పొంగి ప్రజలు పడుతున్న ఇబ్బందులు తీర్చేందుకు జరుగుతున్న ట్రంక్ లైన్ రిపేరు పనులు పరిశీలించారు. ఈ పనులు త్వరగా పూర్తిచేయాలని, శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అదేశించారు. సిమెంట్ గోడౌన్ లో అమృత2.0 పథకం ద్వారా రూ.2.8కోట్లతో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను పరిశీలించి. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఈఈ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీలు

యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా జూన్ 21 వరకు వార్డు, సర్కిల్ స్థాయిలో యోగా పోటీలు జరగనున్నాయని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బుధవారం రాణిగారితోట వారధి వద్ద గల రివర్ ఫ్రంట్ పార్కులో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో పాల్గొన్న వారు వార్డు స్థాయి విజేతలు సర్కిల్‌కు, సర్కిల్ విజేతలు జిల్లా స్థాయికి, జిల్లా విజేతలు రాష్ట్ర స్థాయికి అర్హత సాధిస్తారని తెలిపారు. వివిధ పోటీలలో విజేతలకు అవార్డుల ప్రదానం ఉంటుందని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.షమీ, ప్రాజెక్టు ఆఫీసర్ పి. వెంకటనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం


కేక్ కట్ చేస్తున్న జ్యోతి, గూడపాటి శివదుర్గ, సీనియర్ నేతలు

భారతీనగర్: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు గ్రామంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో సీనియర్ నాయకులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా 600 మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మచిలీపట్నం పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షులు జ్యోతి, 16వ వార్డు నెంబరు గూడపాటి శివదుర్గ, టీడీపీ నేతలు, తెలుగు యవత పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ సామాజిక సేవలే ఆదర్శనీయం

● ఏసీపీ దామోదర్

లబ్బీపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): మలబార్ గోల్డ్ సామాజిక సేవలే ఆదర్శనీయమని ఏసీపీ దామోదర్ పేర్కొన్నారు. వరల్డ్ హంగర్ డే సందర్భంగా బుధవారం బందర్ రోడ్డులోని మలబార్ షోరూం వద్ద నుంచి పేదలకు పంపిణీ కోసం ఆహార పదార్థాల వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ మాట్లాడుతూ మా సంపాదనలో కొంత భాగాన్ని తిరిగి సమాజానికి అందిస్తామని అన్నారు. మే 28 మా వార్షిక సీఎస్ఆర్ దినోత్సవంగా నిర్ణయించి, సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు అండగా నిలబడడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మలబార్ ఉద్యోగులు పాల్గొన్నారు.


వాహనాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ దామోదర్



మహానాడులో కృష్ణలంక టీడీపీ నాయకులు

కృష్ణలంక, మే 28 (ఆంధ్రజ్యోతి) :కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడు కార్యక్రమంలో రెండో రోజు బుధవారం కృష్ణలంక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఆలపాటి మురళి, సరిహద్దు రవి, 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, 13, 18, 20, 22 డివిజన్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మరణించినా ఉపయోగపడేలా...
నిమ్మగడ్డకు చెందిన లీలాకుమారి శరీరదానం



చల్లపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి): మరణించినా మరొకరికి ఉపయోగ పడేలా, తన మృతశరీరం వృధాగా కాలిపోవటం ఇష్టంలేదని, వైద్యవిద్యార్థులకు దానం చేయాలనే వృద్ధురాలి కోరికమీదట ఆమె శరీరాన్ని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు దానం చేసిన వైనమిది. చల్లపల్లి మండలం నిమ్మగడ్డ గ్రామానికి చెందిన కోగంటి లీలాకుమారి(74) మృతిచెందగా ఆమె కోరిక మీదట మేనల్లుడు మాలెంపాటి చక్రధర చౌదరి-జ్యోతిలు శరీరదానం చేసేందుకు ముందుకువచ్చారు. సూర్యదేవర నాగేశ్వరరావు సహకారంతో నాగాయలంక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో లీలాకుమారి నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు, శరీరాన్ని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు బుధవారం దానం చేశారు. శరీరదానం చేసిన లీలాకుమారి ఆదర్శమూర్తి అని పలువురు కొనియాడారు.

స్ఫూర్తి ప్రదాత డ్యాన్స్ మాస్టర్ బబ్లూ
అవయదానం చేసి ప్రాణప్రదాత అయ్యాడు: గద్దె క్రాంతికుమార్

గుణదల, మే 28 (ఆంధ్రజ్యోతి): యువతకు డ్యాన్స్ నేర్పి ఉపాధి మార్గాలు చూపడమే కాకుండా మరణించిన తర్వాత అవయవదానం చేసి మరికొందరికీ ప్రాణప్రదాతగా మారిన డ్యాన్స్ మాస్టర్ శిరింగి కిరణ్ కుమార్(బబ్లూ)కు టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ఘన నివాళులు అర్పించారు. తమిళనాడులోని వెళాంగిని మాత ఆలయానికి వెళుతూ మార్గం మధ్యలో ఒంగోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన క్రీస్తురాజపురానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ శిరంగి కిరణ్ కుమార్ భౌతిక కాయానికి టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ బుధవారం పూలమాల వేసి ఘననివాళులు అర్పించి ఆయన ఆత్మకు శాంతికలగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కిరణ్ కుమార్ కుటుంబసభ్యులకు ఆయన ధైర్యం చెప్పి తన వంతుగా రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనంతరం జరిగిన అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన తర్వాత కూడా తన శరీరంలోని అవయవాలను దానం చేసి మరి కొందరికి ప్రాణప్రదాత అయ్యాడని కొనియాడారు.

దుర్గంధంతో అవస్థలు



పటమట, మే 28 (ఆంధ్రజ్యోతి): పటమట ఠాగూర్ టైప్ ఇన్‌స్టిట్యూట్ వీధిలో మ్యాన్‌హోల్ పొంగి మల, మూత్రాలు బయటకు వస్తుండటంతో ఆప్రాంతం అంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఆరోడ్డులో వెళ్లాలంటే ముక్కులు మూసుకోవాల్సి వస్తుంది. శానిటరీ సిబ్బంది స్పందించి వెంటనే మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

GOLD FINANCE
» బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర :88024 89999
AJB-235095

WANTED
» విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. సెక్యూరిటీ గార్డు, హౌస్ కీపింగ్ బాయ్స్, సివిల్ ఇంజనీర్ (0-2 Yrs Experience), ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి: 72888 85598
AJB- 229

★ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ని, పిల్లలను చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు కావలెను. ఏజెంట్స్ కూడా కావలెను. జీతం: 15k, ఏజెంట్ కమిషన్ : 5k. ఫోన్: 8977517749
AJH-6753

PLOT FOR SALE
» నున్న Bypass న ఆనుకుని 170 చ.గ. అమ్మకం. నున్న మెయిన్‌రోడ్‌కి 2nd ప్లాటు Rs.50 లక్షలు. (మొత్తం: 10 సెంట్లు) తూర్పు, ఉత్తరం, దక్షిణం రోడ్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ 83175 28192
AJB- 448

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికీ - వేగవంతమైన ఫలితం
GST 5% Extra
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ॥ 290/- ప్రతి అదనపు లైనుకు రూ. 40/- కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733, గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
అందిస్తోంది
25% డిస్కౌంట్ సిటీ / జిల్లా ప్రకటనలకు
15% డిస్కౌంట్ జోన్ ప్రకటనలకు
పటమట : 99854 11868, 1 టౌన్ : 99854 09286
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, పెనమలూరు : 99854 09240
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234







మహా వేడుక

తెలుగుదేశం ఆధ్వర్యంలో కడపలో జరుగుతున్న మహానాడు రెండో రోజు సభలకు పలువురు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. వేదికపై జిల్లాకు చెందిన మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొనగా, జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్న చంద్రబాబుకు ప్రమాణ పత్రాన్ని అందజేస్తున్న పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, వేదికపై ప్రసంగిస్తున్న స్వర్ణాంధ్ర మిషన్ చైర్మన్ పట్టాభి, కార్యకర్తలతో కలిసి పాల్గొన్న రాష్ట్ర మాదిగ సంక్షేమ శాఖ చైర్మన్ శ్రీదేవి, చంద్రబాబుతో టీడీ జనార్దన్



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

ఎన్టీఆర్ పేరే ఓ సంచలనం

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

విజయవాడ, మే 28 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు పేరే ఓ సంచలనమని, తెలుగు సినిమా చరిత్రలో ప్రభంజనం సృష్టించి రాజకీయాల్లో అడుగుపెట్టి గొప్ప సంస్కరణలకు తెర తీశారని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పీ కృష్ణయ్య అన్నారు. బుధవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో ఎన్టీ రామారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీ రామారావుతో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కలిసి చేశానన్నారు. తమ ఇద్దరి అనుబంధం ఎంతో ప్రత్యేకమైందని, తాను గుడివాడ ఆర్డీవోగా ఉన్నప్పుడు ఆయన తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేశారని, ఆ సమయంలో రిటర్నింగ్ అధికారిగా ఉన్నానని, నామినేషన్ పత్రాలు తీసుకోవడం, గెలిచిన తరవాత ధ్రువీకరణ పత్రాన్ని అందజేయడం మధురమైన క్షణాలని గుర్తు చేసుకున్నారు. రెండోసారి సీఎంగా ఎన్నికైనప్పుడు గుంటూరు జేసీగా ఉన్న తనను ఆయన కార్యాలయంలో సంయుక్త కార్యదర్శిగా తీసుకున్నారన్నారు. అవినీతి సహించేవారు కాదని, ఆయన సంస్కరణలు ఎందరో జీవితాలను మార్చాయని కొనియాడారు. తెలుగు వారిపైన పడిన మదరాశీలు అనే ముద్రను తొలగించి, ఆంధ్ర ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఆ మహనీయుడి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువేనని ఎన్టీఆర్‌తో ఉన్న తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఏపీపీసీబీ సభ్యకార్యదర్శి, చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, ఏపీపీసీబీ సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేదపండితుని దూషించిన అధికారికి మందలింపు

ఇంద్రకీలాద్రి, మే 28 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో ఓ వేద పండితుడిని ఓ అధికారి దూషించిన సంఘటనపై ఈవోకు ఫిర్యాదు చేయటంతో ఆ అధికారిని మందలించినట్టు సమాచారం. 3 రోజుల క్రితం దేవస్థానంలో జరిగిన పల్లకిసేవలో ఓ అధికారి కీర్తనలు పాడాలని వేద పండితులకు, అర్చకులకు సూచించారు. అదేంటని ప్రశ్నించడంతో ఆ అధికారి వేదపండితుడిపై పరుష పదజాలం వాడాడు. అప్పుడే అక్కడకు వచ్చిన ఈవో ఏంటని అడగటంతో వేదపండితుడు వివరించాడు. దీంతో ఈవో ఆ అధికారిని మందలించినట్టు తెలిసింది. దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ దృష్టికి వెళ్లగా ఈవోకు ఫోన్ చేసి పలు సూచనలు చేసినట్టు తెలిసింది.

ఎన్టీఆర్ కీర్తిప్రతిష్టలు అజరామరం

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఉద్యోగిగా, కళామతల్లి ముద్దుబిడ్డగా పేద ప్రజల గుండె చప్పుడుగా క్రమశిక్షణతో జీవితాన్ని కొనసాగించిన ఎన్టీఆర్ అందుకున్న కీర్తిప్రతిష్టలు అజరామరమని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని పేదలకు సేవలందించడం ద్వారా ఎన్టీఆర్ జిల్లాకు మరింత ఖ్యాతిని తీసుకొద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత ఎన్టీఆర్ జీవిత విశేషాలపై జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కళాక్షేత్ర నాట్య అకాడమీ, భాగవతుల వెంకట రామశర్మ శిష్యబృంద సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. నాట్యాచార్యులు భాగవతుల వెంకట రామశర్మ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి, పర్యవేక్షకుడు ఎం.దుర్గాప్రసాద్, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహన్



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, మీడియా సమన్వయకర్త వీవీ ప్రసాద్, డీఈఓ యూవీ సుబ్బారావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఎర్త్



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏడీసీ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి

హీరోస్ ఫౌండేషన్ భన్సీ, డిప్యూటీ డైరెక్టర్ చంద్రిక పాల్గొన్నారు.

ఏడీసీ ప్రధాన కార్యాలయంలో

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతిని ప్రతి ఏటా మే 28న రాష్ట్ర కార్యక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం (జీఏడీ) నుంచి ఆదేశాలు జారీ చేసింది. దీన్ని పురస్కరించుకొని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఏడీసీ చైర్‌పర్సన్, ఎండీ డి.లక్ష్మీ పార్థసారథి ఎన్టీఆర్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఏడీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత అవసరం

సత్యనారాయణపురం: మానసిక ప్రశాంత ఉంటేనే సురక్షితమైన ప్రయాణ చేయగలమని, యోగాసనాల ద్వారానే మానసిక ప్రశాంతత వస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం బీఆర్‌టీఎస్ రోడ్డు శారదా కాలేజీ జంక్షన్ వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనచోదకులకు నిర్వహించిన ప్రత్యేక యోగా శిక్షణలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని యోగసనాలు వేశారు. ఆర్డీవో కావురి చైతన్య, వీఎంసీ అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, ఆర్టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, ఉద్యోగుల సంఘం జోనల్ అ ధ్యక్షుడు ఎం.రాజబాబు, కె.భద్రచలం, డ్రైవ ర్లు రవాణ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికే మార్గదర్శకం

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాల్లో మార్గదర్శకులైన నేతల్లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు ఒకరని, ఆయన విజనరీ నాయకత్వం రాష్ట్రానికే కాదు దేశానికే మార్గదర్శకమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మహానాడు రెండోరోజు బుధవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా మరోసారి సీఎం చంద్రబాబు ఎన్నికై ప్రమాణ స్వీకారం చేయటం పట్ల శివనాథ్ ఆనందం వ్యక్తం చూస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ జిల్లా ప్రజల తరపున సీ ం చంద్రబాబుకు ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడుగా, సీఎంగా చంద్రబాబు తన రాజకీయ జీవితంలో అందించిన సేవలు తెలుగు ప్రజలందరి గుండెల్లో నిలిచిపోతాయన్నారు.



మహానాడులో పాల్గొన్న ఎంపీ కేశినేని చిన్ని

ఎంపీ కేశినేని రూ.25 లక్షలు విరాళం

తెలుగుదేశం పార్టీ భవిష్యత్తు నిధి కోసం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మహానాడులో పార్టీకి రూ.25 లక్షలు విరాళం అందజేశారు. మహానాడులో జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం సీఎం చంద్రబాబు పార్టీ భవిష్యత్తు అవసరాలకు, పార్టీ ఒకరిపై ఆధారపడకుండా ఉండేందుకు విరాళాలు ప్రకటించిన వారి పేర్లు చదవటంతోపాటు ప్రత్యేకంగా అభినందించారు. ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధితో పాటు పార్టీ అభివృద్ధికి తన శక్తి మేరకు కృషి చేస్తానని శివనాథ్ తెలిపారు.

రైతు సంఘాల నాయకులు
అసత్య ప్రచారం మానుకోవాలి

● నందిగామ డీసీ చైర్మన్ చంద్రశేఖర్

నందిగామ, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌పీ నీరు వేదాద్రి పైప్‌లైన్ ద్వారా కృష్ణానదిలోకి వెళుతున్నాయంటూ కొందరు రైతు సంఘాల నేతలు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం సరికాదని ఎన్ఎస్‌పీ నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేదాద్రి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్లు బండిపాలెం వద్ద ఎన్ఎస్‌పీ కాలువకు అనుసంధానంగా ఉన్నాయన్నారు. వేదాద్రి పథకం మరమ్మతులకు గురికావడంతో బండిపాలెం కాలువ వద్ద కొందరు రైతులు పైప్‌లైన్ గేట్లు ధ్వంసం చేశారన్నారు. దీంతో కొద్దిపాటి నీరు ఆ పైపుల ద్వారా ఆ ప్రాంత పొలాలకు వెళుతున్నట్టు చెప్పారు. వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతుల్లో భాగంగా గేట్లు పటిష్ట పరిచే చర్యలు చేపడుతున్నందున ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. ఎన్ఎస్‌పీ నీరు వేదాద్రి పైప్‌లైన్‌ల ద్వారా కృష్ణానదిలో కలవాలంటే సుమారు 200 మీటర్ల మేర కొండెక్కి ప్రవహించాలన్నారు. గ్రావిటీపై అంత ఎత్తుకు నీరెలా ఎక్కుతుందని ప్రశ్నించారు. రైతు సంఘాల నేతల విమర్శల వల్ల రైతులకు తప్పుడు సమాచారం చేరుతుందన్నారు. వేదాద్రి మరమ్మతుల కోసం ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఎంతో కృషి చేస్తున్నారని, త్వరలో నిధులు సమీకరించి మరమ్మతులు చేయిస్తారన్నారు. వేదాద్రి పైప్‌లైన్ ద్వారా కొద్ది మొత్తం నీరు దిగువకు చేరినా అవి రైతులకే ఉపయోగపడుతున్నాయన్న విషయం రైతు సంఘాలు గమనించాలన్నారు.

30న కేబీఎన్ కళాశాలలో జాబ్ మేళా

వన్‌టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ జిల్లా ఉపాధి కల్పన శాఖ డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 30న విజయవాడ వన్‌టౌన్‌లోని కేబీఎన్ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.సుబ్రహ్మణ్యం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. టెన్త్ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు విద్యార్హత ఉన్న 18 నుంచి 35ఏళ్లలోపున్నవారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ముందుగా టీఐఎన్‌వైయుఆర్ఎల్./జాబ్ మేళా-నైపుణ్యం లింకులో వివరాలు పొందుపరచాలన్నారు. వివరాలకు 9700092606 సంప్రదించాలన్నారు.

31న ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో..

కలెక్టరేట్: ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో ఈనెల 31న శనివారం విజయవాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు వికాస పీడీ కె.లచ్చారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ డ్రైవ్‌లో దాదాపు 10 ప్రముఖ కంపెనీలు 200 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయన్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31న ఎన్టీఆర్ వికాస కార్యాలయం, కలెక్టరేట్‌లో ఉదయం 9గంటలకు సర్టిఫికెట్లు జిరాక్సులతో హాజరుకావాలని, వివరాలకు 9849465427 నెంబరులో సంప్రదించాలని పీడీ లచ్చారావు సూచించారు.

రెరా ఫిర్యాదులను సంతృప్త స్థాయిలో
పరిష్కరించాలి

- అన్ని లే అవుట్లు, నిర్మాణాలను రెరా పరిధిలోకి తేవాలి
- జాతీయ ప్రాజెక్టుల సత్వర పూర్తికి సీఎస్‌లు చొరవ చూపాలి: మోదీ
- ప్రాజెక్టుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా)కి అందే ఫిర్యాదులన్నింటినీ ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించి, వారి నుంచి సంతృప్తి లేఖను తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశించారు. కొనుగోలుదారులకు అన్యాయం జరగకుండా అన్ని లే అవుట్లను, నిర్మాణాలను రెరా పరిధిలోకి తీసుకురావాలని నిర్దేశించారు. బుధవారం అన్ని రాష్ట్రాల సీఎస్‌లతో ప్రధాని వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పలు జాతీయ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ రెరా చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేయాలన్నారు. అన్ని రాష్ట్రాల్లో సెమీకండక్టర్ ఎకో సిస్టమ్‌ను పెంచుతూ పారదర్శకతతో మంచి పాలన ప్రజలకు అందించాలన్నారు. జాతీయ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసేందుకు అన్ని రాష్ట్రాల సీఎస్‌లు ప్రత్యేక చొరవ చూపాలని, లేకుంటే ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరిగిపోతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా వందకుపైగా అణు విద్యుత్ ప్రాజెక్టులను నిర్మించాలనే లక్ష్యంతో ఉన్నామని, వీటి నిర్మాణంపై ఐటీఐల్లో కూడా కోర్సులను ప్రవేశపట్టనున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్రం నుంచి సీఎస్ విజయానంద్, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు పాల్గొన్నారు.

షరతులతో బోరుగడ్డకు బెయిల్

నరసరావుపేట లీగల్, మే 28 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ పల్నాడు జిల్లా నరసరావుపేటలోని రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.గాయత్రి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసులో మార్చి 24 నుంచి రిమాండ్‌లో ఉన్న బోరుగడ్డకు కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ.. మూడు నెలలపాటు ప్రతి ఆదివారం సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరై సంతకం పెట్టాలని షరతు విధించింది.

తెలియదు.. గుర్తులేదు

- పోలీసుల విచారణలో నందిగం జవాబులు

తుళ్లూరు, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తను చితకబాదిన కేసులో బాపట్ల మాజీ ఎంపీ, వైసీపీ నేత నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు బుధవారం విచారించారు. అయితే విచారణలో తెలియదు, గుర్తులేదు, మర్చిపోయా.. అనే సమాధానాలనే సురేశ్ ఇచ్చినట్లు సమాచారం. గుంటూరు జైల్లో రిమాండ్‌లో ఉన్న సురేశ్‌ను మూడు రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో సురేశ్‌ను విచారణకు తుళ్లూరుకు తీసుకొచ్చారు.

గోవిందప్పకు జైల్లో ప్రత్యేక సౌకర్యాలు

విజయవాడ, మే 28(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడు బాలాజీ గోవిందప్పకు జైలు అధికారులు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ఏసీబీ కోర్టు అనుమతి ఇచ్చిన మేరకు ఆయనకు బుధవారం ఇనుప మంచం, పరుపు, దిండు ఏర్పాటు చేశారు. తనకు ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించాలన్న పిటిషన్‌పై వాదనలు పూర్తయ్యాయి. గురువారం కోర్టు తీర్పు ఇవ్వనుంది.

అంతర్రాష్ట్ర.. శిశు విక్రయ ముఠాకు బేడీలు

- 13 మంది ముఠా సభ్యుల అరెస్టు
- 28 మంది శిశువులను విక్రయించిన గ్యాంగ్
- 10 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు
- నల్లగొండ శిశువిహార్‌కు తరలింపు
- అల్లారుముద్దుగా చూసుకున్నామంటూ.. పెంచుకున్న తల్లిదండ్రుల ఆందోళన



సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో శిశు విక్రయాల కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేటక్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువులు మొదలు.. నెలల వయసున్న చిన్నారులను విక్రయించే ఘరానా అంతర్రాష్ట్ర ముఠా ఆటను సూర్యాపేట పోలీసులు కట్టించారు. ముఠాలోని 13 మందిని అరెస్టు చేశారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ ముఠా ఇప్పటి వరకు 28 మంది శిశువులను విక్రయించగా.. వారిలో 10 మందిని కాపాడి, శిశువిహార్‌కు తరలించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహ వివరాలను వెల్లడించారు. శిశు అక్రమ రవాణాపై ఉప్పందుకున్న పోలీసులు.. ఇటీవల ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకున్న దంపతులను అదుపులోకి తీసుకుని, విచారించారు. వారు వెల్లడించిన వివరాలతో సూర్యాపేట పట్టణంలో నివసించే కోడిగుడ్ల వ్యాపారి నక్క యాదగిరి, అతని భార్య ఉమారాణిలను ప్రశ్నించగా.. ఘరానా ముఠా గుట్టు రట్టయింది. బుధవారం ఉదయం వలపన్నిన పోలీసులు 13 మందిని అరెస్టు చేశారు. వీరంతా ఓ చైన్‌మాదిరిగా కలిసి, ముఠాను ఏర్పాటు చేశారని ఎస్పీ వివరించారు. ఈ ముఠా ఇప్పటి వరకు రాజస్థాన్, అహ్మదాబాద్ నుంచి అక్రమంగా రూ.50 వేలకు ఒకరు చొప్పున చిన్నారులను కొని, ఇక్కడ రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు విక్రయిస్తుంటారని పేర్కొన్నారు. "ఈ ముఠా ఇప్పటి వరకు 28 మంది శిశువులను విక్రయించింది. వారిలో.. సూర్యాపేట మండలం టేకుమట్లకు చెందిన ఇద్దరు, సూర్యాపేట పట్టణంలో ఇద్దరు, పెన్‌పహాడ్‌లో ఒకరు, నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్‌లో ఇద్దరు, చిన్న సూరారంలో ఒకరు, హైదరాబాద్‌లో ఒకరితో కలిపి మొత్తం 10 మంది పిల్లలను సంరక్షించాం. వీరిలో ముగ్గురు ఆడశిశువులున్నారు. మిగతా 18 మంది పిల్లలను కూడా కాపాడుతాం" అని ఎస్పీ చెప్పారు. ముఠా సభ్యుల్లో ఒకరైన శారద ఇప్పటికే శిశు విక్రయాల కేసులో లఖ్‌నవూ జైలులో ఉన్నారని, విజయలక్ష్మిపై మునగాల, జనగాంతోపాటు.. ఏపీలోని ఏలూరు, మంగళగిరి ఠాణాల్లో కేసులున్నట్లు తెలిపారు. ఇంతకాలం పిల్లలను పెంచుకున్న తల్లిదండ్రులు సూర్యాపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లలను తమకు అప్పగించాలంటూ కన్నీటిపర్యంతంతో పోలీసులను వేడుకున్నారు..

పారదర్శకమే... కాని ఏకపక్షం

- మార్కెటింగ్ శాఖలో బదిలీలపై భిన్నాభిప్రాయాలు

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. బదిలీల విషయంలో సంబంధిత ఉన్నతాధికారి పారదర్శకంగా నిర్వహించినట్లు అధికార వర్గాలు చెప్తున్నా, ఉన్నతాధికారి ఏకపక్షంగా నిర్వహించారన్న ఆరోపణలున్నాయి. ఉద్యోగుల బదిలీల విషయంలో తాము కోరుకున్న పోస్టులు పొందటానికి ముందే కొందరు ఒప్పందాలు చేసుకున్నారు. అవసరమైతే ముడుపులు ఇచ్చుకోవటానికి సిద్ధపడ్డారు. విషయం తెలిసిన సంబంధిత మంత్రి హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆ శాఖ డైరెక్టర్ పారదర్శకంగా బదిలీల ప్రక్రియను నిర్వహించారని సమాచారం. సాధారణ బదిలీలకు ఈ శాఖలో దాదాపు 250 మంది అర్హులుగా ఉండగా, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో ఒకే స్టేషన్‌లో ఐదేళ్లు దాటిన వారితో పాటు రెండేళ్లు నిండి బదిలీ కోసం ఉద్యోగులు చేసుకున్న దరఖాస్తులనూ డైరెక్టర్ విజయ సునీత నేరుగా పరిశీలించారని సమాచారం. ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సిబ్బందితో కలసి అర్ధరాత్రి వరకు డైరెక్టర్ ప్రతి దరఖాస్తునూ నేరుగా పరిశీలించి, ఉద్యోగులను పిలిచి మాట్లాడారని తెలిసింది. కౌన్సెలింగ్ విధానంలో బదిలీల ప్రక్రియను నిర్వహించినట్లు పలువురు పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారమే బదిలీలు

- ఆంధ్రజ్యోతి కథనంపై వ్యవసాయ శాఖ డైరెక్టర్ వివరణ

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): 'వ్యవసాయ శాఖలో జోనల్ స్థాయి, రాష్ట్ర కేడర్‌కు.. కౌన్సెలింగ్ కమిటీల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తాం. వాటిని పరిశీలించి, నిబంధనల ప్రకారమే ఉన్నతాధికారుల ఆమోదంతో గడువులోగా బదిలీ ప్రక్రియను పూర్తి చేస్తాం' అని ఆశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. వ్యవసాయ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియపై బుధవారం ఆంధ్రజ్యోతిలో 'యూనియన్ల హవా' శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. 'సాధారణ బదిలీలకు సంబంధించి ప్రభుత్వ జీవో 23 ప్రకారం వ్యవసాయ శాఖ ఉద్యోగుల బదిలీలకు విధి విధానాలు రూపొందించాం. బదిలీలకు అర్హులైన ఉద్యోగుల నుంచి దరఖాస్తులు తీసుకున్నాం. ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత లేని వాటిని తొలగించాం. తుది జాబితాను ఉన్నతాధికారుల ఆమోదానికి పంపాం. నిబంధనల ప్రకారం బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తాం. ఐదేళ్లు దాటిన కొంత మంది ఉద్యోగులకు రిటెన్షన్ ఇవ్వలేదు. జీవో ప్రకారం స్టేషన్ సీనియారిటీని పరిగణలోకి తీసుకుని, అర్హులైన వారిని తప్పనిసరిగా బదిలీ చేస్తాం. ఆఫీస్ బేరర్స్ అయినా పరిపాలనాపరమైన అవసరం కోసం నిబంధనల ప్రకారం బదిలీ చేసే అవకాశం ఉంది' అని ఢిల్లీరావు పేర్కొన్నారు.

పేదల సంక్షేమానికి నాంది ఎన్టీఆర్

- రాష్ట్ర సచివాలయంలో ఘనంగా జయంతి వేడుకలు: సీఎస్ విజయానంద్



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న సీఎస్ విజయానంద్

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): అమరావతి సచివాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా, సీఎం ముఖ్య కార్యదర్శి రవిచంద్ర తదితరులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ.. 'దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రఖ్యాత తెలుగు నటుడిగానే కాకుండా రాజకీయ జీవితంలో కూడా ఆదర్శవంతంగా నిలిచారు. పేదల సంక్షేమానికి అనేక వినూత్న కార్యక్రమాలకు నాంది పలికారు. ప్రజలకు ఆయన చేసిన ఎనలేని సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి యేటా మే 28న ఆయన జయంతిని రాష్ట్ర వేడుకగా జరపాలని నిర్ణయించింది' అని అన్నారు. అమరావతి అసెంబ్లీ భవనంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి.

దివ్యాంగుల కార్పొరేషన్ ఎండీగా కుమార్‌రాజా

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ ఎండీగా కుమార్ రాజాను పునర్నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ పునర్నియామకం చేసింది. దీంతోపాటు ఆయనపై వచ్చిన ఆరోపణల విచారణకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి ఆదేశాలు ఇచ్చింది. మహిళా,శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ హైకోర్టు సీజేగా అపరేశ్ కుమార్ సింగ్

- కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులు



చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్

హైదరాబాద్, న్యూఢిల్లీ, మే 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అపరేశ్ కుమార్ సింగ్(ఏకే సింగ్) నియామకం కానున్నారు. ప్రస్తుతం త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన్ను తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయినప్పటి నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజోయ్‌పాల్ సేవలు అందిస్తున్నారు. ఆయన్ను కోల్‌కతా హైకోర్టు జడ్జిగా బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. మరోవైపు తెలంగాణ హైకోర్టులో నాలుగో సీనియర్ జడ్జిగా ఉన్న జస్టిస్ తడకమళ్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేశారు. సుప్రీంకోర్టు కొలీజియం ఈ నిర్ణయాలను ఈ నెల 26నే తీసుకున్నా నోటిఫికేషన్లు మాత్రం తాజాగా బుధవారం వెలువడ్డాయి. అలాగే ఇప్పటికే తెలంగాణ హైకోర్టు నుంచి వివిధ రాష్ట్రాల హైకోర్టులకు బదిలీ అయిన జస్టిస్ సి. సుమలత, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ ఎ. అభిషేక్‌రెడ్డి మళ్లీ తెలంగాణ హైకోర్టుకు బదిలీపై రానున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ మంగళవారం వెలువడింది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసును కొట్టేయండి

- సుప్రీంకోర్టులో సినీ నటుడు మంచు విష్ణు పిటిషన్



న్యూఢిల్లీ, మే 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కేసును కొట్టివేయాలని కోరుతూ సినీ నటుడు మంచు విష్ణు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజకీయాలతో సంబంధం లేని తనపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదు చేయడం సరికాదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమ విద్యాసంస్థల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ 2019లో తిరుపతి - మదనపల్లె జాతీయ రహదారిపై విద్యార్థులతోపాటు మంచు కుటుంబం ధర్నాకు దిగింది. అయితే, అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో మోహన్‌బాబు, ఆయన కుమారులు విష్ణు, మనోజ్‌తోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ఆ కేసులో తనను క్వాష్ చేయాలని కోరుతూ మార్చి 30న మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తిరుపతి మేజిస్ట్రేట్ ఎదుట విచారణకు హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని మోహన్‌బాబు కోరగా, ధర్మాసనం నిరాకరించింది. అదే కేసులో ఈ నెల 21న విష్ణు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం విచారించింది. మంచు విష్ణు తరఫున న్యాయవాదులు పాయ్ అమిత్, పీ భరద్వాజ్, కౌశల్ దుబే హాజరయ్యారు. ఇదే కేసుకు సంబంధించి మోహన్‌బాబు పిటిషన్‌పై విచారణ జూలై 15కు ఉందని, విష్ణు పిటిషన్‌ను సైతం దానితో కలిపి విచారించాలని పాయ్ అమిత్ కోరారు. ఆ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను జూలై 15కు వాయిదా వేసింది. ప్రతివాదులుగా ఉన్న ఏపీ ప్రభుత్వంతోపాటు కే హేమలతకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోపు సమాధానమివ్వాలని ఆదేశించింది.

నడ్డాతో బీజేపీ రాష్ట్ర నేతల భేటీ

- ఆర్‌డీటీ సేవలను కొనసాగించేలా చూడండి
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మంత్రి సత్యకుమార్ వినతి

న్యూఢిల్లీ, మే 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ భేటీ అయ్యారు. బుధవారం, రాజ్యసభ ఎంపీగా సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా నడ్డాతో వారు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. మరోవైపు అనంతపురం కేంద్రంగా పనిచేస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఆర్‌డీటీ)కి ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మంత్రి సత్యకుమార్ కోరారు. గత 55 ఏళ్లుగా ఆర్‌డీటీ అందిస్తున్న సేవలను కొనసాగించడానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రమంతటా రుతుపవనాలు

» పక్షం రోజుల ముందే విస్తరించిన నైరుతి

విశాఖపట్నం, అమరావతి, మే 28 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు బుధవారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించాయి. సాధారణంగా మే 27కు అండమాన్‌కు రావాల్సి ఉండగా, ఈ ఏడాది మే 13నే వచ్చాయి. దేశంలోకి జూన్ 1కి వచ్చే రుతుపవనాలు ఈసారి మే 24నే కేరళను తాకాయి. రాయలసీమకు జూన్ 4న వచ్చి, రాష్ట్రమంతా జూన్ 13 నాటికి విస్తరించాల్సి ఉండగా, ఈసారి మే 26నే రాయలసీమలోకి ప్రవేశించాయి. ఆపై జూన్ 13 నాటికి ఇచ్చాపురం వరకు వెళ్లాల్సి ఉండగా, 15 రోజుల ముందే రాష్ట్రమంతా విస్తరించాయి.

వర్షాలు.. ప్రమాదాలు.. జాగ్రత్త!

మరోవైపు బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. గురువారం నాటికి ఉత్తరంగా పయనించి వాయుగుండంగా బలపడనుంది. దీని ప్రభావంతో ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయి. ఉత్తర కోస్తాలో అక్కడక్కడా భారీ నుంచి అతిభారీవర్షాలు కురుస్తాయని, వర్షాలు కురిసే సమయంలో గంటకు 50 నుంచి 60 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీవ్ర అల్పపీడనం ప్రభావంతో బంగాళాఖాతం అల్లకల్లోలంగా మారింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. విశాఖ ఆర్కే బీచ్‌లో సముద్రం ముందుకువచ్చింది. కురుసుర మ్యూజియం వద్ద తీరం కోతకు గురైంది.

ఎట్టకేలకు ఉపాధి సిబ్బందికి జీతాలు

» జూన్ మొదటి వారంలో రెండు నెలల వేతనం

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి సిబ్బంది జీతాలకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఏప్రిల్, మే నెలకు సంబంధించిన జీతాలను విడుదల చేసేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో సిబ్బంది బ్యాంకు ఖాతాల్లో రెండు నెలల వేతనాలను జమచేయనున్నారు. గత ఆర్నెల్లుగా కేంద్ర ప్రభుత్వం నుంచి మెటీరియల్, అడ్మిన్ నిధులు విడుదల కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి సిబ్బందికి గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఉపాధి అడ్మిన్ వ్యయం కోసం రూ.60 కోట్లు అడ్వాన్స్ ఇవ్వాలని కోరడంతో.. ఆర్థిక శాఖ ఆమోదించింది.

తెలియదు.. గుర్తులేదు.. విచారణలో నందిగం జవాబులు

తుళ్లూరు, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి రాజును చితకబాదిన కేసులో బాపట్ల మాజీ ఎంపీ, వైసీపీ నేత నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు బుధవారం విచారించారు. అయితే విచారణలో తెలియదు, గుర్తు లేదు, మర్చిపోయా.. అనే సమాధానాలనే ఇచ్చినట్లు సమాచారం. గుంటూరు జిల్లా కారాగారంలో రిమాండ్‌లో ఉన్న సురేశ్‌ను 3 రోజుల పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించింది. దీంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం సురేశ్‌ను విచారణ కోసం తుళ్లూరు స్టేషన్‌కు తీసుకొచ్చారు.

నకిలీ ఖాతాలతో పోస్టులు

» సజ్జల భార్గవ్‌రెడ్డి కేసులో గుర్తింపు.. మళ్లీ విచారణకు పిలుస్తాం: సీఐ

మంగళగిరి సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టుల కేసులో వైసీపీ నేత సజ్జల భార్గవ్‌రెడ్డి బుధవారం గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. సుమారు గంటన్నరపాటు విచారణలో దాదాపు 30 ప్రశ్నలు సంధించగా చాలా వాటికి సరైన సమాధానం ఇవ్వలేదు. మరికొన్నింటికి తెలియదని చెప్పినట్లు తెలిసింది. భార్గవ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి నకిలీ అకౌంట్ల ద్వారా పోస్టులు పెట్టించినట్టు గుర్తించామని మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. భార్గవ్‌రెడ్డి ఇచ్చిన సమాధానాలు సంతృప్తికరంగా లేవని, మరోమారు విచారణకు పిలిచే అవకాశం ఉందన్నారు. సుధాకర్‌రెడ్డి పరారీలో ఉన్నాడని తెలిపారు.

31నే పింఛన్ల పంపిణీ

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): జూన్ 1న ఆదివారం కావడంతో ఈసారి రాష్ట్రంలో సామాజిక పెన్షన్ల పంపిణీని ఒక రోజు ముందుగానే ఈ నెల 31వ తేదీన చేపట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఒకటో తేదీ ఉద్యోగులకు సెలవు కావడంతో లబ్ధిదారులకు అంతకముందే పింఛన్ల పంపిణీ చేయనున్నారు.

దక్షిణ మధ్య రైల్వే

మమ్మల్ని అనుసరించండి X @SCRailwayindia. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

ఇ-వేలం ప్రకటన నం: BZA-04-2025-26
తేది: 28.05.2025

PUB0620

భారత రాష్ట్రపతి తరఫున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ వారు విజయవాడ డివిజన్‌లో SLR లీజింగ్ మరియు NFR ప్రకటనల కాంట్రాక్టుల కొరకు IREPS: www.ireps.gov.in లో 'E-Auction Leasing' మాడ్యూల్ ద్వారా ఇ-వేలం కొరకు పద్దెనిమిది సంవత్సరాల వయస్సు పైబడిన భారత జాతీయులు మరియు కంపెనీలు/ సంస్థలను ఆహ్వానిస్తున్నారు.

ఇ-వేలం షెడ్యూలు వివరణ దిగువ ఇవ్వబడినది. వేలంలో ఆఫర్ చేయబడిన అస్తుల వివరాలను IREPS వెబ్‌సైట్‌లో చూడవచ్చును.

క్రసం.	కాంట్రాక్టు రకం	వేలంలో ఆఫర్ చేయబడిన లాట్ల సంఖ్య	వేలం షెడ్యూలు తేది మరియు తెరచు సమయం
1	SLR లీజింగ్	రైలు నం. 12078 - (FSLR1)	02.06.2025 10.00 గం.
2		రైలు నం. 12713- (FSLR1)	
3		రైలు నం.12718- (FSLR1), (FSLR2)	
4		రైలు నం. 12743-(FSLR1)	
5		రైలు నం. 12744 - FSLR1)	
6		రైలు నం.12749- (FSLR1), (RSLR1)	
7		రైలు నం.12787 - (FSLR1), (RSLR1)	
8		రైలు నం. 12795- (FSLR1)	
9		రైలు నం.17208 (FSLR1), (RSLR1)	
10	SLR లీజింగ్	రైలు నం.17210-(FSLR1), (FSLR2), (RSLR1)	03.06.2025 10.00 గం.
11		రైలు నం. 17211- (FSLR1)	
12		రైలు నం.17219 (FSLR1), (RSLR1)	
13		రైలు నం. 17221- (FSLR1)	
14		రైలు నం.17225 (FSLR2) , (RSLR1)	
15		రైలు నం.17231- (FSLR1), (RSLR1)	
16		రైలు నం. 17247 - (FSLR1), (FSLR2), (RSLR1)	
17	SLR లీజింగ్	రైలు నం. 17250 - (FSLR1), (FSLR2), (RSLR1)	04.06.2025 10.00 గం.
18		రైలు నం. 17255 - (FSLR1),	
19		రైలు నం. 17330 - (FSLR1), (FSLR2), (RSLR1)	
20		రైలు నం. 17644 - (FSLR1), (FSLR2), (RSLR1)	
21		రైలు నం. 17655 - (FSLR1), (FSLR2), (RSLR1)	
22	ఇతర NFR ప్రకటనలు	గూడూరు, వెంకటాచలం, వేదాయపాలెం, పడుగుపాడు, బిట్రగుంట, నెల్లూరు, కావలి, ఒంగోలు, సింగరాయకొండ, చీరాల, బాపట్ల, నిడుబ్రోలు, తెనాలి, దుగ్గిరాల మరియు పెదవడ్లపూడి స్టేషన్లలో సోత్ సెక్షన్ (విజయవాడ డివిజన్‌లోని కృష్ణా కాలువ - గూడూరు సెక్షన్)లో ప్యాకేజీ-ఇ లొకేషన్ల క్రింద వివిధ స్టేషన్ల ఆవరణల లోపల ఇన్‌సైడ్ లొకేషన్ల కోసం కేటాయించబడిన ఏరియాల వద్ద ప్రకటనల ప్రదర్శన కాంట్రాక్టు.	02.06.2025 15.00 గం.
		మధురానగర్, మచిలీపట్నం, గుడివాడ, భీమవరం, కల్లారి- & భీమవరం టౌన్ - నరసాపూర్ స్టేషన్లలో (విజయవాడ డివిజన్‌లోని బ్రాంచ్ లైన్)లో ప్యాకేజీ-బి క్రింద స్టేషన్ భవనం లోపల కేటాయించబడిన ఏరియాల వద్ద ప్రకటనల ప్రదర్శన కాంట్రాక్టు.	

1. ఇ-వేలములలో పాల్గొనుటకు డిజిటల్ సిగ్నేచర్ పొందుట బిడ్డరుదే బాధ్యత. 2. బిడ్డరు SBIలో కరెంట్ అకౌంట్‌ను కలిగి ఉండవలెను మరియు ఇది IREPSలో ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్‌తో లింక్ చేయబడి ఉండవలెను. 3. ఇ-వేలంలో పాల్గొనుటకు వన్‌టైమ్ ఆన్‌లైన్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి, తద్వారా భారతీయ రైల్వేలలోని ఏ డివిజన్‌లోనైనా ఏ వేలంలోనైనా పాల్గొనుటకు ఎలాంటి భౌగోళిక పరిమితులు ఉండవు. 4. పైన తెలిపిన ఇ-వేలముల తేదీలపై టైమ్ స్లాట్లు IREPS అప్లికేషన్ (www.ireps.gov.in)లో 'E-Auction Leasing' మాడ్యూల్‌లో లభిస్తాయి. తదనుగుణంగా గమనించి ఇ-వేలంలో పాల్గొనవలెను.

ఇ-వేలం జరిగే సమయంలో IREPS పోర్టల్‌లో తలెత్తే ఏదేని అంతరాయానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. ఇ-వేలం విధానాన్ని అర్థం చేసుకొనుటకు మరియు పాల్గొనడానికి IREPS అప్లికేషన్ (www.ireps.gov.in)లో హోమ్‌పేజీలో లెఫ్ట్ నావిగేషన్ బాక్స్‌లోని లెర్నింగ్ సెంటర్ లింక్ ద్వారా యూజర్ మాన్యువల్‌ను చదువుకోవలసిందిగా బిడ్డర్లు సూచించబడుచున్నారు.

A0766 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ

చరిత్ర సృష్టించేలా

యోగా డే

26 జిల్లాల్లో 26 థీమ్‌లతో నిర్వహిస్తాం



యోగాసనాలు వేస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఆయన సతీమణి మాధవి తదితరులు

» యోగాంధ్ర తీర్మానంపై చంద్రబాబు

» రాష్ట్రవ్యాప్తంగా లక్ష ప్రదేశాల్లో కార్యక్రమాలు

» 2 కోట్ల మందికిపైగా భాగస్వామ్యం లక్ష్యం

» గ్రామ స్థాయి వరకు కమిటీల ఏర్పాటు

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని యోగాంధ్రగా మార్చాల్సిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. మహానాడు రెండో రోజున యోగాంధ్ర తీర్మానంపై ఆయన మాట్లాడారు. 'రోజువారీ పనుల కారణంగా ప్రతి ఒక్కరూ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్ల రాష్ట్ర ప్రజలంతా అనునిత్యం భయం, ఒత్తిడిలో ఉన్నారు. ఎవరిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తారో తెలియక ఇబ్బందులు పడ్డాం.



యోగాను ప్రతి ఒక్కరూ సాధన చేయాలి. దీంతో శక్తి, ఏకాగ్రత పెరుగుతుంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిద్దామని ప్రధాని మోదీ కోరారు. మీ అందరిపై నమ్మకంతో చరిత్ర సృష్టించేలా యోగాడే నిర్వహిస్తామని ఆయనకు మాట ఇచ్చా. యోగా డేని ఘనంగా నిర్వహించి ఏపీని ప్రపంచ పటంలో నిలబెడదాం. యోగా దినోత్సవాన్ని ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు 5 లక్షల మందితో నిర్వహించబోతున్నాం. ఇలా ఒకే చోట 5 లక్షల మందితో యోగాడే నిర్వహించడం ఎక్కడా జరగలేదు. యోగా డే రోజు రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మంది యోగాలో పాల్గొనేలా లక్ష్యం పెట్టుకున్నాం. ఇంతకు ముందు గుజరాత్‌లో 1.53 లక్షల మందితో యోగా నిర్వహించారు. ఆ రికార్డును తిరగరాసేలా యోగా డే నిర్వహించబోతున్నాం. 20 లక్షల మందికి యోగా సర్టిఫికెట్లు అందిస్తాం. 26 జిల్లాల్లో 26 థీమ్‌లతో యోగా డే నిర్వహిస్తున్నాం' అని చంద్రబాబు తెలిపారు.

యోగాంధ్ర అమలుకు మార్గదర్శకాలు విడుదల

వచ్చే నెల 21న ప్రధాని మోదీ విశాఖపట్నంలో పాల్గొననున్న యోగాంధ్ర సభ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను తాజాగా విడుదల చేసింది. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలు జూన్ 21న విశాఖపట్నంలో ప్రధాని పాల్గొనే కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా స్థాయిల్లో ప్రతిభ చూపిన వారికి అవార్డులు ప్రకటిస్తారు. రాష్ట్రస్థాయిలో అమరావతిలో గ్రాండ్ ఫైనల్ కూడా నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల మందికిపైగా యోగా కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయాలని ప్రణాళికలు రూపొందించారు. గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, పరిశ్రమలు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు సుమారు లక్ష చోట్ల యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ వైస్‌చైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా, మండలస్థాయిలో ఎంపీడీవో/ మున్సిపల్ కమిషనర్ చైర్మన్‌గా గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శి/వార్డ్ సెక్రటరీ చైర్మన్‌గా కమిటీలు ఏర్పాటు చేశారు.

మదనపల్లెలో ఐదువేల మందితో యోగాసనాలు

మదనపల్లె, మే 28(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె బీటీ కళాశాల మైదానంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమం విజయవంతమైంది. బుధవారం జిల్లా స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లాస్థాయి అధికారులు, ప్రముఖులు, మహిళలు, స్వయంసహాయక సంఘాలు, అంగన్‌వాడీ, వైద్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది సుమారు 5 వేల మంది హాజరై యోగాసనాలు వేశారు. వారికి 12 మంది యోగా గురువులు సూచనలిచ్చారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఆయన సతీమణి మాధవి, పిల్లలు శ్రీనిత్య, శ్రీదిత్య, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల తదితరులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగ సాధనతో మానసికంగా, శారీరకంగా, ఆధ్యాత్మికంగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

తొలివారంలోనే 28.55 లక్షల మంది పేర్ల నమోదు

యోగాభ్యాసంపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర-2025కు మొదటి వారంలోనే మంచి స్పందన వచ్చింది. నెల రోజులు సాగే యోగాంధ్ర కార్యక్రమంలో రెండు కోట్ల మంది పేర్ల నమోదు లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ధారించింది. మొదటి వారంలో 26,66,666 మంది పేర్ల నమోదు లక్ష్యంగా పెట్టుకోగా, ఈ నెల 27 వరకు 28,55,048 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. మాస్టర్ ట్రైనర్ల నమోదు కూడా బాగా జరిగింది. మొదటి వారంలో 2,600 మంది మాస్టర్ ట్రైనర్ల నమోదు లక్ష్యం కాగా, 10,609 మంది నమోదు చేసుకున్నారు. మొత్తం 1.35 లక్షల మంది ట్రైనర్ల నమోదు దాదాపు పూర్తైంది. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మే 21 నుంచి నెలరోజుల పాటు యోగాంధ్ర పేరిట పలు కార్యక్రమాల్ని రూపొందించి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తోంది. మొదటి వారంలో ప్రజల నుంచి వచ్చిన స్పందన వివరాల్ని క్రోడీకరించి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు నివేదిక తయారు చేసి కేబినెట్ కమిటీకి అందజేశారు. మొదటి వారంలోనే 2,600 మంది మాస్టర్ ట్రైనర్ల శిక్షణ లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, ఇప్పటికే 5,353 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని కృష్ణబాబు చెప్పారు. 12 జిల్లాల్లో లక్ష్యాన్ని మించి యోగాసక్తి కలిగిన వారి పేర్ల నమోదు జరిగిందన్నారు. పశ్చిమ గోదావరి, సత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, పల్నాడు జిల్లాలు తొలి 5 స్థానాల్లో నిలిచాయని, మరో 8 జిల్లాలు నిర్దేశించిన లక్ష్యాలకు చేరువయ్యాయని తెలిపారు. విశాఖ, కోనసీమ, ప్రకాశం, అనంతపురం, కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో రిజిస్ట్రేషన్లు పెంచే ప్రయత్నం చేయాల్సి ఉందని పేర్కొన్నారు.

శ్రీవారి భక్తులకు 'స్మార్ట్' రక్షణ..!

» వన్యమృగాల బెడదకు స్మార్ట్‌స్టిక్స్‌తో చెక్

» దీనిలో టార్చ్, అలారం, కరెంట్ షాక్ డివైజ్



తిరుమల, మే 28 (ఆంధ్రజ్యోతి): చిరుతలు, ఎలుగుబంట్లు, ఏనుగుల వంటి వన్యప్రాణుల నుంచి శ్రీవారి భక్తులకు రక్షణ కల్పించేందుకు టీటీడీ స్మార్ట్ స్టిక్స్‌ను వినియోగంలోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఇప్పటికే 20 'స్మార్ట్ స్టిక్స్'ను కొనుగోలు చేశారు.

స్మార్ట్ స్టిక్స్ ప్రత్యేకత ఏమిటి..?

ప్రస్తుతం ఈ స్మార్ట్ స్టిక్స్‌ను టీటీడీ ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది వినియోగిస్తున్నారు. నడక మార్గాల్లో వచ్చే భక్తులతోపాటు వచ్చే సెక్యూరిటీ, ఫారెస్ట్ సిబ్బంది వాడే ఈ స్మార్ట్ స్టిక్స్‌లో ఎక్కువ కాంతి వచ్చేలా టార్చ్, అలారం ఉంటాయి. వీటితోపాటు కింద భాగంలో కరెంటు షాక్ ఇచ్చే డివైజ్‌ను ఏర్పాటు చేశారు. వన్యమృగాలు చేరువగా వచ్చినప్పుడు ఈ స్మార్ట్‌స్టిక్స్‌లో ఉన్న అలారం మోగించవచ్చు. అయినా దగ్గరకు వస్తే స్టిక్‌లోని డివైజ్‌ను యాక్టివేట్ చేసి వాటికి కరెంట్ షాక్ ఇవ్వగానే భయంతో పారిపోతాయి. చిరుతల సంచారం పెరిగిన నేపథ్యంలో మరో 20 స్మార్ట్ స్టిక్స్‌ను కొనుగోలు చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి బుధవారం ఫారెస్ట్ అధికారులను ఆదేశించారు.

వాహనాలు అమ్మకము

Vehicle No.	Make & Model	Year
AP16TD7038	AL DOST	2013
AP39UL0998	ERTIGA ZDI+ DIESEL 7 SEATER	2015
AP16TS1501	AL DOST	2018
AP35V7254	TATA SE 1613 TURBO FBT-T	2010
AP39W5535	TATA SE 1613 CUMMINS FBT-T	2011
AP16TF1690	TATA ACE	2014
AP39UL1785	MAHINDRA ALFA BS6-P	2022
AP16FA0911	SONALIKA DI 740	2018
AP37TA8773	AL DOST	2013
AP39UR3587	SONALIKA DI 740	2022
AP16TF-7279	MAHINDRA 415	2016
AP39TL4925	AL DOST PLUS	2020
AP39TV3757	AL BADA DOST I4 BS6	2021
AP31TV6232	MARUTI DZIRE TOUR DIESEL-P	2015
AP05TL2339	AL 2518 FBT-T	2018
AP39MD4059	I10 GRAND PRIME T CRDI DIESEL 5 SEATER	2018
AP39TR1692	SWARAJ 843 XM	2020

AUCTION PLACE : SHRIRAM AUTO MALL INDIA LTD., SURVEY NO. 79, MUSTABAD ROAD, KESARAPALLI - 521 102. GANNAVARAM MANDAL, KRISHNA DISTRICT, AP
AUCTION DATE : 29-05-2025
AUCTION START AT 10 AM
Cont : SHRIRAM FINANCE LIMITED
D No:- 27-12-34, BSN REDDY COMPLEX, 3rd Floor, Gudavallivari Street, VIJAYAWADA. Ph: 0866-2579197
9949911574, 9704184786

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.02/ టి.ఓ / 2025-26, తేది: 26.05.2025

ర.భ. శాఖ, విజయవాడ సర్కిల్, కృష్ణా మరియు యన్.టి.ఆర్ జిల్లాలో రహదారి అభివృద్ధి పనులు చేయుట కొరకు (2) పనులకు గాను టెండర్లు ఆహ్వానించడమైనది. 2 పనుల అంచనా విలువ: రూ.400.00 లక్షలు. టెండర్లు స్వీకరించుటకు ఆఖరు తేది: 12.06.2025, మ.3గం.ల వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in లో చూడవచ్చును.

సం/- పర్యవేక్షక ఇంజనీరు, (ర.భ) సర్కిల్, విజయవాడ

DIPR RO No.16548/CL/ADVT/1/1/2021-22, Dt: 28.05.2025

Government of Andhra Pradesh
Swachha Bharat Mission (Urban)
PR&RD Department
Swachha Andhra Corporation
e-Procurement Tender Notice

SL.No	NIT No.	Name of Work
1.	NIT No.02 & 06 & 12to16/SBM(G) /CE/SBM(G)/GOBAR-dhan/2025-26	Construction of Biogas plant from Organic waste like Agriculture waste, Cow Dung, Food waste under GOBAR- dhan Project on EPC Mode in 07 locations in 07 districts in Andhra Pradesh (2nd call)
2.	NIT No. 01/SAC/ SBM(G)/ CE /SWM/UWM/MTU/ 2025-26	Supply, Installation, Testing and Commissioning of Mobile Faecal Sludge Management Plant (MTU) under SBM (G) in A.P. State (2nd call)

The above bid can be downloaded on "ap e-procurement" portal from 17.05.2025 to and due date submission of Bid is on 02.06.2025 up to 5.00 PM. Bid opening on at 02.06.2025, 05:30 PM. Please refer to **www.apeprocurement.gov.in** for details

Sd/- Managing Director, SAC, Vijayawada

DIPR RO No.4146-PP/CL/ADVT/1/1/2021-22, Dt: 28.05.2025

విచారణలో విస్తుగొల్పే కుట్రకోణాలు!

» ముగిసిన సిరాజ్ రెహ్మాన్, సమీర్ కస్టడీ

» కోర్టుకు హాజరు.. విశాఖ జైలుకు తరలింపు

» 'అహిం' సభ్యుల కోసం దేశవ్యాప్తంగా గాలింపు



కస్టడీ అనంతరం సిరాజ్, సమీర్‌లను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

విజయనగరం/క్రైం, మే 28(ఆంధ్రజ్యోతి): విజయనగరంతో పాటు, పలు రాష్ట్రాల్లో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు అనుమానిస్తున్న సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌ల కస్టడీ బుధవారంతో ముగిసింది. వైద్య పరీక్షల అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో జిల్లా కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయాధికారి ఆదేశాలతో భారీ బందోబస్తు నడుమ విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ నెల 16న సిరాజ్‌ను విజయనగరం విజ్జీ స్టేడియంలో ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్, స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. సిరాజ్ ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లో సమీర్‌ను అదుపులోకి తీసుకుని విజయనగరం తీసుకొచ్చారు. వీరిద్దరినీ విచారించగా పలు విస్తుగొల్పే కుట్రకోణాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో అదేరోజు ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ అధికారులు విజయనగరంలోని పలుప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సిరాజ్ ఇంట్లో పేలుళ్లకు సంబంధించి మందుగుండు సామగ్రి, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌లు, సిరాజ్ వినియోగించే బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. 17వ తేదీన సిరాజ్‌ను, 18న సమీర్‌ను కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. దీంతో ఎన్ఐఏ, పోలీసు అధికారులు మరిన్ని వివరాలు రాబట్టేందుకు విచారణ నిమిత్తం కోర్టులో కస్టడీ పిటిషన్ వేశారు. దీంతో 22న పోలీసు కస్టడీకి అనుమతిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు ఇచ్చారు.

ఆరు రోజుల విచారణ ఇలా..

» 23వ తేదీ నుంచి స్థానిక పోలీసు శిక్షణా కళాశాలలో విచారణ ప్రారంభించారు. ఈ ఆరు రోజుల్లో దర్యాప్తు అధికారులు అనేక కుట్ర కోణాలకు సంబంధించి రుజువులతో ప్రశ్నించారు. మొదటి రెండ్రోజులు ఇద్దరూ నోరు మెదపకుండా.. అధికారులకు సహకరించలేదని తెలిసింది. తర్వాతి రోజు నుంచి గట్టిగా దర్యాప్తు చేయడంతో అనేక కీలక విషయాలను వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

» భారత్‌పై పవిత్ర యుద్ధమే లక్ష్యంగా సిరాజ్.. సిగ్నల్ యాప్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అమాయక ముస్లిం యువకులకు రెచ్చగొట్టి తన దారిలోకి తెచ్చుకునేలా పోస్టులు పెట్టేవాడు. వారితో యాప్‌ల్లో సంభాషించేవాడు. సిరాజ్ అహిం సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థలో 100 మంది వరకు సభ్యులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

» ఇన్‌స్టాలో సిరాజ్ క్రియేట్ చేసిన గ్రూపులో వందలాది మందిని తనవైపు తిప్పుకున్నట్లు తెలిసింది. ఒన్ ఉమ్మాహ్-ఒన్ బాడీ- ఒన్ యూనిటీ అనే గ్రూపులో దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవాడు. భారత్‌ను విచ్ఛిన్నం చేసేందుకు అవసరమైతే మానవ బాంబుగా మారి ప్రాణత్యాగానికైనా సిద్ధం అన్నట్లు రెచ్చగొట్టేవాడని గుర్తించారు.

» సిరాజ్ పోస్టులు అరబ్ దేశాల్లోని కొంత మందికి నచ్చడంతో పలువురు ఆర్థిక సాయం కూడా చేసినట్లు తెలిసింది.

» మొదటి పేలుడు విజయనగరంలోనే చేయాలని, అప్పుడే అహిం సంస్థకు గుర్తింపు వస్తుందని సభ్యులతో సిరాజ్ చెప్పినట్టు సమాచారం.

» సిరాజ్ రెండుసార్లు సౌదీ, అరబ్ దేశాలు, పలుమార్లు ఢిల్లీ వెళ్లినట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. సుమారు 20 మంది స్లీపర్ సెల్స్‌ను తయారు చేసినట్లు సమాచారం.

» విజయనగరంలో సిరాజ్‌తో పరిచయమున్న కొందరు ఇప్పుడు పత్తాలేకుండా పోయారని తెలిసింది. వారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారనే వివరాల్ని స్థానిక పోలీసులు సేకరిస్తున్నట్లు తెలిసింది.

» ఒమన్‌లో నివసిస్తున్న ఇమ్రాన్ అక్రమ్, యూపీకి చెందిన బాదర్, విశాఖలోని విశ్రాంత రెవెన్యూ అధికారి, వరంగల్‌కు చెందిన ఫర్హాన్ మొహిద్దీన్, అద్నన్ ఖురేషీ దిశాన్, మోషిన్ షేక్, జస్సీర్ అలియాస్ అమన్, పహాద్, అమీర్ అన్సారీ తదితర వ్యక్తులతో సిరాజ్‌కు సంబంధాలు న్నాయి. వారితో ఆర్థిక లావాదేవీలు, కుట్రలకు సంబంధించి కీలక సమాచారాన్ని దర్యాప్తు అధికారులు రాబట్టినట్లు సమాచారం.

మా భూముల్లో అధికారుల జోక్యాన్ని అడ్డుకోండి

» హైకోర్టులో సజ్జల సోదరుల కుటుంబ సభ్యులు పిటిషన్

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా, సీకే దిన్నె మండలం పరిధిలో ని పలు సర్వే నంబర్లలో రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లు, వారసత్వంగా సంక్రమించిన 63.72 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుంటూ ఈ నెల 21న జిల్లా కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి సోదరు ల కుటుంబ సభ్యులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీకే దిన్నె పరిధిలో పలు సర్వే నంబర్లలో తమకున్న 201.17 ఎకరాల విషయంలో అధికారులు జోక్యం చేసుకోకుండా నిలువరించాలని కోరారు. దశాబ్దాలుగా తమ స్వాధీనంలో ఉన్న వాటిని అటవీ భూములుగా చూపిస్తూ అధికారులు జోక్యం చేసుకుంటున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

కార్మిక రాజ్య భీమా సంస్థ
(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
कर्मचारी राज्य बीमा निगम
(श्रम एवं रोजगार मंत्रालय, भारत सरकार)
Employees' State Insurance Corporation
(Ministry of Labour & Employment, Govt. of India)

ప్రాంతీయ కార్యాలయం/क्षेत्रीय कार्यालय /Regional Office
ఈ ఎస్ ఐ రోడ్డు, గుణదల, విజయవాడ – 520 004
ईएसआई रोड, गुणदला, विजयवाड़ा–520 004
ESI Road, Gunadala, Vijayawada-520 004
Telephone: 0866-2453498
e-mail : rd-andhrapradesh@esic.nic.in

No.62-D/11/11/Dispensary/2018-Genl. Dated 29.05.2025

कार्यालय परिसर के लिए रुचि की अभिव्यक्ति
Expression of Interest (EOI) for Office Space

क्षेत्रीय कार्यालय, ईएसआई कॉर्पोरेशन, विजयवाड़ा सरकार से रुचि की अभिव्यक्ति (ईओआई) आमंत्रित करता है। संगठनों/सार्वजनिक उपक्रमों को समायोजित करने के लिए कार्यालय स्थान प्रदान करना **26 आंध्र प्रदेश राज्य में विभिन्न स्थानों पर ईएसआईएस औषधालय और 6 ईएसआईसी शाखा कार्यालय** किराया/पट्टे के आधार पर।

The Regional Office, ESI Corporation, Vijayawada invites Expression of Interest (EOI) from Govt. Organizations/PSUs to provide office space to accommodate **26 ESIS Dispensaries and 6 ESIC Branch Offices at various locations in the State of Andhra Pradesh** on rental/lease basis.

संपूर्ण EOI दस्तावेज़ यहां पाया जा सकता है: **https://roap.esic.gov.in/tenders/ rosro_tender_list** (कंसोल नंबर: 13512/2025)

Complete EOI document may be found at: **https://roap.esic.gov.in/tenders/ rosro_tender_list (Console no: 13512/2025)**

ईओआई जमा करने की अंतिम तिथि है **17.06.2025, शाम 5:00 बजे**

Last date for submission of EOI is **17.06.2025, 5:00 PM**

प्रस्तुत करने का तरीका:

– ऑफलाइन–रीजनल ऑफिस, ईएसआईसी, गुनाडला, विजयवाड़ा

आरडी ऑनलाइन: मेल के माध्यम से **rd-andhrapradesh@esic.gov.in**

Mode of Submission:

Offline: 48-7-32A, Regional Office, ESIC, Gunadala, Vijayawada

Online: Via mail to **rd-andhrapradesh@esic.gov.in**

हस्ताक्षर/Sd/-
क्षेत्रीय निदेशक (प्रभारी)/**REGIONAL DIRECTOR (I/c)**

NATA 2025

ఆర్కిటెక్చర్‌ను ఎంచుకోండి

దేశ నిర్మాణంలో భాగమవ్వండి

www.nata.in

NATA హెల్ప్‌డెస్క్
stusupport@nata-app.online
+91 7385395400

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్
విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం

NATA 2025 నిర్వహణ

NATA 2025 కోసం రిజిస్ట్రేషన్ **www.nata.in**లో 03.02.2025 నుండి ప్రారంభమయ్యింది మరియు **24.06.2025**న ముగుస్తుంది. 5-సంవత్సరాల B.Arch. డిగ్రీ ప్రోగ్రామ్ మొదటి సంవత్సరంలో ప్రవేశం తీసుకోవడానికి అభిలషిస్తున్న అభ్యర్థులు NATA 2025 కొరకు తమకుతాము తక్షణమే నమోదు చేసుకోవాలని సూచించడమైనది.

దరఖాస్తు ఎవరు చేసుకోవచ్చును?

తప్పనిసరిగా ఫిజిక్స్ మరియు మ్యాథ్స్ సబ్జెక్టులతో 11/12 విద్యార్థులు లేదా కనీసం 45% సరాసరి మార్కుల స్కోర్‌తో మ్యాథమెటిక్స్‌తో డిప్లొమా (10+3) ఉత్తీర్ణులైన లేదా హాజరవుతున్న విద్యార్థులు

అర్హతా ప్రమాణాల వివరాలు కలిగిన NATA 2025 బ్రోచర్, సిలబస్ మరియు NATA స్కోర్ ఆధారంగా B.Arch. ప్రోగ్రామ్‌లో విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్న ఇన్‌స్టిట్యూషన్స్ జాబితాతో పాటు ఇతర ముఖ్యమైన వివరాలు **www.nata.in** మరియు **www.coa.gov.in**లో లభిస్తాయి.

NATA 2025 స్కోర్ హాజరైన సంవత్సరం నుండి రెండు సంవత్సరాల కోసం చెల్లుబాటు అవుతుంది. ఒక విద్యా సంవత్సరానికి గరిష్టంగా హాజరయ్యే సంఖ్య: **03 నం.లు.**

న్యూఢిల్లీ
తేది: 29.05.2025 రిజిస్ట్రార్

www.facebook.com/coa.gov.in/ @council_of_architecture_india @coasocial9256 @CouncilofArchi1 coa.gov.in



ఎన్ఎస్ఈతో వి హబ్ ఎంఓయూ

హైదరాబాద్: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో (ఎన్ఎస్ఈ) తెలంగాణకు చెందిన వి హబ్ ఫౌండేషన్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. బుధవారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క సమక్షంలో ఇరువర్గాల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్ఎస్ఈ, వి హబ్ ఫౌండేషన్ కలిసి రాష్ట్రంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నాయి. ఇన్వెస్టర్ల అవగాహన కార్యక్రమాల(ఐఏపీ) ద్వారా ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం, ఐపీఓ ద్వారా నిధుల సమీకరణ, ఎన్ఎస్ఈలోని ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ 'ఎమర్జ్'లో షేర్లను నమోదుపై మహిళా ఆంత్రప్రెన్యూర్ల నిర్వహణలోని ఎంఎస్ఎంఈల్లో అవగాహన పెంచడం, విద్యార్థులకు బీఎఫ్ఎస్ఐ రంగంలో సమగ్ర శిక్షణ వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నాయి.

ఇండిగో ఛైర్మన్‌గా విక్రమ్ సింగ్ మెహతా

న్యూఢిల్లీ: ఇండిగో నూతన ఛైర్మన్‌గా విక్రమ్ సింగ్ మెహతాను నియమించినట్లు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రకటించింది. డాక్టర్ వెంకటరమణి సుమంత్రన్ పదవీ కాలం పూర్తయిన నేపథ్యంలో ఆయన స్థానంలో మెహతా బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఐఫోన్ల ఎగుమతుల్లో చైనాను దాటిన భారత్

● గతనెల 76 శాతం వృద్ధి
● దాదాపు 30 లక్షల యూనిట్ల సరఫరా

న్యూఢిల్లీ: భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ల ఎగుమతులు చైనాను మించిపోయాయి. మార్కెట్ పరిశోధక సంస్థ ఓండియా (గతంలో క్యానలిస్) డేటా ప్రకారం.. గత నెలలో అమెరికాకు మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్ల సరఫరా వార్షిక ప్రాతిపదికన 76 శాతం వృద్ధితో దాదాపు 30 లక్షల యూనిట్లకు పెరిగింది. అదే సమయంలో చైనా నుంచి అమెరికాకు ఐఫోన్ల ఎగుమతులు మాత్రం 76 శాతం తగ్గి 9 లక్షల యూనిట్లకు పడిపోయాయి. అమెరికాకు ఐఫోన్ల ఎగుమతుల విషయంలో భారత్ తొలిసారిగా చైనాను అధిగమించింది.

4 నెలల్లో 1.15 కోట్ల ఐఫోన్ల ఎగుమతులు

ఈ ఏడాదిలో గడిచిన నాలుగు నెలల్లో (జనవరి-ఏప్రిల్) భారత్ నుంచి అమెరికాకు 1.15 కోట్ల ఐఫోన్లు ఎగుమతయ్యాయి. అదే సమయంలో చైనా నుంచి 1.32 కోట్ల ఐఫోన్ల సరఫరా జరిగింది. నాలుగు నెలల కాలానికి చూస్తే, ఇప్పటికీ చైనానే అగ్రగామిగా ఉన్నప్పటికీ నెల వారీ గణాంకాలను పరిశీలిస్తే భారత్ నుంచి సరఫరా భారీగా పెరుగుతూ వస్తోంది.

భారత్‌పై యాపిల్ ఫోకస్

ఐఫోన్ల తయారీ కోసం యాపిల్ కేవలం చైనా పైనే ఆధారపడకుండా భారత్‌ను ప్రత్యామ్నాయ వేదికగా ఎంచుకుంది. కరోనా సంక్షోభ కాలం నుంచే భారత



మార్కెట్ నుంచి తన ఉత్పత్తుల సరఫరా కోసం భారీగా పెట్టుబడులు పెడుతూ వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు భారత్‌లోని తన థర్డ్ పార్టీ వెండార్ల నుంచి ఈ ఏడాది ఐఫోన్ల సేకరణను భారీగా పెంచింది.

బుచ్‌కు లోక్‌పాల్ క్లీన్‌చిట్



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మాజీ ఛైర్‌పర్సన్ మాధవి పురి బుచ్‌కు అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ లోక్‌పాల్ క్లీన్‌చిట్ ఇచ్చింది. అమెరికా షార్ట్ షెల్లింగ్, మార్కెట్ రీసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్ ఆరోపణల ఆధారంగా అనుచితం, పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించి బుచ్‌పై దాఖలైన ఫిర్యాదులను లోక్‌పాల్ బుధవారం తోసిపుచ్చింది. ఆ అభియోగాలన్నీ కేవలం అనుమానాలు, ఊహలే తప్ప వాటిని ధ్రువీకరించే ఆధారాలేమీ లేవంది. అదానీ గ్రూప్ నిధుల అక్రమ మళ్లింపునకు ఉపయోగించిన విదేశీ ఫండ్లలో మాధవి పురి బుచ్‌తోపాటు ఆమె భర్త ధవల్ బుచ్‌కు రహస్య వాటాలున్నాయని హిండెన్‌బర్గ్ గత ఆగస్టులో ఆరోపించింది. అంతేకాదు, సెబీ పదవీ చేపట్టాక కూడా మాధవి పురి బుచ్ తన మాజీ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి పారితోషికం అందుకున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. అయితే, బుచ్ ఆ ఆరోపణలన్నింటినీ ఖండించారు.

8 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ: దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి 8 నెలల కనిష్ఠానికి పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. గత నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 2.7 శాతానికి జారుకుంది. మాన్యుఫాక్చరింగ్, మైనింగ్, విద్యుత్ రంగాల పేలవ పనితీరు ఇందుకు కారణం. గత ఏడాది ఏప్రిల్‌లో ఐఐపీ 5.2 శాతంగా నమోదైంది. కాగా ఈ మార్చి నెల ఐఐపీని గతంలో ప్రకటించిన 3 శాతం నుంచి 3.9 శాతానికి పెంచింది. గత నెలలో తయారీ రంగ ఉత్పత్తి వృద్ధి 3.4 శాతానికి తగ్గగా.. మైనింగ్ ప్రొడక్షన్ 0.2% క్షీణించింది.

నాట్కో ఫార్మా లాభం రూ.406 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నాట్కో ఫార్మా మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి రూ.406 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదు చేసిన రూ.386.3 కోట్లతో పోలిస్తే ఇది ఐదు శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 16 శాతం పెరిగి రూ.1,287.3 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే క్యూ4లో కంపెనీ స్థూల లాభం 10.2 శాతం వృద్ధితో రూ.548 కోట్లుగా నమోదైంది. అయితే ఇదే సమయంలో నిర్వహణ లాభాలు మాత్రం 46.55 శాతం నుంచి 44.89 శాతానికి పడిపోయాయి.

ఆర్థిక సంవత్సరం మొత్తానికి : 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.4,784 కోట్ల ఆదాయంపై రూ.1,883.4 కోట్ల నికర లాభం నమోదు చేసింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25లో ఆదాయం 16 శాతం పెరిగితే, నికర లాభం ఏకంగా 36 శాతం పెరిగింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) అంత ఆశాజనకంగా ఉండక పోవచ్చని కంపెనీ హెచ్చరించింది. కంపెనీ ఆదాయం 20 శాతం, నికర లాభం 30 శాతం వరకు క్షీణించే ప్రమాదం ఉందని తెలిపింది. అమెరికా మార్కెట్‌లో ఎదురవుతున్న ధరల ఒత్తిడి, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ఆర్ అండ్ డీ ఖర్చులు పెరిగి పోవడం ఇందుకు కారణమని పేర్కొంది. దీంతో బీఎస్ఈలో కంపెనీ షేర్లు బుధవారం 1.78 శాతం నష్టంతో రూ.862.45 వద్ద ముగిశాయి.

గ్రాన్యూల్స్ లాభం 17% వృద్ధి

గ్రాన్యూల్స్ ఇండియా నాలుగో త్రైమాసికానికి రూ.152 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.130 కోట్లతో పోలిస్తే ఇది 17 శాతం ఎక్కువ. ఫార్ములేషన్స్ అమ్మకాలు 18 శాతం పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదం చేసిందని కంపెనీ సీఎండీ చిగురుపాటి కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.1,176 కోట్ల నుంచి రూ.1,197 కోట్లకు పెరిగింది. దీంతో ఒక్కో షేరుపై రూ.1.5 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై ఇది 150 శాతానికి సమానం.

బీఏఎస్ఎఫ్ నుంచి రెండు కొత్త ఉత్పత్తులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జర్మనీ కేంద్రంగా పనిచేసే బీఏఎస్ఎఫ్ అగ్రికల్చరల్ సొల్యూషన్స్ కంపెనీ భారత మార్కెట్‌లో వాలెక్సియో, మిబెల్యా పేరుతో రెండు సరికొత్త ఉత్పత్తులను ఆవిష్కరించింది. ఇందులో వాలెక్సియో క్రిమినాశిని వరి పంటను సుడి దోమ తెగులు నుంచి, మిబెల్యా శిలీంధ్ర నాశిని పాము పొడ తెగులు నుంచి రక్షిస్తాయని బీఏఎస్ఎఫ్ ఇండియా కంపెనీ అగ్రికల్చరల్ సొల్యూషన్స్ విభాగం బిజినెస్ డైరెక్టర్ ఆర్ గిరిధర్ చెప్పారు. వరి దుబ్బు కట్టే దశలో, పొట్ట పోసుకునే దశలో వీటిని పిచికారీ చేయాల్సి ఉంటుంది. వీటి పిచికారీ ద్వారా దిగుబడులను బాగా దెబ్బతీసే సుడి దోమ తెగులు, పాము పొడ తెగుళ్ల నుంచి వరి పంటను పూర్తిగా కాపాడుకోవచ్చన్నారు. ఈ రెండు ఉత్పత్తుల అభివృద్ధిలో భారత్‌లోని బీఏఎస్ఎఫ్ ఇండియా పరిశోధనా సంస్థలు కీలక పాత్ర పోషించాయి. ఈ రెండు మందులు వచ్చే నెల నుంచి అందుబాటులోకి వస్తాయని గిరిధర్ చెప్పారు. అగ్రికల్చరల్ సొల్యూషన్స్‌ను 2027 జనవరి నాటికి ప్రత్యేక కంపెనీగా విభజించి, ఐపీఓకు వెళ్లే యోచన ఉందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైక్ హీంజ్ తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	525
వరంగల్	522	గోదావరి	510
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	117
కరీంనగర్	115	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	105
కర్నూలు	115	నెల్లూరు	110
విశాఖపట్నం	111	అనంతపురం	110
గోదావరి	114		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,480 ▼	89,350 ▼	1,11,000 ▲
విజయవాడ	99,100 ▲	93,500 ▲	1,00,000 ▲
విశాఖపట్నం	98,730 ▲	89,350 ▼	1,11,000 ▲
రాజమండ్రి	97,470 ▼	89,350 ▼	1,00,800 ▲
ప్రొద్దుటూరు	95,700 ▼	88,040 ▼	99,000 ▲
ముంబై	95,700 ▲	87,660 ▲	97,450 ▲

రామ్‌రాజ్ ఆచార్య పంచకచం ధోవతులు

ప్రచారకర్తగా దుష్యంత్ శ్రీధర్



చెన్నై (ఆంధ్రజ్యోతి): రామ్‌రాజ్ సంస్థ ఆధ్యాత్మిక ఆచారాలు, మతపరమైన వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ధరించడానికి అనువుగా 'ఆచార్య పంచకచం ధోవతుల'ను మార్కెట్లోకి తెచ్చింది. ప్రముఖ పండితుడు దుష్యంత్ శ్రీధర్‌ను దీనికి ప్రచారకర్తగా నియమించింది. తమ సంస్థ ఆచార్యులు, గురువుల కోసం పంచకచం పంచెలను ప్రత్యేకంగా తయారుచేసిందంటూ ఇవి కేవలం సాంప్రదాయక దుస్తులు కాదని, పవిత్రమైన పండుగ సందర్భాల్లో ధరించే భారతీయ ప్రాచీన వారసత్వానికి చిహ్నమని సంస్థ వ్యవస్థాపకులు కేఆర్ నాగరాజన్ చెప్పారు. భారతీయ సంస్కృతికి ఎంతో గౌరవనీయులైన ఆదిశంకరులు, రామానుజులు, వేదాంత దేశికులు, మధ్వాచార్యులు, కంచిపరమాచార్యుల పరంపను గౌరవిస్తూ రామ్‌రాజ్ కంపెనీ ఈ ధోవతులను పరిచయం చేయడం సముచితంగా ఉందని దుష్యంత్ శ్రీధర్ ఈ సందర్భంగా అన్నారు.

ఐటీసీలో వాటా తగ్గించుకున్న బీఏటీ

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ, సిగరెట్ల తయారీ సహా భిన్న వ్యాపారాల్లోకి విస్తరించిన దేశీయ కంపెనీ ఐటీసీలో బ్రిటన్‌కు చెందిన బహుళజాతి సంస్థ బ్రిటిష్ అమెరికన్ టొబాకో (బీఏటీ) వాటా తగ్గించుకుంది. ఐటీసీలో 2.5 శాతం వాటాకు సమానమైన 31.3 కోట్ల షేర్లను ఒక్కోటి రూ.413 చొప్పున మొత్తం రూ.12,927 కోట్లకు విక్రయించింది. బహిరంగ మార్కెట్లో బ్లాక్ డీల్స్ ద్వారా బుధవారం ఈ వాటా షేర్ల ఉపసంహరణ జరిగింది. ఈ లావాదేవీ అనంతరం ఐటీసీలో బీఏటీ మొత్తం వాటా 25.44 శాతం నుంచి 22.94 శాతానికి తగ్గింది.

సెన్సెక్స్ 239 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టపోయింది. ఐటీసీ షేర్లు 3 శాతానికి పైగా క్షీణించడం ఇందుకు ప్రధాన కారణం. బుధవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 239.31 పాయింట్లు కోల్పోయి 81,312.32 వద్దకు జారింది. నిఫ్టీ 73.75 పాయింట్ల నష్టంతో 24,752.45 వద్ద స్థిరపడింది. ఎఫ్ అండ్ ఓ నెలవారీ కాంట్రాక్టులు గురువారంతో ముగియనుండటంతోపాటు జీడీపీ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు విడుదల కానున్న నేపథ్యంలో మదుపరులు వేచిచూసే ధోరణిని ప్రదర్శించారని, దాంతో మార్కెట్ సూచీలు పరిమిత శ్రేణిలోనే కదలాడాయని ఈక్విటీ విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రధాన సూచీలు నేలచూపులు చూసినప్పటికీ బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.50 శాతం వరకు పెరిగాయి.

హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓకు సెబీ ఆమోదం: దేశీయ ద్విచక్ర వాహన తయారీ దిగ్గజం హీరో మోటోకార్ప్ ఆర్థిక సేవల అనుబంధ విభాగమైన హీరో ఫిన్‌కార్ప్ రూ.3,668 కోట్ల ఐపీఓకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.2,100 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత వాటాదారులకు చెందిన రూ.1,568 కోట్ల ఈక్విటీ షేర్లను సైతం విక్రయించనుంది.

● లీలా ప్యాలెస్ హోటల్స్ అండ్ రిసార్ట్‌ల నిర్వహణ సంస్థ స్లోస్ బెంగళూరుతోపాటు ఏజిస్ వోపక్ టెర్మినల్స్ ఐపీఓలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు నాటికి స్లోస్ బెంగళూరుకు ఇష్యూ సైజు కంటే 4.5 రెట్ల బిడ్లు రాగా.. ఏజిస్ వోపక్ ఇష్యూకు 2 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

తొలి అడుగు ఎవరిదో?

నేటి క్వాలిఫయర్-1లో పంజాబ్‌తో బెంగళూరు ఢీ

ఐపీఎల్ టైటిల్ వేటలోనున్న పంజాబ్, బెంగళూరు ఫైనల్లో చోటు కోసం అమీతుమీకి సిద్ధమయ్యాయి. శ్రేయాస్ సారథ్యంలోని కింగ్స్ జట్టు లీగ్ దశలో 'టాప్'లేపి సూపర్ జోష్‌తో కనిపిస్తుండగా.. కోహ్లీలాంటి స్టార్లతో కూడిన బెంగళూరు ఆఖరి మ్యాచ్‌లో అద్భుత విజయం అందుకొని పూర్తి ఆత్మ విశ్వాసంతో ఉంది. మరి.. ఈ సమవుజ్జీల సమరంలో పైచేయి సాధించి ఫైనల్లో తొలి అడుగు వేసేదెవరో నేడు తేలనుంది.

రా.7.30 నుంచి



ముల్లన్‌పూర్: ఐపీఎల్ తుది అంకానికి సమయం ఆసన్నమైంది. దశాబ్దం తర్వాత ప్లేఆఫ్స్‌కు చేరిన జోష్‌లో ఉన్న పంజాబ్ కింగ్స్‌కు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) రూపంలో అసలుసిసలు సవాల్ ఎదురుకానుంది. ఈ మెగా లీగ్‌లో సమవుజ్జీలుగా కనిపిస్తున్న పంజాబ్, బెంగళూరు జట్లు గురువారం జరిగే క్వాలిఫయర్-1లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇందులో నెగ్గిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకోనుండగా.. ఓడిన జట్టుకు క్వాలిఫయర్-2 రూపంలో మరో అవకాశం ఉంటుంది. లీగ్ దశలో ఆడిన 14 మ్యాచ్‌ల్లో చెరో 9 విజయాలతో పంజాబ్, బెంగళూరు 19 పాయింట్లతో సమంగా నిలిచాయి. అయితే, మెరుగైన రన్‌రేట్‌తో పంజాబ్ టాప్‌లో నిలిచింది. 2014లో చివరిసారి నాకౌట్ చేరిన పంజాబ్.. ఈసారి అందరి అంచనాలను తారుమారు చేస్తూ అనూహ్యంగా టాప్‌లో నిలిచింది. జట్టును ఈస్థాయిలో నిలపడంలో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, కోచ్ రికీ పాంటింగ్ కృషి ఎంతో ఉంది. ఇక, ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ అదిరే ఆరంభాన్నిస్తుంటే.. ఇంగ్లిస్, అయ్యర్, నేహల్ వధేరా మిడిలార్డర్‌లో వెన్నెముకగా నిలుస్తున్నారు. శశాంక్ సింగ్, స్టొయినిస్ ఫినిషర్లుగా అదరగొడుతున్నారు. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, హర్‌ప్రీత్ బ్రార్ అండగా నిలుస్తున్నారు. దక్షిణాఫ్రికా పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ మార్కో జాన్సెన్ స్వదేశానికి తిరిగివెళ్లడంతో అతడి స్థానంలో ఒమర్జాయ్‌కు తుదిజట్టులో చోటు దక్కొచ్చు. గాయం నుంచి కోలుకున్న లెగ్ స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ ఈ మ్యాచ్‌లో ఆడే చాన్సుంది.

దూకుడుగా ఆర్సీబీ: సుదీర్ఘ కాలం తర్వాత ఆర్సీబీ టాప్-2లో నిలిచింది. లీగ్ దశలో అదిరే ప్రదర్శన చేసిన బెంగళూరు.. ఆఖరి మ్యాచ్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించిన జోష్‌లో ఉంది. ఓపెనర్లు సాల్ట్, కోహ్లీ దూకుడైనా ఆరంభాన్నిస్తుండగా.. మిడిలార్డర్‌లో తాత్కాలిక కెప్టెన్ జితేశ్ శర్మ ప్రదర్శన కీలకంగా మారింది. గాయపడిన టిమ్ డేవిడ్ సెలెక్షన్‌కు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ఇక, హాజెల్‌వుడ్ ఫుల్ ఫిట్‌నెస్ సాధించడంతో బౌలింగ్ బలం పెరిగింది. పేసర్ భువనేశ్వర్ కుమార్‌తోపాటు స్పిన్నర్లు క్రునాల్ పాండ్యా, సుయాష్ శర్మ జట్టుకు ఉపయోగపడుతున్నారు. ఇదే పిచ్‌పై జరిగిన ఓ మ్యాచ్‌లో పంజాబ్‌పై గెలుపొందడం బెంగళూరుకు సానుకూలాంశం. మరోవైపు, సొంతగడ్డపై విజయంతో నేరుగా ఫైనల్ బెర్త్ పట్టేయాలని అయ్యర్ సేన పట్టుదలతో ఉంది.

జట్లు (అంచనా)

పంజాబ్: ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్, జోష్ ఇంగ్లిస్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహల్ వధేరా, శశాంక్ సింగ్, స్టొయినిస్, ఒమర్జాయ్, హర్‌ప్రీత్ బ్రార్, కైల్ జేమిసన్, అర్ష్‌దీప్ సింగ్, చాహల్ (ఇంపాక్ట్ సబ్)

బెంగళూరు: కోహ్లీ, సాల్ట్, మయాంక్ అగర్వాల్, రజత్ పటీదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ (వికెట్ కీపర్), క్రునాల్ పాండ్యా, లివింగ్‌స్టోన్, రొమారియో షెఫర్డ్, భువనేశ్వర్, యష్ దయాళ్, హాజెల్‌వుడ్, సుయాష్ శర్మ (ఇంపాక్ట్ సబ్).

పిచ్/వాతావరణం..

ముల్లాన్‌పూర్‌లో ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు జరగగా.. తొలి రెండు మ్యాచ్‌ల్లో 200పైగా స్కోర్లు నమోదయ్యాయి. ఆ తర్వాతి మ్యాచ్‌లో 111 పరుగులను పంజాబ్ కాపాడుకొంది. మరో మ్యాచ్‌లో పంజాబ్ నిర్దేశించిన 157 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు ఛేదించింది. మరి నేటి కీలక మ్యాచ్‌కు ఎలాంటి వికెట్‌ను ఎంపిక చేస్తారో చూడాలి. వాతావరణం సాధారణంగా పొడిగా ఉండనుంది. వర్షచాయలు లేవు.

ఒకవేళ మ్యాచ్ రద్దయితే..?

షెడ్యూల్ ప్రకారం క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు రిజర్వ్ డే లేదు. దీంతో ఏదైనా కారణంతో ఈ మ్యాచ్ రద్దయితే, పంజాబ్ నేరుగా ఫైనల్ చేరుతుంది. పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉంది కాబట్టి శ్రేయాస్ సేనకు తుదిబెర్త్ దక్కుతుంది. అయితే, వర్ష సూచన లేదు కాబట్టి, మ్యాచ్ పూర్తిగా జరిగే అవకాశముంది.

మిక్స్‌డ్ రిలేలో పసిడి



రెండోరోజు భారత్‌కు ఆరు పతకాలు
ఆసియా అథ్లెటిక్స్


స్పోర్ట్స్

గుమి (దక్షిణ కొరియా): ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు వరుసగా రెండోరోజూ సత్తా చాటారు. బుధవారం జరిగిన పోటీల్లో ఓ స్వర్ణం సహా ఆరు పతకాలు కొల్లగొట్టారు. 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలే టీమ్ ఈవెంట్‌లో రూపల్ చౌదరి, సంతోష్ కుమార్, విశాల్, సుభా వెంకటేశన్‌లతో కూడిన భారత జట్టు ఫైనల్లో విజేతగా నిలిచి టైటిల్ నిలబెట్టుకుంది. భారత బృందం 3:18.12 సెకన్లలో రేసు ముగించి పసిడి పతకం దక్కించుకుంది. కాగా.. చైనా (3:20.52 సె), శ్రీలంక (3:21.95 సె) జట్లు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి రజతం, కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నాయి. ఇక, స్వర్ణం నెగ్గిన భారత మిక్స్‌డ్ టీమ్‌లో సభ్యురాలైన రూపల్ చౌదరి వ్యక్తిగత 400 మీటర్ల రేసులో రజతం అందుకుంది. డెకాథ్లాన్‌లో భారత అథ్లెట్ తేజస్విన్ శంకర్ 7618 పాయింట్లు స్కోరు చేసి రజతం నెగ్గాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో ప్రవీణ్ చిత్రవేల్, మహిళల 1500 మీటర్ల రేసులో పూజ రజత పతకాలు సాధించారు. పురుషుల 1500 మీటర్ల రేసులో యూనస్ షా కాంస్యం దక్కించుకున్నాడు. రెండోరోజు పోటీలు ముగిసేసరికి భారత్ మొత్తం 8 పతకాలతో ఉంది. మంగళవారం గుల్వీర్ సింగ్ (10వేల మీటర్లు) స్వర్ణం, సెబాస్టియన్ (20 కి.మీ రేస్‌వాక్) కాంస్యం నెగ్గిన సంగతి తెలిసిందే. ఇక తెలుగమ్మాయి జ్యోతి యర్రాజి 110 మీటర్ల హర్డిల్స్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లింది. తన హీట్స్‌లో జ్యోతి మూడోస్థానంలో నిలిచి ఫైనల్ రేసుకు అర్హత సాధించింది. మరో తెలుగు అథ్లెట్ రజిత కుంజ జట్టు సభ్యులతో కలిసి మహిళల 4x400 మీటర్ల రిలే ఈవెంట్‌లో ఫైనల్ చేరింది.

డబుల్స్‌లో ముందంజ

● సాత్విక్, గాయత్రి, రుత్విక జోడీలు శుభారంభం

సింగపూర్ ఓపెన్



సింగపూర్: భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేసింది. పురుషుల డబుల్స్ ఆరంభ రౌండ్లో సాత్విక్ జంట 21-16, 21-13తో మలేసియా జోడీ చూంగ్ హన్/మహ్మద్ హైకల్‌ను ఓడించింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా జాలీ ద్వయం 21-14, 19-21, 21-17తో తైపీ జంట చాంగ్ చింగ్/యాంగ్ చింగ్‌పై నెగ్గి రెండోరౌండ్ చేరగా, మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్వికా శివాని/రోహన్ ద్వయం 21-16, 21-19తో అమెరికా జంట చెన్/కార్బెట్‌ను చిత్తుచేసి రెండోరౌండ్లో ప్రవేశించింది. కాగా, పురుషుల సింగిల్స్‌లో భారత నెంబర్‌వన్ షట్లర్ లక్ష్య సేన్ వెన్నునొప్పి కారణంగా ఆరంభ రౌండ్ మ్యాచ్ మధ్యలోనే వెనుదిరిగాడు. తైపీ షట్లర్ లిన్ చున్ యితో పోరులో లక్ష్య 21-15, 17-21, 5-13తో ఉన్నప్పుడు మ్యాచ్ నుంచి వైదొలిగాడు. ఇక, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్, అనుపమ, ఉన్నతి ప్రత్యర్థుల చేతిలో ఓడి ఆదిలోనే ఇంటిబాట పట్టారు.

గుకేష్‌కు అర్జున్ షాక్


నార్వే చెస్

స్టావెంజర్ (నార్వే): నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి సంచలనం సృష్టించాడు. రెండో రౌండ్‌లో వరల్డ్ చాంపియన్ గుకేష్‌కు అర్జున్ షాకిచ్చాడు. తెల్లపావులతో ఆడిన అర్జున్ 62 ఎత్తుల్లో గుకేష్ ఆటకట్టించాడు. కాగా, మొదటి రౌండ్‌లో వరల్డ్ నెం.1 కార్ల్‌సన్ చేతిలో గుకేష్ ఓడాడు. మహిళల టోర్నీ రెండో రౌండ్‌లో అన్నా ముజిచెక్ (ఉక్రెయిన్) చేతిలో కోనేరు హంపి, లి టింగ్జీ (చైనా) చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు. రెండురౌండ్ల అనంతరం నకమురా, అర్జున్ చెరో 4.5 పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో ఉన్నారు.

రూడ్ అవుట్

మూడో రౌండ్‌లో అల్కారజ్, స్వియటెక్, స్విటోలినా

ఫ్రెంచ్ ఓపెన్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో రెండు సార్లు రన్నరప్, 7వ సీడ్ కాస్పెర్ రూడ్ రెండో రౌండ్‌లోనే ఓడాడు. ఇక డిఫెండింగ్ చాంపియన్ అల్కారజ్, 8వ సీడ్ ముసేటి, మహిళల్లో 4వ సీడ్ పౌలిని, 5వ సీడ్ స్వియటెక్, 13వ సీడ్ ఎలెనా స్విటోలినా మూడో రౌండ్‌లో అడుగుపెట్టారు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో పోర్చుగల్‌కు చెందిన అన్‌సీడెడ్ నునో బోర్గెస్ 2-6, 6-4, 6-1, 6-0తో రూడ్‌ను ఇంటిబాట పట్టించాడు. అల్కారజ్ 6-1, 4-6, 6-1, 6-2తో ఫాబియన్‌పై, ముసేటి 6-4, 6-0, 6-4తో గాలన్‌పై గెలిచారు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లలో పౌలిని 6-3, 6-3తో టోమ్‌జనోవిక్‌ని, నిరుటి విజేత స్వియటెక్ 6-1, 6-2తో ఎమ్మా రదుకానుని, 8వ సీడ్ జెంగ్ 6-2, 6-3తో అరాంగోని, స్విటోలినా 7-6 (4), 7-5తో అనా బోండర్‌ని ఓడించారు.

డబుల్స్‌లో బోపన్న, భాంబ్రీ బోణీ

రోహన్ బోపన్న, యుకీ భాంబ్రీ జోడీలు పురుషుల డబుల్స్‌లో శుభారంభం చేశాయి. తొలిరౌండ్‌లో భాంబ్రీ/గాలోవే (అమెరికా) ద్వయం 6-3, 6-7 (10), 6-3తో హాస్/ జెబెన్స్ జంటపై నెగ్గింది. బోపన్న/ఆడమ పల్వెక్ (చెక్ రిపబ్లిక్) జోడీ 7-6(6), 5-7, 6-1తో కాఫ్/ట్రేసీ ద్వయంపై విజయంతో రెండో రౌండ్‌కు చేరింది. రిత్విక్ బొల్లిపల్లి/ నికొలాస్ (కొలంబియా) జంట మొదటి రౌండ్‌లోనే ఓటమిపాలైంది.

పంత్‌కు రూ. 30 లక్షల జరిమానా

లఖ్‌నవూ: బెంగళూరుతో మ్యాచ్‌లో లఖ్‌నవూ స్లో ఓవర్‌రేట్ కోడ్ ఉల్లంఘించినందుకు ఆ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌కు రూ. 30 లక్షల జరిమానా పడింది. మిగిలిన జట్టు సభ్యులకు రూ. 12 లక్షల చొప్పున లేదా మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించారు. ఈ లీగ్‌లో కోడ్‌ను ఉల్లంఘించడం లఖ్‌నవూకిది మూడోసారి. అందుకే, భారీగా జరిమానా విధించినట్టు ఐపీఎల్ నిర్వాహకులు వెల్లడించారు.



ఆలా చేయడం బౌలర్‌ను అవమానించినట్టే!

పంత్ విత్‌డ్రా నిర్ణయాన్ని తప్పుబట్టిన అశ్విన్

న్యూఢిల్లీ: లఖ్‌నవూతో మ్యాచ్‌లో బెంగళూరు ఆటగాడు జితేశ్ శర్మ రనౌట్ అప్పీల్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. భారీ ఛేదనలో జితేశ్ పవర్ హిట్టింగ్‌తో బెంగళూరు లక్ష్యం దిశగా దూసుకెళ్తోంది. అయితే, 17వ ఓవర్‌లో స్పిన్నర్ దిగ్వేష్ రాఠీ.. నాన్‌స్ట్రయికర్ ఎండ్‌లో ఉన్న జితేశ్‌ను రనౌట్ చేశాడు. థర్డ్ అంపైర్ రీప్లేను పరిశీలిస్తుండగానే.. లఖ్‌నవూ కెప్టెన్ రిషభ్ పంత్ అప్పీలును విరమించుకున్నాడు. దీన్ని టీమిండియా మాజీ స్పిన్నర్ అశ్విన్ తప్పుబట్టాడు. 'థర్డ్ అంపైర్ వద్దకు చేరినప్పుడు నిర్ణయం కోసం వేచి చూడాలి. అంతేకానీ, మధ్యలో తన బౌలర్‌దే తప్పన్నట్టుగా పంత్ అప్పీలును వెనక్కితీసుకోవడమంటే, బౌలర్‌ను అవమానించినట్టే'నని అశ్విన్ అన్నాడు.

హాకీలో అమ్మాయిల గెలుపు

రోసారియో (అర్జెంటీనా): నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నీలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య అర్జెంటీనాను భారత్ పెనాల్టీ షూటౌట్‌లో 2-0తో చిత్తు చేసింది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలవడంతో పెనాల్టీ షూట్ అనివార్యమైంది. శుక్రవారం చైనాతో భారత్ తలపడనుంది.

ఫ్రెషర్స్ ఆశలపై ఏఐ నీళ్లు!

» కృత్రిమమేధ దెబ్బకు తగ్గుతున్న కొత్త పట్టభద్రుల నియామకాలు
» వెంచర్ క్యాపిటల్ సంస్థ 'సిగ్నల్‌ఫైర్' తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, మే 28: కృత్రిమ మేధ దెబ్బకు ఉద్యోగాలు భారీగా పోతాయని అంతా ముందు నుంచీ ఊహిస్తున్నదే. కానీ.. ఏ స్థాయిలో? అని ప్రశ్నిస్తే.. అంచనాలే తప్ప వాస్తవ గణాంకాలేవీ అందుబాటులో లేవు. తాజాగా 'సిగ్నల్‌ఫైర్' అనే వెంచర్ క్యాపిటల్ సంస్థ ఆ గణాంకాలను వెల్లడించింది. 2019తో పోలిస్తే.. పెద్ద పెద్ద టెక్ కంపెనీల్లో ఫ్రెషర్స్ నియామకాలు 2024 నాటికి 50 శాతానికిపైగా తగ్గిపోయినట్టు ఆ సంస్థ ఒక నివేదికలో వెల్లడించింది. ఒకప్పుడు దిగ్గజ టెక్ సంస్థల్లో ఏటా జరిపే నియామకాల్లో 15% దాకా అప్పుడే డిగ్రీ/పీజీ పూర్తిచేసిన యువత ఉండేవారని.. ఇప్పుడు వారి వాటా 7 శాతానికి తగ్గిపోయిందని సిగ్నల్‌ఫైర్ వెల్లడించింది. స్టార్టప్‌లలో వీరి వాటా 2019 నాటికి 30 శాతానికిపైగా ఉండేదని.. 2023 నాటికి 11 శాతానికి, 2024 నాటికి 6 శాతానికి తగ్గిపోయినట్టు వివరించింది. ప్రపంచంలోనే టాప్-7 కంపెనీలుగా పేరున్న అల్ఫాబెట్ (గూగుల్ మాతృసంస్థ), అమెజాన్, యాపిల్, మెటా (ఫేస్‌బుక్ మాతృసంస్థ), మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, టెస్లా వంటివి సైతం.. 2022తో పోలిస్తే ఫ్రెషర్స్ నియామకాలను 2024లో సగానికిపైగా తగ్గించినట్టు తెలిపింది. కృత్రిమ మేధ పరిధి, స్థాయి నానాటికీ విస్తరించడం, జూనియర్ స్థాయి ఉద్యోగులు చేయగల పనులన్నింటినీ ఏఐ చాలా సులువుగా చేసేయగలుగుతుండడం.. అదే సమయంలో కంపెనీ బడ్జెట్ నిర్వహణ కష్టమవుతుండడంతో కంపెనీలు కొత్త పట్టభద్రుల నియామకాలను తగ్గించుకోవడంపై దృష్టిసారించాయని సిగ్నల్‌ఫైర్ విశ్లేషించింది. ప్రవేశస్థాయి ఉద్యోగాలే కాదు. మధ్యస్థాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చేయగలిగే పనిని సైతం ఏఐ చేయగలుగుతోందని మెటా సీఈవో మార్క్ జుకెర్‌బెర్గ్ ఇటీవలే వెల్లడించారు. ప్రస్తుతం తాము అభివృద్ధి చేస్తున్న 'లామా' ఏఐ వంటి మేజర్ ప్రాజెక్టుల కోడింగ్‌ను సైతం కృత్రిమ మేధ ఏడాది-రెండేళ్లలో సొంతంగా రాసేయగలదని ఆయన అంచనా వేశారు. ఇక.. తమ కోడింగ్‌లో 30% పనిని ప్రస్తుతం కృత్రిమ మేధే చేస్తోందని గూగుల్ సీఈవో సుందర్‌పిచాయ్ ఈ మధ్యే ప్రకటించిన సంగతి తెలిసిందే. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల సైతం.. తమ కోడింగ్ పనిలో 30% కృత్రిమమేధే చేస్తోందని, తమ కంపెనీకి సంబంధించిన కొన్ని అంతర్గత ప్రాజెక్టులను సైతం ఏఐ ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా పూర్తిస్థాయిలో చేపడుతోందని చెప్పారు. ఐబీఎం కంపెనీ ఏఐని వాడడం మొదలుపెట్టాక 8 వేల మంది ఉద్యోగులను తొలగించింది. ఇలా పెద్ద, చిన్న తేడా లేకుండా అన్ని కంపెనీలూ ఏఐపై ఆధారపడడం నానాటికీ పెరుగుతుండడంతో ఆ ప్రభావం ఉద్యోగాలపై భారీగా పెరుగుతోంది. మరీ ముఖ్యంగా ఫ్రెషర్స్‌పై పడుతోంది. అలాగని టెక్ రంగంలో ఉద్యోగాలు తగ్గిపోతున్నాయా అంటే.. తగ్గట్లేదు సరికదా పెరుగుతున్నాయని, నేరుగా టెక్ కంపెనీల్లో కాకుండా ఆరోగ్యసంరక్షణ, బ్యాంకింగ్, రిటైల్ రంగాల్లో టెకీలకు ఉద్యోగాలు పెరుగుతున్నాయని సిగ్నల్‌ఫైర్ తన నివేదికలో వివరించింది. కాకపోతే ఆ ఉద్యోగాలు సాధించాలంటే కృత్రిమమేధకు సంబంధించిన నైపుణ్యాలు అవసరమని స్పష్టం చేసింది. అమెరికాలో ఈ ట్రెండ్ ఇప్పటికే జోరందుకుంది. 'ఏఐ' నైపుణ్యాలున్నవారినే ఉద్యోగాల్లోకి తీసుకోవడం పెరుగుతోందని.. ప్రతి నాలుగు ఉద్యోగ ప్రకటనల్లో ఒకటి కృత్రిమ మేధ నైపుణ్యాలను తప్పనిసరిగా పేర్కొంటోందని 'వాల్‌స్ట్రీట్ జర్నల్' చేసిన సర్వేలో వెల్లడైంది. కాబట్టి.. కొత్తగా డిగ్రీ/పీజీ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నవారు ఏఐ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని టెక్ పరిశ్రమ నిపుణులు సూచిస్తున్నారు.

లోకం తీరు



విదేశాలకు వెళ్లే 'చదువు' సొమ్ము తగ్గుతోంది!

» యూఎస్, కెనడాలకు బదులు కాస్త ఖర్చు తక్కువగా ఉండే దేశాలపై ఫోకస్
» రిజర్వు బ్యాంకు గణాంకాల్లో వెల్లడి

న్యూఢిల్లీ, మే 28: విదేశాల్లో భారతీయ విద్యార్థుల చదువు కోసం ఇక్కడి నుంచి తరలిపోయే సొమ్ము (ఔట్‌వార్డ్ రెమిటెన్సెస్) ఏటేటా తగ్గుతోంది. రిజర్వుబ్యాంకు గణాంకాల ప్రకారం.. 2022-23లో ఇలా తరలిన రెమిటెన్సులు రూ.44 వేలకోట్లు (5.16 బిలియన్ డాలర్లు) కాగా.. 2024-25లో సుమారు రూ.25 వేల కోట్లు (2.91 బిలియన్ డాలర్లు) మాత్రమే. విదేశాల్లో చదువు పట్ల భారతీయ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల దృక్పథంలో మార్పు రావడమే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. అత్యంత ఎక్కువ ఖర్చయ్యే యూఎస్ఏ, కెనడా, యూకే వంటి దేశాల నుంచి.. తక్కువ వ్యయంతోనే నాణ్యమైన విద్య అందించే జర్మనీ, రష్యా వంటి దేశాలవైపు ఫోకస్ పెరుగుతోంది. అదే సమయంలో మన విద్యార్థులు ఆయా దేశాల్లో తాత్కాలిక ఉద్యోగాలు, ఇతర వ్యాపకాల ద్వారా ఖర్చులు వెళ్లదీసుకుంటుండటం.. అక్కడి వర్సిటీలు, విద్యాసంస్థల నుంచి స్కాలర్‌షిప్‌లు పొందడం.. విద్యాసంస్థల తోడ్పాటుతో ఆ దేశాల్లోనే రుణాలు పొందుతుండటం.. భారత్‌లో నాణ్యమైన విద్య అవకాశాలు పెరుగుతుండటంతో విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గడం వంటివి కూడా మన దేశం నుంచి 'ఔట్‌వార్డ్ రెమిటెన్సులు' తగ్గడానికి కారణం. మరోవైపు పర్యాటకం, విదేశాల్లోని షేర్‌మార్కెట్లలో పెట్టుబడులు, ఆస్తుల కొనుగోలు కోసం తరలివెళ్తున్న రెమిటెన్సులు పెరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. పర్యాటకం/ప్రయాణాల కోసం 2024-25లో విదేశాలకు తరలిన సొమ్ము రూ.1.45 లక్షల కోట్లు కావడం గమనార్హం.

హమాస్ గాజా చీఫ్ హతం: ఇజ్రాయెల్

టెల్ అవీవ్, మే 28: హమాస్ గాజా చీఫ్ మహ్మద్ సిన్వర్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. మే 14న ఇజ్రాయెల్ బలగాలు గాజాలో జరిపిన వైమానిక దాడుల్లో సిన్వర్ మృతి చెందాడని కథనాలు వెలువడ్డాయి. ఖాన్ యూనిస్‌లోని యూరోపియన్ ఆస్పత్రి కింది భాగంలో కమాండ్ సెంటర్‌లో ఉండగా సిన్వర్‌ను డ్రోన్ దాడితో హతమార్చినట్లు ఇజ్రాయెల్ బలగాలు తెలిపాయి. దీనికి సంబంధించి ఓ వీడియోను విడుదల చేశాయి. ఆస్పత్రి కింది భాగంలో సొరంగం ఉన్నట్లు వీడియోలో చూపారు. గతంలో ఇస్మాయిల్ హన్యా, మహ్మద్ డెయిఫ్, యాహ్యా సిన్వర్‌ను హతమార్చినట్లే తాజాగా మహ్మద్ సిన్వర్‌ను మట్టుబెట్టినట్లు నెతన్యాహు పార్లమెంట్‌లో ప్రకటించారు. కాగా, యెమన్‌లోని సనా విమానాశ్రయంపై తమ యుద్ధ విమానాలు దాడి చేశాయని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ బుధవారం వెల్లడించారు. యెమన్‌కు చెందిన హౌతీలు మంగళవారం తమ దేశంపైకి రెండు క్షిపణులను ప్రయోగించడంతో తాము ప్రతిస్పందించామని చెప్పారు. అక్కడ మిగిలి ఉన్న చివరి విమానాన్నీ ధ్వంసం చేశామన్నారు.

మస్క్ రాకెట్ మళ్లీ విఫలం

» వరుసగా మూడోసారి గాల్లోనే పేలిన స్టార్‌షిప్

టెక్సాస్, మే 28: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ సంస్థ ప్రయోగించిన మెగా రాకెట్ స్టార్‌షిప్ మరోసారి విఫలమైంది. తొలుత సవ్యంగానే నింగిలోకి దూసుకెళ్లినా.. నిర్ణీత కక్ష్యలోకి చేరుకున్న తర్వాత శాటిలైట్లు ఉన్న పేలోడ్ తలుపులు తెరుచుకోకపోవడంతో నియంత్రణ కోల్పోయి గాల్లోనే పేలిపోయింది. స్టార్‌షిప్ రాకెట్ ఇలా గాల్లోనే పేలిపోవడం ఇది వరుసగా మూడోసారి.

టీడీపీ జెండాలు, ఫ్లెక్సీల తొలగింపు..

» పోలీసుల అదుపులో పులివెందుల మున్సిపల్ చైర్మన్
» వైస్‌చైర్మన్ సహా మరో 11 మంది కూడా..

పులివెందుల, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ జెండాలు, ఫ్లెక్సీల తొలగింపు వివాదంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్‌చైర్మన్ హఫీజుల్లాతో పాటు మరో పదిమందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టీడీపీ మహానాడు సందర్భంగా మంగళవారం పులివెందులలో పార్నపల్లె కూడలి నుంచి రింగురోడ్డు వెంబడి కడప కూడలి వరకు ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశారు. వైఎస్ విగ్రహాల వద్ద కూడా జెండాలు, తోరణాలు ఏర్పాటు చేశారు. దీంతో వైసీపీ కార్యకర్తలు తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీలను చించేశారు. ఈ ఘటనకు సంబంధించి బుధవారం రాత్రి పోలీసులు మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ సహా 12 మందిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇది తెలుసుకున్న వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి మరికొందరు నాయకులు లాయర్‌తో కలిసి వెళ్లి డీఎస్పీ మురళి నాయక్‌తో చర్చించారు.



మాదాపూర్‌లో నిర్వహించిన 'హార్ట్ ఆఫ్ గోల్డ్'లో అనాథలతో సెల్ఫీలు తీసుకుంటున్న సుందరీమణులు

పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమే!

» అనాథలతో మిస్‌వరల్డ్ క్రిస్టినా పిస్కోవా

హైదరాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): 'చెక్ రిపబ్లిక్‌లోని ఓ గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించా. బాల్యమంతా పంట పొలాల మధ్య గడిపా. మిస్ వరల్డ్ విజేతగా నిలవడం జీవితాశయంగా పెట్టుకున్నా. కష్టపడి దాన్ని సాధించా'అని మిస్ వరల్డ్-24 విజేత క్రిస్టినా పిస్కోవా చెప్పారు. 'హార్ట్ ఆఫ్ గోల్డ్' పేరిట బుధవారం ట్రైడెంట్ హోటల్‌లో అనాథ పిల్లల కోసం నిర్వహించిన నిధుల సేకరణ కార్యక్రమంలో మిస్ వరల్డ్ ప్రతినిధులు పాల్గొన్నారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల ఐసీడీఎస్ బాలసదనల్లోని అనాథ పిల్లలతో మిస్ వరల్డ్ ప్రతినిధులు ముచ్చటించారు. ఈ సందర్భంగా పార్చ్యూన్ హాస్పిటాలిటీ, సుదీక్ష ఎస్టేట్స్ సంస్థలు మిస్ వరల్డ్ సంస్థతో కలిసి బాలసదనల్లోని 200 మంది అనాథ పిల్లలకు ఏడాది పాటు సహాయం చేస్తామని ప్రకటించాయి. రూ.2 కోట్ల నిధులు అందించాయి. మిస్ వరల్డ్ ప్రతినిధులు 200 మంది చిన్నారులకు ఒక్కొక్కరికి రూ.25వేల విలువైన బహుమతులను అందించారు.

అన్నదాతకు మద్దతు!

(మొదటిపేజీ తరువాయి)

సీజన్ నుంచే అమల్లోకి వస్తాయని కేంద్రం ప్రకటించింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఎంఎస్‌పీ పెంపునకు ఆమోదం తెలిపింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో ఖరీఫ్ పంటల సాగు పెరుగుతుందన్న అంచనాల నేపథ్యంలో మద్దతు ధరలపై దృష్టి పెట్టినట్టు కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం.. కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాతో మాట్లాడుతూ.. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరల పెంపుతో పాటు స్వల్పకాలిక వడ్డీ రుణ పథకంపై కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. సాధారణ, ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాకు రూ.69 చొప్పున పెంచినట్టు తెలిపారు. ఇక, క్వింటా ఆవాలుకు రూ.820, రాగులకు రూ.596, నువ్వులకు రూ.579 పెంచినట్టు చెప్పారు. కౌలు, ఎరువులు, విత్తనాలు, పంట కోత, రవాణా, వృథా, ఇంధనం, కూలి ఖర్చులన్నీ లెక్కకట్టి, కనీస మద్దతు ధరలను నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. సగటు ఉత్పత్తి వ్యయాన్ని అంచనా వేసి, రైతులకు లాభదాయకంగా కనీస మద్దతు ధరలు నిర్ణయించామన్నారు.

రుణ సదుపాయం కొనసాగింపు

రైతులకు స్వల్పకాలిక సరసమైన వడ్డీ రుణ పథకాన్ని 2025-26లోనూ కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ)లు ఉన్న రైతులకు సవరించిన స్వల్పకాలిక రుణాలను అందించనున్నారు. ప్రస్తుతం ఉన్న 1.5 శాతం వడ్డీ రుణాలను యథాతథంగా కొనసాగించనున్నట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ పథకాన్ని కొనసాగించడం వల్ల ఖజానాపై రూ.15,640 కోట్ల భారం పడుతుందని చెప్పారు. కేసీసీ ఉన్న రైతులు గరిష్ఠంగా రూ.3 లక్షల వరకు రుణాన్ని పొందవచ్చని తెలిపారు. కాగా, దేశంలో 7.75 కోట్ల మందికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

మద్దతు ధరల పెంపుపై మంత్రి అచ్చెన్న హర్షం

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటల మద్దతు ధరలను కేంద్రప్రభుత్వం పెంచడం పట్ల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్.. రైతులు లాభదాయ ధరలు పొందటానికి వీలుగా మద్దతు ధరలను నిర్ణయించిందని ఓ ప్రకటనలో తెలిపారు. మద్దతు ధరలు పెంచడం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయ భారం తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ముందే విస్తరించడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధం కావచ్చన్నారు. గత ఐదేళ్లు వ్యవసాయంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు త్వరలో అన్నదాత సుఖీభవ కింద సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే రైతులకు వ్యక్తిగత పరికరాలు అందిస్తున్న ప్రభుత్వం రానున్న కాలంలో సాంకేతికంగా మరింత ఊతమిస్తుందని తెలిపారు.

కనీస మద్దతు ధరలు(క్వింటాల్‌కు రూ.)

పంట	2024-25	2025-26	పెంపు
వరి కామన్	2,300	2,369	69
వరి గ్రేడ్-ఏ	2,320	2,389	69
పత్తి మీడియం	7,121	7,710	589
పత్తి లాంగ్ స్టేబుల్	7,521	8,110	589
జొన్న హైబ్రీడ్	3,371	3,699	328
జొన్న మాల్దిండి	3,421	3,749	328
సజ్జ	2,625	2,775	150
రాగులు	4,290	4,886	596
మొక్కజొన్న	2,225	2,400	175
కందులు	7,550	8,000	450
మినుములు	7,400	7,800	400
పెసలు	8,682	8,768	86
ఆవాలు	8,717	9,537	820
వేరుశనగ	6,783	7,263	480
పొద్దుతిరుగుడు	7,280	7,721	441
సోయాబీన్	4,892	5,328	436
నువ్వులు	9,267	9,846	579

2 రైలు ప్రాజెక్టులకు అనుమతి

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలోని రెండు రైలు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రత్లాం-నాగ్దా, వార్ధా-బల్లార్షాల మధ్య నాలుగో లైన్(176 కిలో మీటర్లు)ను ఏర్పాటు చేయనున్నారు. తద్వారా మరింత వేగవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ ప్రాజెక్టులకు రూ.3,399 కోట్లను ఖర్చు చేయనున్నామని, 2029-30 నాటికి ఈ ప్రాజెక్టులు పూర్తవుతాయని చెప్పారు.

తమిళం నుంచి కన్నడ పుట్టింది

» కమల్‌హాసన్ వ్యాఖ్య
» కన్నడిగుల మండిపాటు



చెన్నై, మే 28 (ఆంధ్రజ్యోతి): సినిమా కార్యక్రమంలో ప్రముఖ నటుడు కమల్‌హాసన్ 'తమిళం నుంచి కన్నడ పుట్టింది' అని చేసిన వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. తమ భాషను తక్కువ చేశారంటూ కమల్‌పై కన్నడిగులు మండిపడుతున్నారు. త్వరలో విడుదల కాబోయే ఆయన నటించిన సినిమా 'థగ్ లైఫ్'ను బ్యాన్ చేయాలి అంటూ డిమాండ్ చేస్తున్నారు. కమల్ వ్యాఖ్యలపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య కూడా స్పందించారు. కన్నడకు ఎంతో ఘన చరిత్ర ఉందని, అది ఆయనకు తెలిసుండదు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలపై వివాదం రేగడంపై కమల్ స్పందించారు. తిరువనంతపురంలో ఆయన మాట్లాడుతూ.. భాషల చరిత్ర గురించి తనకు చాలామంది చరిత్రకారులు చెప్పారని, తాను చెప్పిందంతా ప్రేమతోనే చెప్పానని తెలిపారు.

రాజ్యసభకు కమల్‌హాసన్!

ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కానున్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు డీఎంకేతో కుదిరిన ఒప్పందంలో భాగంగా మిత్రపక్షం ఎంఎన్ఎం పార్టీకి రాజ్యసభ సీటు దక్కనుంది. రాజ్యసభ సీట్లపై డీఎంకే బుధవారం ఓ ప్రకటన చేసింది. రాష్ట్రం నుంచి ఆరు రాజ్యసభ సీట్లు ఖాళీ అవుతుండగా, వాటిలో ఒక సీటును ఎంఎన్ఎంకు కేటాయించింది. ఈ సీటులో కమల్ హాసన్ పోటీ చేయనున్నారు. కాగా మూడు సీట్లకు అభ్యర్థులను డీఎంకే ప్రకటించింది.

ఆరుగురు ఎమ్మెల్యేలను తెస్తా.. మంత్రి పదవి ఇస్తారా?

» కాంగ్రెస్‌కు కవిత ప్రతిపాదన

హైదరాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. కాంగ్రెస్‌లో చేరేందుకు ఆ పార్టీతో రాయబారం నెరపిన అంశానికి సంబంధించి మరింత సమాచారం వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్‌లో చేరడంతోపాటు, "బీఆర్ఎస్ నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలను తీసుకొని వస్తా. నాకుమంత్రి పదవి స్తారా?" అని కాంగ్రెస్ అధిష్ఠానం ముందు కవిత ప్రతిపాదన పెట్టినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం అందింది. ఈ సమాచారం ప్రకారం.. కవిత కాంగ్రెస్ హైకమాండ్‌తో టచ్‌లోకి వెళ్లారు. అధిష్ఠానంతో సంప్రదింపులు జరిపారు. మంత్రి పదవికి సంబంధించి తన అభిమతాన్ని కాంగ్రెస్ పెద్దల ముందు ఉంచగా అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. టీపీసీసీ స్థాయిలో కవిత చేరికపై సుముఖత కూడా వ్యక్తమైంది. కానీ సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహిత వర్గాలు అభ్యంతరం చెప్పడంతో కాంగ్రెస్‌లో కవిత చేరికకు బ్రేక్ పడింది. కవిత కాంగ్రెస్‌తో రాయబారం జరిపిన విషయాన్ని మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనం తీవ్ర చర్చకు దారితీసింది. కాగా, గత రెండు రోజులుగా 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలపై కవిత రుసరుసలాడారు. తనను సంప్రదించకుండా వార్తలు ఇచ్చారని, ఇది జర్నలిజమా, శాడిజమా? అంటూ 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. ఇదే విషయంపై మాట్లాడేందుకు మంగళవారం రాత్రి 9.16గంటలకు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించగా ఆమె స్పందించలేదు. తనను సంప్రదించలేదని ఆమె పేర్కొనడం అవాస్తవం. కేసీఆర్‌కు రాసిన లేఖను ఎవరు బయట పెట్టారో చెప్పాలన్న కవిత.. ఇంతకీ అందుకు బాధ్యులెవరన్నది చెప్పకపోవడం, కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలెవరన్నదీ బయటపెట్టకపోవడం గమనార్హం.

థరూర్.. లక్ష్మణరేఖ దాటారు!

» కేరళ ఎంపీపై కాంగ్రెస్‌లో ఆగ్రహం

న్యూఢిల్లీ, మే 28: ఎంపీ శశిథరూర్‌కు, కాంగ్రెస్ పార్టీకి మధ్య దూరం రోజురోజుకీ పెరుగుతోంది. కాంగ్రెస్ శశిథరూర్ పేరు ప్రతిపాదించకపోయినా.. విదేశాలకు వెళ్లే ఓ ఎంపీల బృందానికి సారథిగా కేంద్రం ఎంపిక చేయటం, దానికి ఆయన అంగీకరించటంతో పార్టీకి, ఆయనకు మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. తాజాగా పనామాలో థరూర్ మాట్లాడుతూ.. గతంలో ఉగ్రదాడులను భారత్ భరిస్తూ వచ్చిందని, ఇటీవల దెబ్బకు దెబ్బ తీస్తోందన్నారు. మోదీ హయాంలో జరిగిన యురి, పుల్వామా, పహల్గాం ఉగ్రదాడుల అనంతరం పాకిస్థాన్‌లోకి వెళ్లి మరీ ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశామని తెలిపారు. దీనిపై కాంగ్రెస్‌నేత పవన్‌ఖేరా స్పందిస్తూ.. యూపీఏ హయాంలో పాకిస్థాన్ మీద పలుమార్లు సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించామని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ స్వయంగా చెప్పిన వీడియోను థరూర్‌కు ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. పార్టీ వైఖరికి భిన్నంగా శశిథరూర్ మాట్లాడుతున్నారని, ఒకరకంగా ఆయన 'లక్ష్మణరేఖ'ను దాటారని పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారంటూ తాజాగా పీటీఐ వార్తా సంస్థ వెల్లడించింది.

పౌరులకు ఆయుధ లైసెన్సులు

» అసోం ప్రభుత్వ సంచలన నిర్ణయం
» బంగ్లాదేశీలు, అక్రమ వలసదారుల నుంచి 'స్వదేశీ పౌరుల' రక్షణకు ఆయుధ లైసెన్సుల మంజూరు
» జారీ చేసే అధికారం జిల్లా అధికారులకు

గువాహటి, మే 28: అసోంలోని హిమంత బిశ్వ శర్మ సారథ్యంలోని అసోం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. బంగ్లాదేశ్‌తో సరిహద్దు గల జిల్లాల్లో మారుమూల, ముప్పు గల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల స్వీయ రక్షణకు వారికి ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని సీఎం హిమంత బిశ్వశర్మ అధ్యక్షతన బుధవారం జరిగిన రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. బంగ్లాదేశ్‌లో ఇటీవల హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుగుతున్న నేపథ్యంలో అసోం సర్కారు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ధుబ్రీ, నాగావ్, మోరిగావ్, బార్పేట, సౌత్ సాల్మరా, గోల్‌పరా జిల్లాల వాసులకు ఈ లైసెన్సులు మంజూరు చేస్తారు. అయితే, అర్హులైన వ్యక్తులకు ఆయుధ లైసెన్సులు ఇవ్వాలన్న విషయమై ఆయా జిల్లాల అధికారులు నిర్ణయం తీసుకుంటారని హిమంత బిశ్వ శర్మ తెలిపారు. 'ఇది చాలా ముఖ్యమైన, సున్నితమైన నిర్ణయం. ఇటీవలి బంగ్లాదేశ్ పరిణామాల (హిందువులను లక్ష్యంగా చేసుకున్న ఘటనలు) నేపథ్యంలో ఈ జిల్లాల్లోని గ్రామాల్లో నివసిస్తున్న భారతీయ స్వదేశీ పౌరుల్లో అభద్రతా భావం నెలకొంది. వారిపై దాడులు చేస్తామంటూ సరిహద్దు ఆవల బంగ్లాదేశ్ నుంచి, సొంత గ్రామాల్లోనూ హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మారుమూల, దుర్బల ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది' అని అసోం సీఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. 'చట్ట విరుద్ధ బంగ్లాదేశీయులను గుర్తించి బహిష్కరించే ప్రక్రియ చేపట్టినప్పటి నుంచి భారతీయ స్వదేశీ పౌరులు భయంతో జీవిస్తున్న సందర్భాలు మేం చూశాం. ఈ ప్రాంతాల్లో భారతీయ స్వదేశీ పౌరులు మైనారిటీలుగా జీవిస్తున్నారు. అందుకే వారికి ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని మేం నిర్ణయించాం. ఆయుధాలను కొనుగోలు చేసేందుకు వారికి ప్రభుత్వం సాయం చేయదు. కానీ, ఆయుధాలు కొనుగోలు చేసేందుకు లైసెన్సు మంజూరు చేస్తాం. ఆయుధ లైసెన్సులు ఇవ్వాలని ఈ ప్రాంత వాసుల నుంచి సుదీర్ఘ కాలంగా డిమాండ్ ఉంది' అని ఆయన తెలిపారు. 'అసోం కష్టమైన, సున్నితమైన రాష్ట్రం. ఆయుధాల చట్టంలోని నిబంధనల కింద ఆయుధాల లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని భారతీయ స్వదేశీ పౌరులను ప్రోత్సహిస్తాం' అని బిశ్వశర్మ చెప్పారు. చట్ట విరుద్ధ హెచ్చరికలు, శత్రువుల ముప్పు ఉన్న ప్రాంతాల్లో స్వదేశీ సామాజిక వర్గాలకు సాధికారత కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ చొరవ తీసుకున్నది. 1979-85 మధ్య చట్ట విరుద్ధ వలసదారులకు వ్యతిరేకంగా అసోం ఆందోళన సాగినప్పటి నుంచి ఆయుధాల లైసెన్సులు కావాలన్న డిమాండ్ ఉందని వెల్లడించారు. కానీ, రాష్ట్రంలోని స్వదేశీ పౌరుల ఆందోళనను, డిమాండ్‌ను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు.

దేశవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో!

» కొత్త చట్టం తీసుకురానున్న కేంద్రం
» ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ

న్యూఢిల్లీ, మే 28 : భూములు, ఇతర ఆస్తులు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత పారదర్శకం, సులభతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను అందుబాటులోకి తీసుకురానుంది. దేశ వ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేయనుంది. ఇందుకోసం 117 ఏళ్లుగా అమలులో ఉన్న రిజిస్ట్రేషన్ చట్టం స్థానంలో ఓ కొత్త చట్టాన్ని తీసుకురాబోతుంది. నూతన చట్టం అమలులోకి వస్తే ప్రజలు తమ భూములు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లను ఆన్‌లైన్‌లోనే చేసుకోవడమే కాక.. అందుకు సంబంధించిన పత్రాలను ఈ-సర్టిఫికెట్ల రూపంలో పొందవచ్చు. ఈ నూతన చట్టం పవర్ ఆఫ్ అటార్నీ, విక్రయ ఒప్పందాలు, సేల్ సర్టిఫికెట్లు, తనఖా ఒప్పందాల వంటి పత్రాల రిజిస్ట్రేషన్‌నూ తప్పనిసరి చేయనుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన భూవనరుల విభాగం ఈ చట్టానికి సంబంధించిన ముసాయిదాను సిద్ధం చేసింది. ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేపడుతోంది. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి చట్టంలో కొన్ని సవరణలు చేసుకునే అధికారం రాష్ట్రాలకు ఉంటుంది.

ఆధార్ ఆధారిత ధ్రువీకరణ

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆధార్ కార్డు ధ్రువీకరణతో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ కార్డు సంఖ్యతో అనుసంధానమైన మొబైల్ నెంబర్‌కు ఓటీపీ(వన్ టైమ్ పాస్‌వర్డ్) పంపడం ద్వారా ఈ ధ్రువీకరణ చేపట్టే అవకాశం ఉంది. ఆధార్ వివరాలు ఇవ్వడం ఇష్టం లేని వారికోసం వేరే ఐచ్ఛికాలనూ ఇవ్వనుంది.

మరీ అలా నిజాలు చెప్పొద్దు!

» మెరిట్స్‌తో సంబంధం లేకుండానే మీ కేసు ముగిసిపోతుంది
» సీనియర్ లాయర్ మరో కోర్టులో బిజీగా ఉన్నారనడంపై సుప్రీం జడ్జి స్పందన

న్యూఢిల్లీ, మే 28: మరీ నిజాయతీగా ఉంటే కష్టమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ సరదాగా వ్యాఖ్యానించారు. బుధవారం జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ఎదుట ఓ కేసు విచారణ ప్రారంభమైంది. ప్రతివాదుల తరఫు సీనియర్ న్యాయవాది ఇంకా రాలేదు. తమ కేసు విచారణను మిగతా కేసుల తర్వాత చేపట్టాలని ఆ న్యాయవాది వద్ద జూనియర్‌గా పనిచేసే లాయర్ కోరారు. మిగతా కేసుల విచారణ పూర్తి చేసినప్పటికీ ఆ సీనియర్ న్యాయవాది రాలేదు. ఏమైందని ధర్మాసనం ప్రశ్నించగా... సీనియర్ న్యాయవాది హైకోర్టులో ఓ కేసు విషయంగా బిజీగా ఉన్నారని సమాధానమిచ్చారు. దీనిపై జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్ స్పందిస్తూ.. "మీ సీనియర్ హైకోర్టులో బిజీగా ఉన్నారని సుప్రీంకోర్టుకు ఎప్పుడూ చెప్పకూడదు. జడ్జి ఈగోను దెబ్బతీయవద్దు. మెరిట్స్‌తో సంబంధం లేకుండానే మీ కేసు ముగిసిపోతుంది" అన్నారు.

అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం?

» వాషింగ్టన్‌లో చర్చలు జరిపిన కేంద్ర మంత్రి గోయెల్, వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్
» జూన్‌లో భారత్‌కు అమెరికా అధికారులు

న్యూఢిల్లీ, మే 28: భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదరనుందా? వచ్చే నెలలోనే ఇరుదేశాలూ ఈ మేరకు ఒప్పందం చేసుకోనున్నాయా? అంటే విశ్వసనీయ వర్గాలు అవుననే అంటున్నాయి. ఇరుదేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని, మధ్యంతర వాణిజ్య ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపాయి. జూన్‌లో అమెరికా అధికారుల బృందం భారత పర్యటనకు రానున్నట్లు సమాచారం. కేంద్ర వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, చర్చలకు ప్రధాన మధ్యవర్తిగా ఉన్న రాజేశ్ అగర్వాల్ గత వారమే నాలుగు రోజుల అమెరికా పర్యటన ముగించుకొన్న సంగతి తెలిసిందే. మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై ఆయన వాషింగ్టన్‌లో అమెరికా అధికారులతో చర్చలు జరిపినట్లు సమాచారం. గత వారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ కూడా అమెరికా పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య మంత్రి హోవార్డ్ లుత్నిక్‌తో రెండుసార్లు భేటీ అయ్యారు. ఒప్పందంపై చర్చలు జరిపారు. భారత్‌పై 26% ప్రతీకార సుంకం విధిస్తామన్న నిర్ణయాన్ని అమెరికా జూలై 9 వరకు వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరుదేశాల మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కంటే ముందుగా జూన్‌లోనే మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని యోచిస్తున్నాయి. మరోవైపు మధ్యంతర వాణిజ్య ఒప్పందంలో భాగంగా తమ వస్తువులపై 26% ప్రతీకార సుంకాలను పూర్తిగా మినహాయించాలని అమెరికాను భారత్ కోరనున్నట్లు సమాచారం.



పసుపు పండుగ

ప్రతి స్కీమ్‌లోనూ వైసీపీ స్కామ్

'విధ్వంసం నుంచి పునర్నిర్మాణం అనేది పదాల సమాహారమే కాదు. ఇది ప్రజల ఆశలకు, విశ్వాసాలకు నిదర్శనం. 2019లో వైసీపీ వచ్చాక విష సంస్కృతి, విధ్వంస పాలనకు నాంది పలికింది. ప్రతి అంశంలో స్కీమ్ పేరుతో స్కామ్ చేశారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక మళ్లీ వెలుగు వచ్చింది. ప్యాలెస్ పాలన పోయి ప్రజా పాలన ప్రారంభమైంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి.'

- ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర
(అంశం: విధ్వంసం నుంచి పునర్నిర్మాణం)

ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారు

'ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకొచ్చిన దుర్మార్గుడు గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశాడు. వారు నాశనం చేసిన దగ్గరి నుంచి అభివృద్ధి, పునర్నిర్మాణాన్ని చంద్రబాబు ప్రారంభించారు. కూటమి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తున్నారు. వెనుకబడిన మా మడకశిరలో పరిశ్రమల స్థాపనకు చంద్రబాబు చొరవ చూపించారు. గత పాలనలో నిలిచిన ప్రాజెక్టులన్నీ పునఃప్రారంభమవుతున్నాయి.'

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు
(అంశం: విధ్వంసం నుంచి పునర్నిర్మాణం)

విద్యుత్ చార్జీలు 9సార్లు పెంచిన జగన్

'రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని సంస్కరణలతో ముందుకుతెచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదే. జగన్ ఐదేళ్ల కాలంలో విద్యుత్ రంగాన్ని సర్వనాశనంచేశారు. 9సార్లు విద్యుత్ చార్జీలు పెం చారు. రాష్ట్రంలో మరింత విద్యుత్ ఉత్పత్తి చేసి పక్క రాష్ట్రాలకు అందించేందుకు పవన, సౌర విద్యుత్తు ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు చొరవ చూపుతున్నారు.'

- మంత్రి గొట్టిపాటి రవికుమార్ (అంశం: విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు)

విద్యుత్ సంస్కరణలకు బాబు రోల్‌మోడల్

'ఆంధ్రప్రదేశ్‌ను మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దడం సీఎం చంద్రబాబుకే సాధ్యం. విద్యుత్ సంస్కరణలకు ఆయన రోల్ మోడల్. దేశంలోని ఇతర సీఎంలందరూ విద్యుత్ సంస్కరణలు అమలుపై చంద్రబాబుతో చర్చిస్తున్నారు. గత ఐదేళ్లలో పాలకులు విద్యుత్‌రంగాన్ని నాశనం చేశారు. ఆ పరిస్థితులన్నీ చక్కదిద్దేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగిస్తున్నారు.'

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (అంశం: విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు)

పోలవరాన్ని 20ఏళ్లు వెనక్కి నెట్టారు

'నీరు ఎక్కడ ఉంటుందో అక్కడ నాగరికత ఉంటుందన్న నానుడి మన సీఎంకు బాగా తెలుసు. అందుకే వీలైనంత వరకు సాగునీరు, తాగునీరు కొరత లేకుండా చూడాలని అహర్నిశలు కృషి చేస్తున్నారు. 2014-19 వరకు ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు టీడీపీ ప్రభుత్వం రూ.72 వేల కోట్లు కేటాయించింది. కానీ 2019-24లో ఈ రంగానికి వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది రూ.32వేల కోట్లు మాత్రమే. పోలవరం ప్రాజెక్టును 20ఏళ్లు వెనక్కి నెట్టేశారు. ఈ ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తిచేసి ఉత్తరాంధ్రకు, రాయలసీమకు నీటిని మళ్లిస్తాం.'

- మంత్రి నిమ్మల రామానాయుడు
(అంశం: సమగ్ర నీటి ప్రణాళికతో ఉజ్వల ప్రగతి)

రివర్స్ టెండరింగ్‌తో ప్రశ్నార్థకం

'పోలవరం ప్రాజెక్టును రివర్స్ టెండరింగ్‌తో గత పాలకులు నాశనం చేశారు. 2014-19 కాలంలో చంద్రబాబు హయాంలో 72 శాతం పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. గత పాలకుల్లాగా జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేసే విధానానికి స్వస్తిపలికి సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చంద్రబాబు కృషి చేశారు.'

- ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి
(అంశం: సమగ్ర నీటి ప్రణాళికతో ఉజ్వల ప్రగతి)

వచ్చే మహానాడు పులివెందులలో...

'దివంగత ఎన్టీఆర్ టీడీపీ హయాంలోనే రాయలసీమలో తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులకు నాంది పలికారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో సీమ ప్రాజెక్టుల కోసం రూ.12వేల కోట్లు ఖర్చు చేస్తే జగన్ హయాంలో రూ.2వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదు. పులివెందుల నియోజకవర్గంలో ఎండిపోతున్న చీనీ చెట్లకు నీళ్లిచ్చి కాపాడింది, గండికోట నుంచి పులివెందులకు నీరిచ్చిన ఘనత చంద్రబాబుదే. కడప జిల్లాకు జగన్ మోసం తప్ప ఏమీ చేసింది లేదు. వచ్చే మహానాడు పులివెందులలో నిర్వహిస్తాం... మీరు సిద్ధమేనా?'

- ఆర్.శ్రీనివాసరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు
(అంశం: సమగ్ర నీటి ప్రణాళికతో ఉజ్వల ప్రగతి)

ఐదేళ్ల విధ్వంసాన్ని ఏడాదిలో పూడ్చిన చంద్రబాబు

20ఏళ్ల ముందుచూపుతో ప్రణాళికలు రూపొందించడం సీఎం చంద్రబాబుకే సాధ్యం. రాష్ట్రం విడిపోయిన తర్వాత హైదరాబాద్ పోయిందనే బాధను పక్కనపెడితే ఆయన మనతో ఉన్నారని, ఆయన పాలనలో ఏపీలో ఉన్న ప్రతి జిల్లాలో ఒక హైదరాబాద్‌ను చేస్తారనే నమ్మకం ఉంది. కేంద్రం సహకారంతో మౌలిక సదుపాయాల కల్పన చురుగ్గా చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో రూ.130కోట్లతో ప్రతి మండలానికి రోడ్లు వేశాం. గత వైసీపీ పాలనలో ఐదేళ్లలో జరిగిన విధ్వంసాన్ని చంద్రబాబు ఒక్క ఏడాదిలోనే పూడ్చారు.'

- ఎమ్మెల్యే గౌతు శిరీష (అంశం: మౌలిక సదుపాయాల కల్పనతో మారనున్న రాష్ట్ర ముఖచిత్రం)





ఎవర్నీ వదలం

(మొదటి పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలోని అధినేతే సొంత బాబాయిని చంపి ఆ నిందను తనపై వేశారన్నారు. 'శాంతి భద్రతలను కాపాడే బాధ్యత మన కూటమి ప్రభుత్వంపై ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు. శాంతిభద్రతలను ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దు, ఇది నా పార్టీ కుటుంబసభ్యులకు నేను చేస్తున్న విజ్ఞప్తి. తప్పుచేసిన వారు ఎవరైనా వదిలిపెట్టేది లేదు. వారి పట్ల చండశాసనుడిలా వ్యవహరిస్తా. గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తే వారి ఆస్తులను జప్తు చేస్తాం. అలా జప్తు చేసిన ఆస్తులను బాధితుల కోసం వినియోగిస్తాం' అని చెప్పారు. ఇంకా ఏం చెప్పారంటే..

ఎడారి సీమ కానివ్వను..

రాయలసీమ సుభిక్షానికి ప్రాజెక్టులు చేపట్టాం. సీమను కరువుసీమగా, ఎడారి సీమగా కానివ్వనని హామీ ఇస్తున్నా. తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది ఎన్టీఆర్. నేను బాధ్యతలు చేపట్టాక వాటిని మరింత ముందుకు తీసుకెళ్లాం. ఈ ఏడాది రూ.3,800 కోట్లతో రాయలసీమ నీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నాం. పోలవరం తర్వాత ఆ స్థాయిలో నిధులు ఖర్చు చేస్తున్న ప్రాజెక్టు హంద్రీ-నీవా. ఉద్యాన పంటలతో ఇప్పుడు అనంతపురం సంపదలో ముందంజలో ఉందంటే దానికి కారణం టీడీపీయే. వెలిగొండ ప్రాజెక్టును కూడా ప్రాధాన్య క్రమంలో పూర్తి చేయబోతున్నాం. 2027 డిసెంబరు నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు ఇచ్చి రైతుల రుణం తీర్చుకోవడమే నా లక్ష్యం. సీమలో రక్షణ పరిశ్రమల కోసం కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పెడతాం. సీమను హార్టికల్చర్ హబ్‌గా, హైటెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దుతాం. తిరుమల, శ్రీశైలంలాంటి దివ్యక్షేత్రాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తాం. 10 రోజుల్లో కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తాం. 3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మాణం చేపడతాం. జిందాల్ సంస్థ నిర్మించే ఈ స్టీల్ ప్లాంట్‌తో 3వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. దీనికి శంకుస్థాపనతోపాటు ప్రారంభోత్సవం కూడా నేనే చేస్తా. వంశధార నుంచి పెన్నా వరకు నదులన్నీ అనుసంధానించాలన్నదే నా లక్ష్యం. తద్వారా తెలుగు నేలకు జలహారతి ఇచ్చి, ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటాం.

రెండు రాష్ట్రాలూ నాకు సమానమే

పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా ఏపీలోని అన్ని ప్రాంతాలకు నీరిచ్చేలా కార్యాచరణ రూపొందించాం. పోలవరం నుంచి కృష్ణానదికి.. అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్‌కు.. అక్కడి నుంచి బనకచర్లకు నీటిని తరలిస్తాం. ఈ అనుసంధానం పూర్తయితే రాష్ట్ర ముఖచిత్రమే మారిపోతుంది. సముద్రంలోకి వృధాగా పోయే నీటిని వాడుకుంటే తెలంగాణకూ లాభమే. బీఆర్ఎస్ దీనిపై లేనిపోని విమర్శలు చేస్తోంది. గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టులు కడితే మేమెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. ఏపీ, తెలంగాణ రెండు రాష్ట్రాలూ నాకు సమానమే. దేశంలో ఎక్కువ ఆదాయం వచ్చేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దింది కూడా టీడీపీయే.

అనకాపల్లిలో మరో ఉక్కునగరం

రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు, నియోజకవర్గాలు అభివృద్ధి కావాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఉత్తరాంధ్రను ఫైనాన్షియల్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా చేశాం. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ పెడుతోంది. అక్కడ మరో ఉక్కునగరం తయారవుతుంది. విశాఖలో రైల్వే జోన్, ఫార్మాసిటీ, ఫార్మా జోన్ తయారవుతున్నాయి. భోగాపురం విమానాశ్రయం, మెట్రోలాంటి ప్రాజెక్టులు కూడా పూర్తవుతాయి. రాయలసీమను అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపే బాధ్యత టీడీపీదే. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తాం. అమరావతి, విశాఖ, రాజమండ్రి, తిరుపతి, అనంతపురంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. 43 ఏళ్లుగా ఆదరిస్తున్న ఆంధ్ర ప్రజల రుణం తీర్చుకోవాలనే రాత్రీపగలు కష్టపడి పనిచేస్తున్నాను. భవిష్యత్ అంతా టూరిజానిదే. రాబోయే ఇజం టూరిజమే నని గతంలోనే చెప్పా. గండికోటను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదే. ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ రాష్ట్ర ప్రాజెక్టులకు నిధులు సాధించేందుకే ప్రయత్నాలు చేస్తున్నాం. పోలవరానికి రూ.12 వేల కోట్లు, రైల్వే జోన్ సాధించాం. అమరావతిని ప్రజారాజధానిగా నిర్మించేందుకు ప్రాజెక్టులను పట్టాలెక్కించాం. ఉచిత గ్యాస్ సిలిండర్ మూడో విడత డబ్బులు కూడా మహిళల ఖాతాల్లో ముందుగానే వేస్తాం. 2014నాటికి 22 మిలియన్ యూనిట్ల కరెంటు కొరత ఉంటే.. సంస్కరణలు తెచ్చి మిగులు రాష్ట్రంగా మార్చాం. 2019లో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలన్నీ రద్దు చేసి వ్యవస్థను వైసీపీ సర్వనాశనం చేసింది. విద్యుత్ కొరత లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా ఏపీని క్లీన్, గ్రీన్, ఎనర్జీ హబ్‌గా రూపొందిస్తున్నాం. కరెంటు చార్జీలు పెంచబోమని పునరుద్ఘాటిస్తున్నా. ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి విద్యుదుత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల వరకు సౌర ప్యానెళ్లు ఉచితంగా ఇస్తాం. పీఎం కుసుం కింద వ్యవసాయ పంపుసెట్ల వద్ద సౌర ప్యానెళ్లు పెట్టుకోవాలి. కేంద్రం ఈ ప్రాజెక్టు కోసం 75 వేల కోట్ల సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించింది. టీడీపీ నేతలు, కార్యకర్తలంతా ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు పెట్టుకోవాలి.

హెచ్‌ఏఎల్ తరలింపుపై సీఎం స్పష్టత

బెంగళూరులోని హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)ను ఆంధ్రకు తరలించాల్సిందిగా తాను కేంద్రాన్ని కోరినట్లు వచ్చిన వార్తలపై మహానాడులో సీఎం స్పష్టత ఇచ్చారు. 'ఏరోస్పేస్ పరిశ్రమకు అనువైన ప్రాంతం అనంతపురం జిల్లా లేపాక్షి. కేంద్రాన్ని అదే అడిగాను. కానీ కర్ణాటకలోని కొందరు నేనేదో హెచ్ఏఎల్‌ను తరలించాలని అడిగినట్లు మాట్లాడున్నారు. ఒక రాష్ట్రంలో ఉన్న సంస్థను వేరే తరలించమని నేనెప్పుడూ కోరను. అలా కోరి చెడ్డ పేరు తెచ్చుకోను' అని తేల్చిచెప్పారు.



లోకేశ్ అందజేసిన యువగళం పుస్తకాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు



గురువారం జరగనున్న బహిరంగ సభకు సిద్ధమవుతున్న వేదిక



మహానాడు ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన యువగళం చిత్ర ప్రదర్శన

2047 నాటికి తలసరి ఆదాయం రూ.36 లక్షలకు

రాష్ట్రంలో తలసరి ఆదాయం 2047 నాటికి రూ.36లక్షలు ఉండేలా సీఎం చంద్రబాబు ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం ఇది రూ.2.68 లక్షలు మాత్రమే. 70 శాతంగా ఉన్న అక్షరాస్యతను వంద శాతానికి చేర్చడమే లక్ష్యం. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు అభివృద్ధి చెందాలి. ఒక్క చాన్స్ అంటూ విధ్వంసం చేసిన జగన్ మళ్లీ తాము అధికారంలోకి వస్తామని అపోహ పడుతున్నారు.'

- ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు
(అంశం: మౌలిక సదుపాయాల కల్పనతో మారనున్న రాష్ట్ర ముఖచిత్రం)

వైసీపీ హయాంలో గంజాయి రాష్ట్రంగా...

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా మార్చింది. స్వేచ్ఛగా ధర్నాలు, సమావేశాలు ఏర్పాటుచేసుకోలేని పరిస్థితి. లోకేశ్ యువగళం పాదయాత్రకు అనేక అడ్డంకులు సృష్టించారు. మైకు కూడా లాక్కుని, అడుగు కూడా వేయనీయమని హెచ్చరించారు. అయినా లోకేశ్ శాంతియుతంగా ప్రజల్లోకి వెళ్లారు. గత వైసీపీ ప్రభుత్వం కబ్జాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లను పెంచి పోషించింది. పారిశ్రామికవేత్తలు, కాంట్రాక్టర్లను బెదిరించి అరాచకాలు సృష్టించింది. ఈ రోజు రాయలసీమ అభివృద్ధి వైపు పయనిస్తోందంటే చంద్రబాబు కృషే దానికి కారణం.

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
(అంశం: ప్రజల సంరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ)

రాష్ట్రాభివృద్ధి జగన్‌కు నచ్చలేదు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసిన రోజు నుంచే శాంతిభద్రతలు ప్రారంభమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించింది. అమరావతి రైతులు పాదయాత్రగా తిరుమలకు వెళ్తుంటే సర్వేపల్లిలో వారికి భోజన వసతి కల్పించేందుకు టెంటు వేస్తే.. మాజీ మంత్రి కాకాణి వాటిని పోలీసులను పెట్టి తొలగించారు. బెంగళూరులోని యలహంకలో 29 ఎకరాల్లో ఒక ప్యాలెస్, పులివెందులలో 5 ఎకరాల్లో ఒక ప్యాలెస్, లోటస్ పాండ్‌లో ఎకరాలో ఒక ప్యాలెస్ నిర్మించుకున్నారు. వారి ఇంట్లో నలుగురికి 42 ఎకరాల్లో ఇళ్లు కట్టుకున్న జగన్.. రాష్ట్ర రాజధానికి 500 ఎకరాలు సరిపోవా అనడం దుర్మార్గం.

- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
(అంశం: ప్రజల సంరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ)

కేంద్రం నుంచి రూ.వేల కోట్లు తెస్తున్నాం

'జగన్‌కు కేంద్ర పథకాలను వాడుకోవడం చేతకాలేదు. మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వక చాలా నష్టపోయాం. ఇప్పుడు చంద్రబాబు తెలివిగా కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు తెస్తున్నారు. పోలవరం కోసం చంద్రబాబు కేంద్రంలో ఎంత కష్టపడ్డారో ప్రత్యక్షంగా చూశా. ఈ ఏడాది రైల్వే ప్రాజెక్టుల కోసం రూ.9వేల కోట్లు కేటాయించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 160 అడుగులు, 14 లేన్ల రోడ్డును అమరావతి రింగురోడ్డుకు కేంద్రం ప్రతిపాదించగా.. దాన్ని 230 అడుగులు చేయాలని చంద్రబాబు కోరారు. నేను లేకపోయినా నా రాష్ట్ర ప్రజలు దీనిని అనుభవించాలని కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. దానికి నేను ప్రత్యక్ష సాక్షిని. ప్రతి నియోజకవర్గంలో రూ.20కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నాం'

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,
(అంశం: రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారం)

అరాచక పాలనపై యువగళం అక్షర రూపం!

చంద్రబాబుకు పుస్తకాన్ని అందించిన మంత్రి లోకేశ్

కడప, మే 28 (ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనపై గళమెత్తుతూ చేపట్టిన యువగళం పాదయాత్ర విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ రెండోరోజు బుధవారం మహానాడు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. జగన్ అరాచకాలను ఎలుగెత్తుతూ 2023 జనవరి 27న లోకేశ్ కుప్పం శ్రీవరదరాజస్వామి పాదాల చెంత నుంచి ప్రారంభించిన పాదయాత్ర 226 రోజులు సాగింది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో మలుపు తిప్పింది. ఉమ్మడి 13 జిల్లాల్లో 97 నియోజకవర్గాలు, 232 మున్సిపాలిటీలు, కార్పొరేషన్, మండలాలు 2097 గ్రామాల్లో 3132 కి.మీ. మేర పాదయాత్ర సాగింది. పాదయాత్రకు వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా సృష్టించిన అడ్డంకులు నాటి అరాచక పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు, కన్నీటి గాథలను పుస్తకంలో సచిత్రంగా కళ్లకు గట్టినట్లు చూపారు. సీఎం ఆసక్తిగా తిలకించి లోకేశ్‌ను అభినందించారు. యువగళం ద్వారా రాష్ట్ర ప్రజల్లో చైతన్యం నింపారని, నాటి అనుభవం పుస్తకాల రూపంలోకి తీసుకురావడం బాగుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా లోకేశ్.. చంద్రబాబుకు పాదాభివందనం చేశారు.

లోకేశ్‌కు కీలక పదవి ఇవ్వండి

లోకేశ్‌కు కీలక బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. బుధవారం మహానాడు వేదికపై నుంచే పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు, ఎంపీలు.. ఆయనకు వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు ఇవ్వాలని తమ ప్రసంగాల్లో కోరారు. వీరిలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంఎస్ రాజు తదితరులు ఉన్నారు.

లోకేశ్ తనను తాను నిరూపించుకున్నారు

'రాజకీయాల్లో వారసులుగా ఉండటమంటే సాహసమే. కానీ లోకేశ్ తనను తాను నిరూపించుకున్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల నమ్మకం, సంతృప్తి పెరిగింది. ఎన్నికల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు తండ్రీ కొడుకులిద్దరూ కృషి చేస్తున్నారు.'

- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి (అంశం: విధ్వంసం నుంచి పునర్నిర్మాణం)



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న భువనేశ్వరి, దేవాన్ష్

ఎన్టీఆర్ ఘాట్ వద్ద భువనేశ్వరి నివాళులు

ఖైరతాబాద్, న్యూఢిల్లీ, మే 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్‌లో ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ నేతలు, అభిమానులు పెద్ద ఎత్తున నివాళులర్పించారు. తెల్లవారుజామునే ఎన్టీఆర్ మనవడు జూనియర్ ఎన్టీఆర్, సోదరుడు కల్యాణ్ రామ్‌తో కలసి తాత సమాధి వద్ద నివాళులర్పించి కొంతసేపు మౌనంగా కూర్చున్నారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ కూతురు భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలసి ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. దేవాన్ష్ తాతకు భక్తితో నమస్కరించి, మొక్కారు. ఎన్టీఆర్ కుమారుడు రామకృష్ణ, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి సాయిబాబాతో పాటు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

ఘాట్ డోమ్ పైన విరిగిన కప్పు

ఎన్టీఆర్ ఘాట్ డోమ్ పైన కప్పు కొంత మేరకు విరిగిపోయి ఉంది. జయంతి రోజు ఆయనకు నివాళులు అర్పించడానికి ఎన్టీఆర్ అభిమానులు పెద్దఎత్తున వస్తారని తెలిసినా దానిని సరిచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎందరికో ఆరాధ్యుడైన ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారంటూ హెచ్ఎండీఏతో పాటు ప్రభుత్వంపైనా ఎన్టీఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జయంతిని ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు అశోక్ కుమార్ జైన్, 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్, భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజు.. లక్ష మందికి..


'మహానాడు'లో ఎన్టీఆర్‌కు ఇష్టమైన వంటకాలు

వెజ్, చికెన్, మటన్‌తో భోజనాలు

కడప రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): కడప గడ్డపై జరుగుతున్న మహానాడులో రెండో రోజు బుధవారం 3 పూటలకు కలిపి లక్ష మందికి భోజన వసతి కల్పించారు. రాయలసీమ రుచులతో పాటు టీడీపీ వ్యవస్థాపకుడు, విశ్వ విఖ్యాత... దివంగత ఎన్టీ రామారావుకు ఇష్టమైన నేతితో తయారు చేసిన స్వీట్లతో పాటు చక్కెర పొంగలి, వెజిటబుల్ పలావ్, చికెన్, మటన్ ఐటమ్స్‌తో భోజనాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజులా కాకుండా రెండో రోజు ఉదయం 11 గంటల నుంచే భోజనాలను ప్రారంభించారు. దీంతో భోజనం చేయదలుచుకున్న వారు ప్రతినిధుల సభ నుంచి అప్పుడప్పుడూ కొద్దికొద్దిగా వచ్చి భోజనం చేసి తిరిగి సభకు హాజరయ్యారు. స్టేజి సభ్యుల (వీవీఐపీ) భోజనశాల, వీఐపీ భోజనశాల, మీడియా భోజనశాల సాఫీగా కొనసాగింది. వేర్వేరుగా రెండు చోట్ల ఏర్పాటు చేసిన ప్రతినిధుల భోజనశాలలో మాత్రం కాస్త రద్దీగా కనిపించింది. రెండోరోజు సభకు లెక్కకు మించి ప్రతినిధులు హాజరయ్యారు. ఇందుకు తగ్గట్టుగా కౌంటర్లను పెంచకపోవడంతో కాస్త ఇబ్బందులకు లోనయ్యారు. అయినప్పటికీ ఎలాంటి లోటుపాట్లు లేకుండా అందరికీ భోజనం అందించగలిగారు. లెక్కకు మించి ప్రతినిధులు హాజరవుతారని తాము ముందుగానే ఊహించి భోజనాలను సిద్ధం చేసినట్లు వంట కాంట్రాక్టర్ కిలారు వెంకటశివాజీ తెలిపారు. ఉదయం అల్పాహారంలో స్వీట్‌తో కేసరి, టమాటా బాత్, ఉప్మా, ఇడ్లీ, వడ, సాంబారు, పల్లీ చట్నీ, టమాటా చట్నీలను అందించామన్నారు.

5 లక్షల మందితో.. నేడే టీడీపీ బహిరంగసభ

మహానాడు చివరిరోజు గురువారం కడపలో నిర్వహించే బహిరంగ సభను సీఎం చంద్రబాబు, లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. 5లక్షల మందితో నభూతో సభ జరిపి.. జగన్ సొంత జిల్లాలో పసుపు సైన్యం సత్తా చాటాలని పట్టుదలతో ఉన్నారు. సాయంత్రం 4 గంటలకు మహానాడు వేదిక వద్దే ఈ సభ జరుగుతుంది. కడప సహా రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేస్తున్నారు. ఒక్క ఉమ్మడి కడప జిల్లా నుంచే 2.10 లక్షల మందిని తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కడప, కమలాపురం, రాయచోటి నియోజకవర్గాల నుంచి 40వేల చొప్పున.. మైదుకూరు-30 వేలు, రాజంపేట, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, రైల్వేకోడూరు నుంచి 20వేల మంది చొప్పున తరలించాలని నిర్ణయించారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలు మొత్తం 5వేల వాహనాలను ఇందుకు వినియోగించనున్నారు. బుధవారం మహానాడు ప్రాంగణంలో మంత్రులు అనిత, నారాయణ, రాంప్రసాద్‌రెడ్డి సభ ఏర్పాట్లపై చర్చించారు.



పసుపు పండుగ

జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఏకగ్రీవ ఎన్నిక

టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. బుధవారం కడప మహానాడు వేదికపై జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ఫలితాన్ని ఎన్నికల కమిటీ చైర్మన్ వర్ల రామయ్య ప్రకటించారు. చంద్రబాబు నామినేషన్‌ను 21 మంది ప్రతిపాదించారు. వీరిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, పొలిట్‌బ్యూరో సభ్యులు, కార్యకర్తలు ఉన్నారు. అనంతరం చంద్రబాబుతో వర్ల రామయ్య ప్రమాణస్వీకారం చేయించారు. 1995లో ఆయన మొదటిసారి పార్టీ పగ్గాలు చేపట్టారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.



పార్టీకి ధర్మకర్తనే!

ఎన్టీఆర్ వారసత్వాన్ని కాపాడుకుంటున్నాం
భావి నాయకత్వాన్ని సిద్ధం చేస్తున్నాం
సీఎం చంద్రబాబు

(మహానాడు ప్రాంగణం నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి)

తెలుగుదేశం పార్టీకి తాను ధర్మకర్తను మాత్రమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ ఇచ్చిన వారసత్వాన్ని కాపాడుకుంటూ.. మళ్లీ భవిష్యత్ నాయకత్వాన్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 'పార్టీ చిరస్థాయిగా ఉండాలి. తెలుగు కుటుంబం నం.1 కావాలి. అది జరగాలంటే లోకేశ్ ప్రతిపాదించిన ఆరు శాసనాల్లో కార్యకర్తే అధినేత అనేది చాలా కీలకాంశం' అని చెప్పారు. ఈ ఆరు శాసనాలూ తెలుగువారి చరిత్ర తిరగ రాయబోతున్నాయన్నారు. మహానాడు రెండో రోజు ఆరు శాసనాలపై ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. 2047 నాటికి తెలుగుజాతిని ప్రపంచంలోనే నంబర్ వన్ చేయాలన్నదే సంకల్పమని, దీనికోసం రాబోయే 40 ఏళ్లకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నామని తెలిపారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో పార్టీ పెట్టారని... ఆ మూల సిద్ధాంతం స్ఫూర్తితో మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో, పాలనా విధానాల్లో నూతనత్వం కోసం ఆరు శాసనాలను తీసుకొచ్చామని చెప్పారు. 'పాత తరం విలువలు.. కొత్త తరం ఆలోచనలు, అవసరాలు కలిపి నా తెలుగు కుటుంబం పేరుతో ఆరు శాసనాలను లోకేశ్ ప్రతిపాదించారు. తెలుగు జాతిని ప్రపంచంలో నంబర్ వన్ చేయడానికి రోడ్ మ్యాపే ఆ శాసనాలు. పార్టీ, రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వాటిని ప్రవేశపెట్టిన లోకేశ్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. సాధారణంగా జరిగే మహానాడును నూతనంగా ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన శాసనాలు దోహదపడ్డాయి. ఆయన బాగా చదువుకున్నారు. టెక్నాలజీని ఉపయోగిస్తూ నూతన విధానానికి శ్రీకారం చుట్టారు' అని తెలిపారు. జూన్ 12న తల్లికి వందనం కింద రూ.15వేలు చొప్పున ఇస్తామని.. ఆగస్టు 15నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు, ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే...


నేతలూ జాగ్రత్త..

నేనెప్పుడూ జాగ్రత్తగా ఉంటాను. కానీ వివేకానందరెడ్డి హత్య విషయంలో నన్నే మోసం చేశారు. తెల్లారి ఆ సాక్షి పేపర్, టీవీలో గుండెపోటు అని ప్రచారం చేశారు. అందరితోపాటు నేనూ నమ్మాను. సాయంత్రానికి మలుపులే మలుపులు. ఏమీ జరగనట్లు కథ అల్లారు. రెండో రోజున నారాసుర రక్త చరిత్ర అంటూ నాపై నెపం వేశారు. కరుడు కట్టిన నేరస్థులతో రాజకీయం చేస్తున్నాం. కనుక అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే. నేరస్థులూ ఖబడ్దార్.. కొందరు మన దగ్గర ఉండి ప్రత్యర్థులకు కోవర్టులుగా పనిచేస్తూ వారి ప్రోత్సాహంతో హత్యారాజకీయాలు చేస్తున్నారు. మన వేలితో మన కన్నే పొడుస్తున్నారు. జాగ్రత్తగా ఉండాలి. వలస పక్షులు వస్తాయ్.. పోతాయ్. నిజమైన కార్యకర్త నిలిచి ఉంటాడు. మన కార్యకర్తలు కూడా తప్పుడు పనులు చేస్తే ఉపేక్షించను.

కార్యకర్తలు మెచ్చిన నేతలకే పదవులు..

టీడీపీలో కొత్త తరహా పరిపాలనకు శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు గ్రామ శాఖ, మండల, జిల్లా, రాష్ట్ర శాఖలు ఉంటే.. ఇప్పుడు క్లస్టర్, యూనిట్, బూత్ విధానం తీసుకొచ్చాం. ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాలు తీసుకుంటున్నాం. కార్యకర్తలు, ప్రజలు ఎవరిని మెచ్చితే అలాంటి నేతలకే పదవులు అప్పగిస్తున్నాం. 43 ఏళ్లుగా టీడీపీ జెండా రెపరెపలాడుతుంటే దానికి కారణం కార్యకర్తల త్యాగాలే. వారి సంక్షేమం కోసం పనిచేస్తాం. పార్టీ మీకు అండగా ఉంటుంది. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్‌లో మనవారికి ప్రాధాన్యం ఇచ్చేందుకు ఆలోచిస్తున్నాను. రాజకీయ, పాలనా అంశాల్లో రాష్ట్రం ఫస్ట్. పార్టీ విషయంలో కార్యకర్తే ఫస్ట్. కార్యకర్తే అధినేత. ప్రాంతీయ పార్టీగా పుట్టిన టీడీపీలో సభ్యత్వాల సంఖ్య నేడు కోటికి చేరింది. ఇదీ మన బలం. తొలిసారి అసెంబ్లీకి వచ్చిన వాళ్లు మన పార్టీ నుంచి 61 (65 మందికి టికెట్లు ఇచ్చాం) మంది ఉన్నారు. యువతకు అవకాశం ఇచ్చాం. మరో 40 ఏళ్లు తిరుగులేని శక్తిగా తెలుగువారికి సేవ చేయడానికి కొత్త నాయకత్వాన్ని తెచ్చాం.

> మన కార్యకర్తలను ఇబ్బంది పెట్టడానికి ప్రత్యర్థి పార్టీ అనేక పన్నాగాలు పన్నుతోంది. తెలుగుదేశం ముసుగేసుకుని తప్పులు చేస్తే ముసుగు తొలగిస్తాం. ఏం చేయాలో అది చేస్తాం.
>
> అవకాశవాదుల విషయంలో పార్టీ నేతలే కాదు.. కార్యకర్తలు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల తర్వాత వచ్చే వారిని ప్రోత్సహించవద్దు. మన కార్యకర్తలను ఇబ్బంది పెట్టినవారిని పార్టీలోకి తీసుకోవద్దు. మహానాడు వేదికగా నాయకులకు ఇదే నా గట్టి సూచన.
>
> నాలెడ్జ్, టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కలిగిన యువత ప్రపంచ విజయాలను సాధిస్తోందనేది నా నమ్మకం. ఇది సీబీఎన్ కోట్. అందరూ గుర్తుపెట్టుకోండి. మళ్లీ జన్మంటూ ఉంటే తెలుగుజాతి కోసం ఇదే గడ్డపై పుట్టి రుణం తీర్చుకుంటా.



6 శాసనాలే శిరోధార్యం

లోకేశ్ తీసుకొచ్చిన 6 శాసనాలు మనకు శిరోధార్యం కావాలి. అందులో సోషల్ ఇంజనీరింగ్ ఒకటి. కులగణన ద్వారానే ఇది సాధ్యం. కేంద్రం కూడా కులగణన చేయాలని నిర్ణయించింది. ఇందుకు ప్రధాని మోదీకి మహానాడు వేదికగా ధన్యవాదాలు. పీ-4 వంటి విధానాలతో అట్టడుగు వర్గాలను ఆదుకుంటున్నాం. ఎవరైనా మహిళల జోలికొస్తే అదే వారికి చివరి రోజవుతుంది. రాజకీయ, సోషల్ మీడియా ముసుగులో మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిస్తే వదిలేది లేదు. చాలా కఠినచర్యలు ఉంటాయి. 2024 ఎన్నికల్లో టీడీపీలో 22 మంది మహిళలకు సీట్లు ఇస్తే 20 మంది గెలిచారు. ఇక్కడే కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఉన్నారు. ఆమెను ప్రత్యర్థులు తక్కువ అంచనా వేశారు. ఫలితం వాళ్లే చూశారు. ఇదీ మహిళా శక్తి.



రైతు సంక్షేమం మా ప్రాధాన్యం

టీడీపీ మూల సిద్ధాంతంలోనే రైతు సంక్షేమం ఉంది. సాగునీటి ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాం. యాంత్రీకరణ, రుణాలు, సబ్సిడీలు, మట్టిపరీక్షల ద్వారా రైతుకు సాయంగా నిలిచాం. 30ఏళ్ల క్రితమే ఇజ్రాయెల్ నుంచి డ్రిప్, తుంపర్ల సేద్య పద్ధతులను తీసుకొచ్చాం. ఈరోజు సీమలో డ్రిప్ లేని ప్రాంతం లేదు. తెలుగు రైతుకు గుర్తింపు తెచ్చేలా ఆగ్రిటెక్ పాలసీ అమలు చేస్తాం. ఏజెన్సీలో గిరిజన ఉత్పత్తులు కాఫీ, కోస్తాలో ఆక్వా, రాయలసీమలో హార్టీకల్చర్‌తో రైతుల జీవితాలు మారుస్తాం. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు, పోలవరం పూర్తి చేస్తాం. జూన్ 12న ప్రతి రైతుకు అన్నదాతా సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు అందించబోతున్నాం

యువతకు అవకాశాలు

యువశక్తి మన బలం. అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. అందుకే యువగళం దశదిశలా మార్మోగేలా చేయాలని టీడీపీ సంకల్పం తీసుకుంది. గత ప్రభుత్వంలో యువత ఉద్యోగాలు అడిగితే గంజాయి, డ్రగ్స్ ఇచ్చారు. వాళ్ల జీవితాలు నాశనం చేసి, భవిష్యత్ లేకుండా చేశారు. దూసుకెళ్లే యువతరానికి మార్గనిర్దేశం చేసి, వారిద్వారానే మంచి సమాజాన్ని నిర్మించాలనేది నా ఆలోచన. నన్ను అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపినప్పుడు 70 దేశాల్లో ర్యాలీలు చేశారు. వీరంతా నేను ప్రారంభించిన ఐటీ ఉద్యమంతో ఫలితాలు పొందిన వాళ్లు. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటింగ్ డేటా, టెక్నాలజీ వంటి గ్లోబల్ నాలెడ్జ్ అందుబాటులో ఉంది. వీటిద్వారా ఆకాశమే హద్దు. హార్డ్‌వర్క్ అవసరం లేదు. స్మార్ట్ వర్క్ చేయవచ్చు. థింక్ గ్లోబలీ.. యాక్ట్ గ్లోబలీ. నాలెడ్జ్ ఎకానమీలో ఏపీని గ్లోబల్ సర్వీసెస్‌కు హబ్‌గా మారుస్తాం. క్రియేటివ్ ఎకానమీ సిటీగా అమరావతిని తీర్చిదిద్దుతాం. 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పటికే రూ.4.95 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాం. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం.

కంగ్రాట్స్ సీఎం సర్



చంద్రబాబును అభినందిస్తున్న మంత్రులు నిమ్మల, సవిత, గొట్టిపాటి, వర్ల, పల్లా, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్

అధినేతకు వెండి గద



చంద్రబాబుకు పది కిలోల వెండి గద బహుకరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.గోవర్ధన్ రెడ్డి

అధ్యక్షుడితో సెల్ఫీ ..!



మహానాడులో ఏర్పాటు చేసిన బాబు కటౌట్‌తో ఓ కార్యకర్త సెల్ఫీ



మహానాడులో మహిళా ప్రతినిధులు విజయసంకేతం

కెమెరాతో కేంద్ర మంత్రి



మహానాడు వేదికపై సరదాగా ఫొటోలు తీస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్

బాబును అరెస్టు చేసి చేయరాని తప్పు చేశారు

దాని ఫలితం అనుభవించారు.. వైసీపీపై రామ్మోహన్ ఫైర్

మహానాడులో రాజకీయ తీర్మానం.. బలపరచిన షరీఫ్, అమరనాథ్

మహానాడు రెండో రోజు కీలకమైన రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తీర్మానాన్ని తొలిసారి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రతిపాదించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం ఎన్ని దారుణాలను చేసిందో అందరం చూశామని, జననేత చంద్రబాబును అరెస్టు చేసి వారు చేయరాని తప్పు చేశారని, దాని ఫలితాన్ని కూడా వారు అనుభవించారని అన్నారు. 43ఏళ్ల పార్టీ.. చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో మరో 40ఏళ్ల ప్రయాణానికి సిద్ధమవుతోందన్నారు. ఈ తీర్మానాన్ని ఎం.ఏ షరీఫ్, ఎన్.అమరనాథ్‌రెడ్డి బలపరిచారు.

రాజకీయ తీర్మానం క్లుప్తంగా ఇదీ..

తెలుగువారి ఆత్మగౌరవం ప్రమాదంలో పడినప్పుడు జాతి అస్తిత్వాన్ని కాపాడుకోవడంతో పాటు తెలుగుజాతి ఔన్నత్యాన్ని చాటడానికి ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 35 వేల కిలోమీటర్లు చైతన్యరథంపై తిరిగి.. పార్టీ స్థాపించిన 9నెలల్లోనే అధికారం దక్కించుకున్న చరిత్ర ఎన్టీఆర్‌ది, టీడీపీది. ఎన్టీఆర్ ఆశయసాధనకు ఆయన అడుగుజాడల్లోనే చంద్రబాబు నడుస్తున్నారు. 2014లో రాష్ట్ర విభజనతో నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధిపథాన నడిపించిన నేత ఆయన. 2024లో మరోసారి ప్రజాభిమానాన్ని దక్కించుకుని.. ఇచ్చిన హామీల అమలు దిశగా అడుగులు వేస్తున్న పార్టీ టీడీపీ. మనది జాతీయ బావాలున్న ప్రాంతీయ పార్టీ. తెలుగు ప్రజల ప్రయోజనాల కోసమే కాకుండా జాతీయ ప్రయోజనాల కోసం కూడా పనిచేయడం లక్ష్యం. పహల్గాంలో ఉగ్రదాడిని తీవ్రంగాఖండించింది. 2019-24 నడుమ ప్రతిపక్షం బాధ్యతను టీడీపీ సమర్థంగా నిర్వహించింది. ఐదేళ్లలో జగన్ అవినీతి, అరాచకాలపై పోరాడింది. వైసీపీ పాలనలో బాధితులుగా నిలిచిన వారికి యువగళం పాదయాత్రతో అండగా నిలిచింది. పార్టీ కేడర్‌లో ధైర్యాన్ని నింపింది. వైసీపీ పాలనలో మన జాతీయ అధ్యక్షుడు గతంలో ఎన్నడూ లేనన్ని అవమానాలు ఎదుర్కొన్నారు. అక్రమ కేసుల కారణంగా 53 రోజులు జైలు జీవితాన్ని అనుభవించారు. వైసీపీ అరాచకాలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారు. 2024 ఎన్నికల్లో 11 సీట్లే ఇచ్చి తిరుగులేని శిక్ష విధించారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర పునర్నిర్మాణానికి పునరంకితమవుతూ టీడీపీ ముందుకు సాగిపోతోంది. లోకేశ్ 6 శాసనాల అమలుకు పనిచేస్తూ మంచి ఫలితాలు సాధించడానికి కడప మహానాడు వేదికగా పునరంకితమవ్వాలని పిలుపిస్తున్నాం.

'తెలుగుజాతి - విశ్వఖ్యాతి' తీర్మానం ఆమోదం

లోకేశ్ ప్రవేశపెట్టిన ఆరో శాసనంపై చర్చ

కడప, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తొలిరోజు మంగళవారం మహానాడులో ఆరు శాసనాలను ప్రతిపాదించారు. అందులో ఐదింటిపై తొలిరోజే తీర్మానాలను ప్రవేశపెట్టి, ఆమోదించారు. ఆరో శాసనం 'తెలుగుజాతి-విశ్వఖ్యాతి' అంశాన్ని రెండోరోజు బుధవారం ప్రవేశపెట్టి ఆమోదించారు. ఎమ్మెల్యే, పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్‌బాబు ప్రవేశపెట్టగా, టీటీడీ బోర్డు మెంబరు, తెలంగాణ నేత నన్నూరి నర్సిరెడ్డి ఆమోదించారు.

తెలుగు జాతికి దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి: ఆనంద్‌బాబు

'తెలుగు జాతికి, భాషకు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్. చంద్రబాబు విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి సాంకేతిక, ఐటీ రంగాల్ని ప్రోత్సహించారు. ఇంజనీరింగ్ కాలేజీలు ప్రవేశపెట్టి సాఫ్ట్‌వేర్ రంగానికి బాటలు వేశారు. హైదరాబాద్‌ను సిలికాన్ వ్యాలీగా తీర్చిదిద్ది, హైటెక్‌సిటీ నిర్మాణం చేపట్టి మైక్రోసాఫ్, గూగుల్ వంటి అంతర్జాతీయ కంపెనీలను తీసుకొచ్చారు. బిల్‌గేట్స్, బిల్ క్లింటన్, టోని బ్లెయర్‌ను తెలుగు రాష్ట్రాలకు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుది. తండ్రి ఆశయాలకు అనుగుణంగా లోకేశ్ ఆధ్వర్యంలో తెలుగు జాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తారని ఆశిస్తున్నా.'

యుగ పురుషుడు ఎన్టీఆర్

జయంతి సందర్భంగా మహానాడు రెండో రోజు తొలి తీర్మానమే టీడీపీ వ్యవస్థాపకుడికి నివాళి

కడప, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా కడప మహానాడులో 'యుగపురుషుడు ఎన్టీఆర్‌కు ఘన నివాళి' తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించారు.

● సీఎం హోదాలో కోర్టుకెళ్లి సమాధానమిచ్చారు: అశోక్ గజపతిరాజు

'నాడు అన్న ఎన్టీఆర్‌పై కూడా అక్రమ కేసులు పెట్టారు. సీఎం హోదాలో కోర్టుకు వెళ్లి సమాధానం ఇచ్చారు. రూ.కోట్ల స్కాంలలో కొంతమంది వాయిదాలతో గిన్నిస్ రికార్డులకు ఎక్కుతున్నారు. చంద్రబాబును 52 రోజులు జైల్లో పెట్టినా ఆయన అధైర్యపడలేదు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తున్న చంద్రబాబు బాటలో అందరం నడవాలి.'

● లక్షల మంది త్యాగాల ఫలితమే ఇవాల్టి టీడీపీ: గోరంట్ల

'అనేక ఉత్తమ చిత్రాలను నిర్మించిన నిర్మాత, స్క్రీన్ ప్లే రైటర్, డైరెక్టర్, ఎడిటర్... అన్ని రంగాల్లో అద్వితీయమైన ప్రగతిని సాధించిన వ్యక్తి. నటుడిగా ఉన్నత స్థానంలో ఉండి, రాజకీయ పార్టీని ప్రారంభించి ఒక నూతన ఒరవడిని సృష్టించారు. లక్షలాది మంది కార్యకర్తల త్యాగాల ఫలితంగా ఇవాళ టీడీపీ నిలబడింది. టీడీపీ మరో 30 ఏళ్ల పాటు వరుసగా పాలన కొనసాగించాలి. సోషల్ మీడియాలో దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి.'



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న లోకేశ్, సవిత, అనిత, అనురాధ, సంధ్యారాణి, శ్రీనివాసరెడ్డి

● బలహీనవర్గాలకు అధిక సీట్లు కేటాయించిన ఎన్టీఆర్: చినరాజప్ప

'నాడు దివిసీమ ప్రజల కోసం జోలె పట్టిన మానవతావాది. కాంగ్రెస్ పాలనలో అరాచకాలను అరికట్టేందుకు పార్టీ పెట్టి 9 నెలల్లోనే విజయదుందుభి మోగించారు. అధిక సీట్లను బడుగు, బలహీన వర్గాలకు కేటాయించి మార్పునకు శ్రీకారం చుట్టారు.'

● తెలుగు వారి జీవితాల్లో వెలుగులు నింపారు: మంత్రి పయ్యావుల

'యావత్ దేశంలో తెలుగు పతాక కీర్తి ప్రతిష్ఠలను రెపరెపలాడించిన మహోన్నతుడు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అధికారం అందించిన మహావ్యక్తి. తెలుగుజాతి జీవితాల్లో వెలుగు నింపిన మహానుభావునికి ఘననివాళి అర్పిద్దాం.'


● తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్: టీడీ జనార్దన్

'తెలుగు జాతికి, తెలుగు ప్రజలకు అన్న ఎన్టీఆర్, చంద్రబాబు చేసిన సేవ భావితరాలకు తెలియాలని పుస్తకాలు ప్రచురించాను. రామారావు పోషించిన పాత్రలు సమాజంలో అన్ని వర్గాలనూ ప్రతిబింబించాయి. అందుకే తెలుగు ప్రజల గుండెల్లో ఉన్నారు.'



తెలంగాణలో ముక్కోడు, ఏపీలో తిక్కోడు పోయారు
-నన్నూరి నర్సిరెడ్డి

'మా తెలంగాణలో ముక్కోడు, మీ ఏపీలో తిక్కోడు పోయారు. పార్లమెంటులో ప్రధాన భూమిక పోషించే స్థాయి, సత్తా టీడీపీకి ఉందని నిరూపించిన ఘనత ఎన్టీఆర్‌ది. పేదలకు ఎన్టీఆర్ కిలో రూ.2కే బియ్యంతెస్తే, 20ఏళ్ల తర్వాత కేంద్రం దానిని ఆహార భద్రత చట్టంగా చేసింది. టీడీపీ నేడు చేసే ఆలోచన, దేశానికి 20ఏళ్ల తర్వాత మార్గదర్శకంగా నిలుస్తుంది. చంద్రబాబు 20ఏళ్ల కిందట తెచ్చిన జినోం వ్యాలీ నుంచి కరోనా కష్ట సమయంలో వ్యాక్సిన్ వచ్చింది. 20ఏళ్ల కిందట టూరిజం గురించి చెబితే అపహాస్యం చేసిన కమ్యూనిస్టులు నేడు ఆయనను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.'



కాపు మహిళలకు ఆర్థిక చేయూత

» 15 వేలు ఇచ్చేలా 'గృహిణి' పథకం.. కాపు కార్పొరేషన్ ప్రతిపాదన

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): కాపు మహిళలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు గృహిణి అనే పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోందని కాపు సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు వెల్లడించారు. ఈ పథకం ద్వారా కాపు మహిళలకు ఒక్కసారి (వన్‌టైం) కింద రూ.15 వేలు అందించాలని కార్పొరేషన్ ప్రతిపాదించింది. ఇందుకోసం రూ. 400 కోట్లు అవసరమని అంచనా వేసింది. ఎన్టీఆర్ జయంతి వేడుకలను బుధవారం తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సుబ్బారాయుడు మాట్లాడుతూ... చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కాపు సంక్షేమానికి రూ.4,600 కోట్లు కేటాయించిందని, ఏడాదిలో వాటి ఫలితాలు చూపిస్తామని తెలిపారు.

సింగిల్ మేజర్ స్థానంలో డ్యూయల్ మేజర్ డిగ్రీ

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): సాధారణ డిగ్రీ విద్యలో ఉన్నత విద్యామండలి కీలక మార్పు చేసింది. ప్రస్తుతం సింగిల్ మేజర్ డిగ్రీ విధానం అమల్లో ఉండగా.. తాజాగా డ్యూయల్ మేజర్ (రెండు ప్రధాన సబ్జెక్టులు) డిగ్రీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ మేరకు కొత్త విధానంపై బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి కాలేజీలు.. సింగిల్ మేజర్ నుంచి డ్యూయల్ మేజర్‌కు మారేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వాటి కాంబినేషన్లను సంబంధిత యూనివర్సిటీలు విడుదల చేస్తాయని తెలిపింది. దీంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ స్వరూపం మళ్లీ మారనుంది.

'విద్యాహక్కు' కింద 23,117 మందికి సీట్లు

అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద తొలి విడతలో 23,117 మందికి ప్రైవేటు పాఠశాలల్లో సీట్లు కేటాయించినట్లు సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. తొలి విడత లాటరీ సీట్ల జాబితాలను బుధవారం రాత్రి విడుదల చేశారు. రెండో విడత లాటరీ జూన్ 11న నిర్వహించి సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

క్షేత్రస్థాయి పర్యటనలో సుప్రీం న్యాయవాదులు

బాపట్ల, మే 28(ఆంధ్రజ్యోతి): కృష్ణా ట్రైబ్యునల్‌లో రాష్ట్రం తరఫున వాదిస్తున్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు క్షేత్రస్థాయి పరిశీలనకు శ్రీకారం చుట్టారు. ఏపీ తరఫున ట్రిబ్యునల్‌లో వాదనలను సమర్థవంతంగా వినిపించాలంటే క్షేత్రస్థాయి అవగాహన అవసరమని లాయర్లు భావించారు. సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు జైదీప్ గుప్తా, ఉమాపతి బుధవారం బాపట్ల జిల్లాలోని జిల్లెళ్లమూడి గ్రామంలో ఉన్న నల్లమడ వాగును, బకింగ్‌హాం కాలువ తీరుతెన్నులనూ పరిశీలించారు. ఈ బృందం వెంట ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ పీవీ సత్యనారాయణతో పాటు సీనియర్ సైంటిస్ట్ ఏ సాంబయ్య ఉన్నారు.

రాష్ట్రంలో మరో కొవిడ్ కేసు

ఏలూరు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలో మరొకరికి కరోనా సోకింది. దీంతో ఈ జిల్లాలో బాధితుల సంఖ్య మూడుకి చేరింది. మరొకరికి అనుమానంతో చికిత్స చేస్తున్నా నిర్ధారణ కావాల్సి ఉంది. ముసునూరు మండలం ఎల్లాపురం గ్రామానికి చెందిన వ్యక్తి(52) కొవిడ్ లక్షణాలతో ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. పరీక్షలో పాజిటివ్ అని తేలింది.

కొవిడ్‌తో చెన్నైలో 60 ఏళ్ల వృద్ధుడు మృతి

చెన్నై, మే 28(ఆంధ్రజ్యోతి): కరోనా చికిత్స కోసం చెన్నైలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరిన వృద్ధుడు (60) మరణించాడు. వారం రోజులుగా జ్వరం, దగ్గుతో బాధపడుతున్న వృద్ధుడిని ప్రత్యేక వార్డులో చేర్చి చికిత్స అందించారు. బుధవారం ఉదయం ఆయన మృతి చెందినట్లు ఆసుపత్రి అధికారులు పేర్కొన్నారు.

ఓఎంసీ దోషులకు టీ-హైకోర్టులో దక్కని ఊరట

హైదరాబాద్, మే 28(ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో సీబీఐ కోర్టులో దోషులుగా తేలి ఏడేళ్ల జైలుశిక్ష పడిన మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి సహా ఇతరులకు బుధవారం తెలంగాణ హైకోర్టులో ఎలాంటి ఊరటా లభించలేదు. ఈ కేసులో సీబీఐ కోర్టు తీర్పును సస్పెండ్ చేసి మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ గాలి జనార్దన్‌రెడ్డి, బీవీ శ్రీనివాస్‌రెడ్డి, వీడీ రాజగోపాల్, అలీఖాన్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లు గతవారం వెకేషన్ కోర్టు ఎదుట విచారణకు రాగా అత్యవసరం ఏమీలేదంటూ.. జస్టిస్ నందికొండ నర్సింగరావు విచారణను వాయిదా వేశారు. బుధవారం ఈ పిటిషన్లు జస్టిస్ కె.శరత్ విచారణ జాబితాలో తొలుత లిస్ట్ అయ్యాయి. అయితే, వ్యక్తిగత కారణాలతో ఈ పిటిషన్లను తాను వినలేనని (నాట్ బిఫోర్ మీ) ఆయన చెప్పారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వెకేషన్ కోర్టు సీనియర్ జడ్జి జస్టిస్ నగేశ్ భీమపాక దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో ఆయన జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణకు బదిలీ చేశారు. అప్పటికే సాయంత్రం 6.30 గంటలు కావడంతో ఆయన సైతం 'నాట్ బిఫోర్ మీ' అని ప్రకటించారు. రాత్రి దాదాపు 8 గంటల ప్రాంతంలో పిటిషనర్ల తరఫు న్యాయవాదులు మరోసారి గుర్తుచేయడంతో.. "ఈ పిటిషన్లను ఇప్పుడు విచారించి, సింగిల్ లైన్ ఆర్డర్‌లో తేల్చే అంశాలు కావ"ని జస్టిస్ నగేశ్ భీమపాక పేర్కొన్నారు. ఈ పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఎదుట ఉంచాలని.. ఆయన ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేశారు.

నెల్లూరు టు బద్వేల్ రయ్..రయ్



'నెల్లూరు టు బద్వేల్' నూతన గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రతిపాదిత మ్యాప్

(మొదటి పేజీ తరువాయి)

అంగీకారం తెలిపింది. నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టు రోడ్డు నుంచి కడప జిల్లా బద్వేల్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారిని నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం ఉన్న నెల్లూరు-బద్వేలు రోడ్డుకు(ముంబై హైవే) ప్రత్యామ్నాయంగా ఈ కొత్త గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మించనున్నారు. మనుబోలు మండలం గురువిందపూడి సమీపంలోని కృష్ణపట్నం పోర్టు రోడ్డు నుంచి బద్వేల్ మండలం గోపవరం వరకు 108.13 కిలోమీటర్ల మేర ఈ రహదారిని నిర్మించనున్నారు.

డీబీఎఫ్‌వోటీ పద్ధతిలో

పోర్టు రోడ్డు టు బద్వేల్ జాతీయ రహదారి ప్రాజెక్టును డిజైన్-బిల్డ్-ఫైనాన్స్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్‌వోటీ) పద్ధతిలో నిర్మించనున్నారు. మనుబోలు, పొదలకూరు, చేజర్ల, అనంతసాగరం, మర్రిపాడు మండలాల మీదుగా ఈ రోడ్డు నిర్మాణం జరుపుకోనుంది. ప్రస్తుతం కృష్ణపట్నం పోర్టు, ఇతర పరిశ్రమల నుంచి వాహనాలు రాయలసీమ ప్రాంతానికి వెళ్లాలంటే ముంబై హైవేపైనే ఆధారపడుతున్నారు. అది ఎక్కువ దూరం ఉండటమేగాక ఊళ్ల మధ్యలో సమయం, ఖర్చు ఎక్కువ అవుతోంది. ఈ క్రమంలోనే రెండేళ్ల కిందట పోర్టు రోడ్డు టు బద్వేల్ 4 వరుసల రహదారి ప్రతిపాదన తెరమీదికొచ్చింది. దీనికి కేంద్ర ప్రభుత్వం అప్పట్లోనే ప్రాథమిక ఆమోదం తెలపడంతో భూసేకరణ ప్రక్రియ మొదలైంది. దాదాపు 90 శాతానికి పైగా భూసేకరణ పూర్తయింది. మొత్తంగా ఈ రోడ్డు ప్రాజెక్టుకు రూ.3653.10 కోట్లను ఖర్చు చేయనున్నారు. తాజాగా కేంద్రం ఆర్థిక అనుమతి కూడా ఇవ్వడంతో టెండర్లు పిలవడమే మిగిలింది. వచ్చే నెలలో జాతీయ రహదారుల అథారిటీ(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు టెండర్లు పిలిచే అవకాశాలున్నాయి.

పారిశ్రామికీకరణకు ఊతం

పారిశ్రామికంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా అభివృద్ధి చెందుతోంది. విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ల పరిధిలో జిల్లా ఉండడం కలిసి వస్తోంది. ఇప్పటికే సాగరమాల ప్రాజెక్టు కింద సముద్ర తీరం వెంబడి జాతీయ రహదారి నిర్మాణం వేగంగా జరుగుతోంది. అదే సమయంలో క్రిస్ సిటీ పనులు వేగం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలో రాయలసీమకు కనెక్టివిటీని మరింత సులభతరం చేస్తూ నిర్మించనున్న పోర్టు రోడ్ టు బద్వేల్ జాతీయ రహదారితో పారిశ్రామికీకరణకు మరింత ఊతం లభించనుంది. ఈ రహదారి నిర్మాణం ఫలితంగా విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లోని కొప్పర్తి, హైదరాబాద్-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లోని ఓర్వకల్, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లోని కృష్ణపట్నంలకు మరింత కనెక్టివిటీ ఏర్పడుతుంది. సరుకు రవాణా సామర్థ్యాన్ని ఈ నూతన రోడ్డు ప్రాజెక్టు మరింత పెంచుతుందని కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది.

పశ్చిమ ప్రాంతానికి వరం!

నూతన జాతీయ రహదారి నిర్మాణం జిల్లా పశ్చిమ ప్రాంత వాసులకు కనెక్టివిటీని పెంచుతుంది. చెన్నై, గూడూరు వైపు నుంచి ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాలకు వెళ్లేవారికి ఈ రహదారి చాలా సులభంగా మారనుంది. అలానే పోర్టు, పరిసర పరిశ్రమల నుంచి ఇప్పటి వరకు భారీ వాహనాలు నెల్లూరులోకి వచ్చి వెళుతుండగా, ఇకపై ఆ బాధ ఉండదు. అలానే ముంబై హైవేపై పెద్ద వాహనాలు వెళుతుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. నూతన రహదారి పూర్తయితే ముంబై హైవేపై ట్రాఫిక్‌తో పాటు ప్రమాదాలు కూడా తగ్గనున్నాయి. ఇప్పటి వరకు కృష్ణపట్నం పోర్టు నుంచి బద్వేల్ వరకు 142 కి.మీ. ఉండగా, కొత్తగా నిర్మించే రహదారి ఫలితంగా ఆ దూరం 108 కిలోమీటర్లకు తగ్గుతుంది. ఈ జాతీయ రహదారిపై రెండు ప్రాంతాల్లో టోల్‌ప్లాజాలు నిర్మించనున్నారు. ఈ రోడ్డు పనులు మొదలైతే సుమారు 20 లక్షల పనిదినాల ఉపాధి లభిస్తుంది.

ప్రజలు మళ్లీ మమ్మల్ని గెలిపిస్తారు

» అప్పుడు వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తాం

» మహానాడు పెద్ద డ్రామా: జగన్



అమరావతి, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రజలు మళ్లీ తమను గెలిపిస్తారని, అప్పుడు వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని వైసీపీ అధ్యక్షుడు జగన్ అన్నారు. కడపలో మహానాడు పెట్టి తనను తిట్టడం సత్తా కాదని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరిస్తే అది నిజమైన సత్తా అవుతుందని వ్యాఖ్యానించారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ స్థానిక సంస్థల ప్రతినిధులతో భేటీ అయ్యారు. 'టీడీపీ అంటే.. తెలుగు డ్రామా పార్టీ. మహానాడు పెద్ద డ్రామా. కడపలో చంద్రబాబు పోజులు ఇస్తున్నారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ గాలికి వదిలేశారు. ఉచిత బస్సు కోసం మహిళలు ఎదురు చూస్తున్నారు. అమ్మఒడికి పంగనామాలు పెట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన లేవు. ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేశారు. వైద్యం కోసం పేదలు అప్పులపాలవుతున్నారు. ఏడాదిగా రైతు భరోసా అందక చంద్రబాబు పాలనలో రైతులు బాధలు పడుతున్నారు. ధాన్యం సహా ఏ పంటకూ కనీస మద్దతు ధర లభించడం లేదు. ఏడాది పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారు. ఉన్న 2.6 లక్షల మంది వలంటీర్లను తొలగించారు. మద్యం షాపుల్లో పనిచేసే 15 వేల మంది, రేషన్ బండ్లు నడుపుతూ జీవనోపాధి పొందే 20 వేల మందిని రోడ్డున పడేశారు. ఉద్యోగులకు ఐఆర్, పీఆర్సీ లేదు. డీఏ పెండింగ్‌లో పెట్టారు. చంద్రబాబు పాలనలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు. ఇసుక, మట్టి, సిలికా, క్వార్ట్జ్ లాంటి వనరులు దోచేస్తున్నారు.' అని జగన్ అన్నారు.

మద్యం ముడుపుల గుట్టు రట్టు!

(మొదటి పేజీ తరువాయి)


విజయవాడలోని జిల్లా జైలు వద్ద ఈడీ అధికారులు

అమ్మించి, పేదల నుంచి పిండుకుని దాచుకున్న అసలు దొంగకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో కలసి ఈడీ ఉచ్చు బిగిస్తోంది. జగన్ పాలనలో లిక్కర్ పాలసీ నుంచి రిటైల్ విక్రయాల వరకూ.. ముడుపుల వసూళ్ల నుంచి అంతిమ లబ్ధిదారుకు చేర్చడం వరకూ అన్నింట్లో చక్రం తిప్పిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి(ఏ-1)ని విజయవాడ జైలులో ఈడీ అధికారులు విచారించారు. బుధవారం ఉదయం 9 గంటలకు జైల్లోకి ప్రవేశించిన అధికారులు వందకు పైగా ప్రశ్నలు సంధించారు. 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ ప్రశ్నించారు. మొదట 'నాకేం సంబంధం' అంటూ బుకాయించిన కసిరెడ్డి.. అధికారులు ఆర్థిక లావాదేవీలు చూపడంతో నోరు విప్పాడు. అంతిమంగా ముడుపులు ఎక్కడికి చేరాయో, అసలు దొంగ ఎవరో వెల్లడించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు... మద్యం కుంభకోణంలో ఆర్థిక లావాదేవీలు, అక్రమాలు జరిగిన తీరు మొదలుకొని ముడుపులు సేకరించిన విధానం, వాటిని మళ్లించిన దారుల వరకూ రాజ్ కసిరెడ్డిని ఈడీ అధికారులు ప్రశ్నించారు. డిస్టిలరీస్ నుంచి తీసుకున్న కమీషన్లు నగదు రూపంలో ఎంత? బంగారం రూపంలో ఎంత? దుస్తులు, ఇతర గిఫ్టల ఇన్వాయిస్‌ల ద్వారా ఏ కంపెనీ ఎవరెవరికి ఎంత చేర్చింది? అనే వివరాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ప్రమోషనల్ గూడ్స్ రూపంలో హైదరాబాద్, ముంబై, ఢిల్లీలోని హవాలా ఆపరేటర్ల ద్వారా మనీలాండరింగ్ జరిగినట్లు నిర్ధారణకు వచ్చిన ఈడీ అధికారులు కొన్ని ఆధారాలు రాజ్ కసిరెడ్డి ముందుంచి ప్రశ్నించారు. ఇటీవల ముంబైలో సిట్ అధికారులకు ఈడీ అధికారులు సహకరించారు. అప్పుడే ముడుపులు చేరిన మార్గం, అంతిమ లబ్ధిదారుడి గుట్టు తెలిసింది. ఆ తర్వాత విజయవాడకు వచ్చిన ఈడీ అధికారులు మొత్తం కుంభకోణం ఎలా జరిగిందనే దానిపై సిట్ అందజేసిన ప్రత్యేక నోట్ ద్వారా లోతుపాతులు తెలుసుకుంది. రియల్ ఎస్టేట్ లింకులతో పాటు బినామీల ద్వారా బెంగళూరులో కొనుగోలు చేసిన భారీ ఆస్తుల వివరాలతో కూడిన ఐదు లేయర్ల డేటాను సమీక్షించుకున్న ఈడీ అధికారులు.. అందుకు అనుగుణంగా రాజ్ కసిరెడ్డిని ప్రశ్నించారు. మద్యం స్కామ్‌లో రాజ్ కసిరెడ్డితో పాటు ఇతర నిందితులు, మద్యం వ్యాపారులు, మాజీ అధికారులు సిట్‌కు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ముడుపులు ఎవరికి చేరాయో తెలిపోయింది.

ఈడీ ప్రశ్నల వర్షం

కొల్లగొట్టిన వేల కోట్ల రూపాయలను ఎక్కడికి చేర్చావ్ అని ఈడీ అధికారులు అడగ్గానే.. 'నాకేంటి సంబంధం' అంటూ ఏ1 మొదట్లో గట్టిగా మాట్లాడినట్టు తెలిసింది. కాసేపటి తర్వాత ఈడీ అధికారులు ఆధారాలు చూపడంతో గుటకలు మింగాడు. మూడున్నర వేల కోట్ల స్కామ్‌లో ఎక్కువ శాతం ముడుపులు ఎక్కడికి చేరాయో నెమ్మదిగా వెల్లడించినట్లు తెలిసింది. ఏ కంపెనీ నుంచి ఏ కంపెనీలోకి మళ్లించారు? ఎవరు చెబితే చేశావ్? ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు? అందులో బినామీలు ఎవరు? బంగారం కొన్నదెంత? కేవలం జీఎస్టీ చెల్లించి బిల్లులు తీసుకున్నది ఎంత? స్థిరాస్తి వ్యాపారులు ఎవరెవరు సహకరించారు? ఇతర బిజినెస్‌మెన్లు ఎవరున్నారు.. ఇలా ఈడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. రాజ్ కసిరెడ్డి మొండికేసిన ప్రతి చోటా ఆధారాలు చూపించి గుట్టు రాబట్టినట్లు తెలిసింది. వేల కోట్ల రూపాయలు దాచుకున్న అసలు దొంగ ఎవరో గుట్టు విప్పినట్లు సమాచారం. ముడుపుల రూటింగ్ రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లోకి వెళ్లింది ఎంత? బినామీల ద్వారా భారీగా కొనుగోలు చేసిన ఆస్తులు ఎన్ని?.. ముడుపుల సొమ్ము వెళ్లిన దారులు, హవాలా జరిగిన విధానం, అంతిమంగా లబ్ధిపొందిన వ్యక్తి ఎవరో అతి త్వరలో బయటికి రాబోతోంది.

పదో తరగతిలో 'దిద్దుపాట్లు'

(మొదటి పేజీ తరువాయి)

వెలుగు చూశాయి. మొత్తంగా జవాబు పత్రాల పునఃమూల్యాంకనం, పునఃపరిశీలనకు 66,363 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సుమారు 11 వేల మంది పేపర్లలో మార్కులు మారాయి. పేపరును దిద్దిన తర్వాత 4 విభాగాలుగా మార్కులు వేస్తారు. అందులో కొన్నింటిని కౌంటింగ్‌లోకి తీసుకోకపోవడం వల్లే తేడా జరిగిందంటున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో ఓ విద్యార్థినికి హిందీలో 49 మార్కులే వచ్చాయి. పునఃమూల్యాంకనం చేయించినా మార్పులు లేవని తేల్చారు. అయితే, పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకున్నవారికి జవాబు పత్రం పీడీఎఫ్ కాపీ ఇస్తారు. దానిని ఇద్దరు టీచర్లకు చూపించగా కనీసం మరో 40 మార్కులు వస్తాయని తెలిపారు. జవాబుపత్రంలో ఆరు పేజీలకు అసలు ఎలాంటి మార్కులు వేయకుండా కొట్టివేశారు. అవే జవాబులను ఇతర టీచర్లు పరిశీలించి సరైన సమాధానాలే రాసినట్లు చెబుతున్నారు.

మూడంచెల్లో..: విద్యార్థుల జవాబుపత్రాలను ఇతర జిల్లాలకు పంపుతారు. ఒక్కో టీచర్ రోజుకు కనీసం 40 పేపర్లు దిద్దాలి. ప్రతి ముగ్గురు మూల్యాంకనం చేసే టీచర్లకు ఒక చెకింగ్ టీచర్ ఉంటారు. ఆ టీచర్ దిద్దిన పేపర్లలో మొత్తం మార్కుల లెక్కింపు, ఏవైనా సమాధానాలకు మార్కులు వేయలేదా? అనేది పరిశీలిస్తారు. ఒకవేళ మొదటి టీచర్ పొరపాటు చేసినా చెకింగ్‌లో ఖచ్చితంగా పొరపాటు బయటపడాలి. ఆ తర్వాత చీఫ్ ఎగ్జామినర్ ప్రతి 20 పేపర్లలో ఏవైనా మూడు పేపర్లను పరిశీలిస్తారు. ఇలా మూడంచెల్లో ప్రక్రియ జరుగుతుంది.

రికార్డు.. తొందర!: ప్రతి సంవత్సరం మార్చి నెలాఖరుతో టెన్త్ పరీక్షలు పూర్తవుతాయి. ఇంటర్మీడియట్ అడ్మిషన్లు జూన్‌లో జరుగుతాయి. ఈ ఏడాది మాత్రమే ఇంటర్ విద్యా సంవత్సరాన్ని ముందుకు జరిపారు. అయినా విద్యార్థులు జూన్‌లో కాలేజీల్లో చేరొచ్చు. అలాంటప్పుడు టెన్త్ ఫలితాలను హడావుడిగా ఎందుకు విడుదల చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'రికార్డు సమయంలో ఫలితాలు ఇచ్చాం.' అని చెప్పుకోవడం కోసమే ఇలా చేస్తున్నారు.

తీవ్రంగా పరిగణించాలి: సీఎం

టెన్త్ మూల్యాంకనంలో పొరపాట్లపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తంచేశారు. 'మహానాడు'లో ఉన్న ఆయన దీనిపై ఆరా తీశారు. మార్కుల్లో వ్యత్యాసం రావడం తీవ్ర తప్పిదంగా పరిగణించాలన్నారు. బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో ఐదుగురు అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లను పాఠశాల విద్యాశాఖ సస్పెండ్ చేసింది. వీరిలో అన్నమయ్య జిల్లాలో ముగ్గురు, నెల్లూరులో ఇద్దరు ఉన్నారు. కాగా, దీనిపై పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి వివరణ ఇచ్చారు. రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ ప్రక్రియ జూన్ 1 నాటికి పూర్తవుతుందన్నారు. ట్రిపుల్ ఐటీల్లో దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి జూన్ 2, 3 తేదీల్లో అవకాశం కల్పిస్తారని తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965

బంద్ చేయాలన్నది దిల్‌రాజు సోదరుడే


అనుశ్రీ సత్యనారాయణ

» హరిహర వీరమల్లుపై కుట్రతోనే 'థియేటర్ల' వివాదాన్ని తెరపైకి తెచ్చారు

» డైవర్ట్ చేయడానికి దిల్‌రాజు నన్ను టార్గెట్ చేశారు

» పార్టీకి ముడిపెట్టి పవన్‌కు తప్పుడు సమాచారం

» బంద్ అన్న మాటే నేను అనలేదు

» డిస్ట్రిబ్యూటర్ అనుశ్రీ సత్యనారాయణ వెల్లడి

రాజమహేంద్రవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సినిమా హరిహర వీరమల్లును తొక్కేద్దామనే కుట్రతో థియేటర్ల వివాదాన్ని తెరపైకి తెచ్చారని జనసేన రాజమండ్రి సిటీ మాజీ ఇన్‌చార్జి, సినీ డిస్ట్రిబ్యూటర్(అత్తి) అనుశ్రీ సత్యనారాయణ ఆరోపించారు. విడుదల తేదీని ప్రకటించాక జూన్ 1నుంచి థియేటర్లు బంద్ చేయాలని నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో చెప్పింది దిల్ రాజు సోదరుడు శిరీష్‌రెడ్డే నన్నారు. తాను బంద్ అన్న మాటే అనలేదని, దిల్‌రాజు తన సోదరుడు అన్న మాటలను డైవర్ట్ చేయడానికి తనను టార్గెట్ చేశారని చెప్పారు. జనసేనకు ముడిపెట్టి మరీ పవన్ కల్యాణ్‌కు తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నారని విమర్శించారు. థియేటర్ల బంద్ వివాదం నేపథ్యంలో సత్యనారాయణపై దిల్‌రాజు ఆరోపణలు చేయడం, ఆయన్ను పార్టీ నుంచి తాత్కాలికంగా పక్కన పెట్టడం తెలిసిందే. దీనిపై సత్యనారాయణ బుధవారం రాజమహేంద్రవరంలో మీడియాతో మట్లాడారు. 'హరిహర వీరమల్లు విడుదల తేదీని ప్రకటించాక పర్సంటేజీ అమలు చేయకపోతే జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ చేస్తామని శిరీష్ రెడ్డి అనడం వాస్తవం కాదా? ఏప్రిల్ 19న ఉమ్మడి తూర్పుగోదావరికి సంబంధించి ఎగ్జిబిటర్ల ఇబ్బందులపై మాత్రమే చర్చించుకున్నాం. బంద్ అనే పదాన్ని నేను వాడలేదు. మే 13న ఓ జర్నలిస్టుకు వివరణ ఇస్తూ.. పర్సంటేజీ విధానం అమల్లోకి రాకపోతే నష్టాలు భరించలేని వాళ్లు థియేటర్లు మూసేసుకోవడం తప్ప గత్యంతరం లేదని స్పష్టం చేశాను. కేవలం జిల్లాకు సంబంధించే అభిప్రాయం చెప్పాను. శిరీష్‌రెడ్డిని కాపాడుకోవడం కోసం దిల్‌రాజు నీచానికి ఒడిగట్టారు. నన్ను టార్గెట్ చేశారు. మా అధినేతకు అన్నీ తెలుసు. ఎవరికి ఎలాంటి రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలో అదే ఇస్తారు. చిత్ర పరిశ్రమలో వివాదానికి ఆ నలుగురే కారణం. ఆ నలుగురు ఎవరనేది ప్రజలకు స్పష్టత ఇవ్వాలని మంత్రి దుర్గేష్ ఆదేశించడంతో ప్రెస్‌మీట్ పెట్టాను. ఆ నలుగురు ఎవరంటే.. దిల్‌రాజు, ఏషియన్ ఫిల్మ్ సునీల్, శిరీష్‌రెడ్డి, సురేశ్‌బాబు. పవన్ మాకు దేవుడితో సమానం. ఆయన సినిమాపై కుట్రచేస్తామా? ఎగ్జిబిటర్ల మనుగడపై 2024 మే 21న తెలంగాణ ఫిల్మ్ చాంబర్‌లో చర్చ జరిగింది. 73% డిస్ట్రిబ్యూటర్‌కు, 27% ఎగ్జిబిటర్‌కు అని చెప్పారు. జూలై 1 నుంచి అమలు చేస్తామని శిరీష్‌రెడ్డి తొడగొట్టి చెప్పారు. గేమ్‌చేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు ఉన్నాయని అమలు చేయలేదు. వాటికి దిల్ రాజు ప్రొడ్యూసర్ కాగా.. ఓ సినిమాలో సురేశ్‌బాబు తమ్ముడు వెంకటేశ్ హీరోగా నటించారు' అని చెప్పారు.

వారి చేతుల్లోనే 'నైజాం'

'నైజాంలో దిల్‌రాజు, ఏషియన్ సునీల్, సురేశ్‌బాబు ఒకటిగా ఉంటారు. కొత్తగా ఎవరు వచ్చినా బతకనివ్వరు. 90% థియేటర్లు వారి చేతుల్లో ఉండడంతో ప్రొడ్యూసర్లను గ్రిప్‌లో పెట్టుకుంటారు. వరంగల్ శ్రీను అనే వ్యాపారవేత్త సినీరంగంలోకి వస్తే ఆయనపై వీళ్లు అరాచకాలు చేశారు. ఇస్మార్ట్ శంకర్ అనే సినిమాకు థియేటర్లు లేకుండా చేశారు. చిరంజీవి ఆచార్య సినిమాకు కూడా ఇబ్బందులు పెట్టారు' అని సత్యనారాయణ అన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

» కృష్ణాలో మంచినీటి బాటిల్ రూ.50కి విక్రయం

» 'తూర్పు'లోని హాళ్లలో అధ్వానంగా పారిశుధ్యం

» విజయనగరంలోని థియేటర్‌లో చిప్స్ ప్యాకెట్‌పై తయారీ తేదీ జూన్ 1గా ముద్రణ.. నిలదీసిన జేసీ

» చిత్తూరులో లైసెన్స్ లేకుండా నడుస్తున్న థియేటర్

» గీతదాటిన యాజమాన్యాలకు నోటీసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా సినిమా థియేటర్లలో తనిఖీలు బుధవారం మరింత విస్తృతంగా కొనసాగాయి. రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు ఉమ్మడిగా సోదాలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. గుంటూరు జిల్లాలోని కొన్ని థియేటర్ల వద్ద తగినంత పార్కింగ్ ప్రదేశం లేకపోవడంతో వాహనదారులు రోడ్ల పైనే పార్కింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని వీవీఆర్ థియేటర్‌లో వాటర్ బాటిల్‌ను రూ.50కు విక్రయిస్తున్నట్లు తేలింది. తూర్పుగోదావరి జిల్లాలోని పలు థియేటర్లలో టికెట్లు, అల్పాహారం, కూల్‌డ్రింక్స్ ధరలు అధికంగా ఉన్నాయని, పారిశుధ్య నిర్వహణ సరిగాలేదని జేసీ చిన్న రాముడు తెలిపారు. యాజమాన్యాలు ధరల పట్టికలను కచ్చితంగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లె థియేటర్లలో ఆహార పదార్థాలు, కూల్‌డ్రింక్స్ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ప్రేక్షకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు జిల్లాలో తనిఖీల్లో కొన్ని థియేటర్లు లైసెన్స్ లేకుండా నడుస్తుంటే మరికొన్ని ఫైర్ సర్టిఫికెట్ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయడం లేదు. మరుగుదొడ్ల దుర్వాసన వెదజల్లుతున్నాయి. సినిమా టికెట్ రేట్ల కన్నా పాప్‌కార్న్, తినుబండారాల ధరలు అధికంగా ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు ద్విచక్రవాహనానికి రూ.20, కారుకు రూ.40 చొప్పున వసూలు చేస్తున్నట్లు తేలింది. శ్రీకాకుళంలో 'సూర్య మహల్' థియేటర్‌లో పారిశుధ్యం మెరుగ్గా లేకపోవడం.. కూల్‌డ్రింక్‌లను విడిగా (పరిమాణానికి తగ్గట్టు లేకపోవడం) విక్రయిస్తుండటం.. ధరలు పట్టిక లేకపోవడం వంటి లోపాలను గుర్తించారు. థియేటర్‌లో ఫుడ్ లైసెన్స్ కాలపరిమితి తీరిపోవడంతో యాజమాన్యానికి నోటీసులు జారీచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. విజయనగరంలోని ఎన్‌సీఎస్ థియేటర్‌లో చిప్స్ ప్యాకెట్‌పై తయారీ తేదీ జూన్ 1గా ముద్రించి ఉండడం చూసి జేసీ సేతుమాధవన్ ఆశ్చర్యపోయారు. అనంతపురం గౌరీ సినీ కాంప్లెక్స్ నిర్వహణకు అనుమతి 2023 వరకే ఉన్నట్లు గుర్తించారు. తనిఖీల విషయం ముందస్తుగానే తెలిసిపోవడంతో కొన్ని థియేటర్ల యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాయి.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*